


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



visit us @ http://epaper.suryaa.com
సోమవారం | 7 ఆగస్టు 2017 | విజయవాడ
సంపుటి 10 | సంచిక 278
| పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్ల, తిథి : పౌర్ణమి రా. 11.00 నక్షత్రం : శ్రవణం తె. 3.01, వర్జ్యం ఉ. 6.33 నుంచి 8.16 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు; దుర్ముహూర్తం: మ. 12.31 నుంచి 1.22 వరకు తిరిగి మ.3.04 నుంచి 3.55 వరకు, సూర్యోదయం: ఉ. 6.01 గం; సూర్యాస్తమయం: సా. 6.43 గం.



శ్రీలంకపై సీరీస్ విజయం




- మరో మ్యాచ్ మిగులుండగానే భారత్ కైవసం
- రెండో టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో శ్రీలంక ఓటమి
- ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో రెండో టెస్టు విజయం
- మూడు మ్యాచ్‌ల సీరీస్‌లో 2-0తో ఆధిక్యం
- భారత్ ఖాతాలో వరుసగా 8వ విజయం
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జడేజా
- శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో మ్యాచ్

6లో



నేడు చంద్ర గ్రహణం

- దేశవ్యాప్తంగా మూతపడనున్న ఆలయాలు
- తిరుమల శ్రీవారి ఆలయం కూడా
- అతిపెద్ద ఉల్కాపాతం నేటి నుంచి మొదలు
- కనువిందు చేయనున్న నక్షత్ర వాన



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : చంద్రగ్రహణం కారణంగా నేటి సాయంత్రం 4.30 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు మూసి ఉంచుతామని, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ తిరుమల మిగతా 6లో

బడుగుల ఆగ్రహ జ్వాల

పార్లమెంటులో బీసి బిల్లు ప్రవేశపెట్టాలని బిసి సంఘాలు డిమాండ్

- రాజధానిలో మారుమోగుతున్న నినాదాలు
- బీసీలకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్ల అమలు చేయాలి
- 70 ఏళ్ల స్వతంత్ర దేశంలో రాజకీయ రంగంలో బీసీలు14 శాతమే
- విద్యా, ఉద్యోగ, పారిశ్రామిక రంగాలలోనూ అణచివేత
- గుజ్జర్లు, జాట్లు, పటేళ్ల తరహాలో తెగించి పోరాటం చేసేందుకు సై
- జంతర్ మంతర్ వద్ద రెండవరోజుకు చేరిన బీసీ సంక్షేమ సంఘం దీక్షలు
- దీక్షలో పాల్గొన్న పలు రాష్ట్రాల బీసీ నేతలు



హైదరాబాద్, మేజర్ న్యూస్‌: సామాజిక, ఆర్థికరంగాలతో పాటు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ బీసీలు నినదిస్తున్నారు. న్యాయపరమైన కోర్కెల సాధనకోసం దేశ రాజధాని ఢిల్లీలో బీసీలు నినదిస్తున్నారు. గల్లీ నుంచి ఢిల్లీకి వెళ్లిన బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు పలు రాష్ట్రాలకు చెందిన బీసీ నేతలు తరలివచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు. బీసీల నినాదంతో ఢిల్లీ మారుమ్రోగుతోంది. చట్ట సభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అసెంబ్లీ- పార్లమెంటులో ఇంత వరకు ప్రాతినిద్యం దక్కని కులాలకు 20శాతం అదనంగా సీట్లను సృష్టించి ఆంగ్లో ఇండియన్ల మాదిరిగా నామినేట్ చేయాలని, ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే జాతీయ బీసీ కమిషన్‌కు మిగతా 6లో



వేదన వర్ణనాతీతం

అత్యాచారం జరిగినా చెప్పని వారెందరో

- 70 శాతం మంది ఫిర్యాదు చేయడానికే రావడం లేదు
- ఫిర్యాదుల్లో శిక్షలు పడని కేసులు 80 శాతం
- పరువు సమస్యగా భావిస్తున్న ఎంతో మంది తల్లిదండ్రులు
- నిర్భయ వంటి చట్టాలు వచ్చినా న్యాయం దూరమే
- జాతీయ మహిళా కమిషన్ సెక్రటరీ సత్బీర్ బేడీ
- సెక్సువల్ హెరాస్‌మెంట్‌పై ప్రత్యేక సదస్సు
- ఫిర్యాదుకు ముందుకు రాని వారికి సహాయం అందించాలని నిర్ణయం
- బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్న వక్తలు

వివరాలు 5లో

నీతీ ఆయోగ్ వీసీగా రాజీవ్ కుమార్



వివరాలు 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

బీజేపీ దోస్తీ ఎవరితో?

- టీడీపీతోనేనా లేక వైసీపీతోనా!
- వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ, జనసేనతో బంధం కొనసాగుతుందన్న నారా లోకేష్
- మరి వైసీపీ పరిస్థితి ఏమిటీ?
- రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ మద్దతును స్వాగతించిన బీజేపీ
- మైత్రి విషయంలో బీజేపీ జాతీయ నాయకత్వం నోరు విప్పేదెప్పుడు
- బీజేపీ మౌనం వ్యూహాత్మకమేనా?
- తెలుగు రాష్ట్రాల్లో బలపడటమే లక్ష్యంగా వ్యూహాలకు పదును
- బీజేపీతో జతకట్టేందుకు టీడీపీ, వైసీపీ కుతూహలం?
- ఈ రెండింటిలో కమల దళం ఎవరికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందో?





హైదరాబాద్, మేజర్‌న్యూస్ : దక్షణాది రాష్ట్రంలో కాలు మోపాలని భావిస్తున్న బీజేపీ జాతీయ నాయకత్వం తన కమల వికాసం ఏ విధంగా చేసుకోనున్నది, మరీ ముఖ్యంగా ఏపీలో తనకంటూ ప్రత్యేక బలం లేకపోయినా ఇక్కడా కూడా స్వతహాగా బలపడాలని చేస్తున్న ఆలోచనకు బలమైన పునాది ఏమిటీ అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని పార్టీలు తమ దోస్తుల వేతుకులాట సైతం మొదలెట్టేస్తున్నారు. కానీ రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలుగా ఉన్న అధికార టీడీపీ, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ రెండూ కూడా కమలదళంతో జతకట్టేందుకు కుతూహలంగా ఉన్నాయి. కానీ బీజేపీ ఎవరితో కలుస్తుందన్న స్పష్టత ఇంత వరకు రావడంలేదు. ఈ మౌనం వెనక బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహం దాగివుందా అన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇటీవల ఓ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ పార్టీ ఏ పార్టీతో కలసి పనిచేస్తుందన్నది కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. గత సాధారణ ఎన్నికల్లో బీజేపీతో జతకట్టి పోటీచేసిన టీడీపీ ఆ ఎన్నికల్లో జనసేన మద్దతు కూడా తీసుకొచ్చింది. ఇదే విషయమై స్పందించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ, జనసేనతో తమ పార్టీ బంధం కొనసాగుతుందని వెల్లడించారు. వైసీపీ జాతీయ ప్లీనరీ వేదికగా ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సైతం తమ పార్టీ బీజేపీతో జతకట్టే విషయంలో ఓ స్పష్టత ఇచ్చారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశం ఇక్కడ ఓ సెంటిమెంటుగా బలపడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లౌక్యం, దౌత్యం, పోరాటంతో ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తామని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో లౌక్యం, దౌత్యం అన్న వ్యాఖ్యల ద్వారా జగన్మోహన్‌రెడ్డి బీజేపీ పట్ల తన సానుకూల ధోరణిని ప్రదర్శించారని నాడు రాజకీయ వర్గాల్లో సైతం మిగతా 6లో



త్వరలో నంద్యాలను జిల్లాగా మారుస్తాం

డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి



కర్నూలు, మేజర్‌న్యూస్ : నంద్యాలను జిల్లా కేంద్రంగా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ కవష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుపై ప్రతిపక్ష నేత జగన్ అనుచిత వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకోవడం హర్షణీయమన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు తెలుగుదేశం పార్టీదేనని, వైసీపీ ఎంత ప్రయత్నించినా గెలవడం జరగదన్నారు.

టిడిపిలోకి మంత్రి కామినేని?

- టీడీపీ తీర్థం పుచ్చుకోనున్న మంత్రి కామినేని శ్రీనివాస్?
- బీజేపీకి గుడ్ బై?



విజయవాడ, మేజర్‌న్యూస్ : ఏపీ మంత్రి, బీజేపీ నేత కామినేన్ శ్రీనివాస్ టీడీపీలో చేరనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఆయన బీజేపీకి గుడ్ బై చెప్పడం ఖాయమని చెబుతున్నారు. ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో విచిత్రమైనటువంటి పరిస్థితి నెలకొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఇటు టీడీపీ, అటు వైసీపీ రెండూ కలిసే ఉంటున్నాయి. బీజేపీతో పూర్తి స్థాయిలో పొత్తు పెట్టుకోవడానికి వైసీపీ ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో, రానున్న రోజుల్లో ఒకవేళ బీజేపీతో టీడీపీ తెగదెంపులు మిగతా 6లో

చంద్రులకు మావోల ముప్పు

- శివారుల్లో మావోల ముప్పు
- తెలుగు రాష్ట్రాల సిఎంలకు ముందస్తు సూచనలు
- పర్యటనల్లో అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని హెచ్చరిక
- క్రమేణా పుంజుకుంటున్న మావోలు
- రిక్రూట్‌మెంట్ కోసం వినూత్న మార్గాలు



హైదరాబాద్,(మేజర్‌న్యూస్-నెట్‌వర్క్): మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో పర్యటనలు వద్దంటూ నిఘా వర్గాలు ఇరు రాష్ట్రాల సిఎంలకు సూచనలు చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాలలోని శివారు ప్రాంతాలలో మావోలు బలోపేతంగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో పర్యటనల విషయంలో ఆచీతూచీ వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనతికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలని నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈక్రమంలో మావోయిస్టులు బలపేతంగా ఉన్న ప్రాంతాలలో పర్యటనలపై ఇంటెలిజెన్స్ వర్గాలు దృష్టిసారించాయి. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. దీంతో సిఎం చంద్రబాబుకు సైతం ఇంటెలిజెన్స్ వర్గాలు ముందస్తు సూచనలు చేస్తూ భద్రతను పెంచాయి. 2019 ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇటు ప్రచారంలో భాగంగా కానీ, ఇతర ముఖ్య కార్రక్రమాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఏర్పాటు చేసుకోరాదని తెలుగు రాష్ట్రాల ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు ప్రభుత్వాలకు తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవల కాలంలో కేంద్ర,రాష్ట్రాలకు షాక్ ఇచ్చేలా మావోయిస్టు ఉద్యమం చాపకింద నీరులా విస్తరిస్తోందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. తెలంగాణలో మావోయిస్టులు క్రమేణ ఉనికి చాటుకుంటున్నారు. తెలుగు మిగతా 6లో

దత్తాత్రేయ ఆగ్రహం

- జిఎస్‌టిని తొలుత స్వాగతించింది తెలంగాణ ప్రభుత్వమే
- అన్ని రాష్ట్రాలతో అనేక సార్లు సమావేశాలు నిర్వహించాం
- ఆ సమావేశాలకు హాజరైన రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల
- జీఎస్టీ 12 శాతం నుంచి తగ్గే అవకాశం ఉంది
- రైతాంగానికి ఉపయోగపడే అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో చర్చిస్తా
- కేంద్ర మంత్రి దత్తాత్రేయ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోలేదని, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో పలు దఫాలుగా చర్చించి తీసుకున్న నిర్ణయమని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టులపై కేంద్రం తీసుకున్న 12శాతం జీఎస్టీ ఏకపక్ష నిర్ణయం కాదన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీఎస్టీ మిగతా 6లో

దేశంలో మార్పు రావాలన్నదే మోడీ సంకల్పం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః దేశంలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషిచే0స్తున్నారని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ చెప్పారు. ఇందుకోసం ప్రధాని సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. రవీంద్రభారతిలో ఆదివారం ఐ ఫోకస్ మిషన్ అధ్వర్యంలో మైత్రి వర్ధిని-2017 పేరిట నిర్వహించిన స్టార్టప్ ఫేస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

యువతకు నైపుణ్యాలు కల్పించి రాబోయే రోజుల్లో 2కోట్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలని మోడీ సంకల్పించారని తెలిపారు. నైపుణ్య శిక్షణలు పూర్తి చేసుకున్న యువతకు 10లక్షల నుంచి 2 కోట్ల రూపాయల వరకు ముద్రా బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నట్లు వెల్లించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి, జొన్నవిత్తుల తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల ప్రజలను ఫ్యాక్షన్ వైపు పురిగొల్పేలా జగన్ వ్యాఖ్యలు : పితాని సత్యనారాయణ

హైదరాబాద్,సూర్యప్రతి నిధి: రెచ్చగొట్టి జగన్ ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నాడని ఏపీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం మంత్రి మాట్లాడుతూ నంద్యాల ప్రజలను ఫ్యాక్షనిజం వైపు పురిగొల్పేలా మాట్లాడటం దారుణమన్నారు. విపక్షనేత ఇప్పటికైనా కూనీకోరు రాజకీయాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. జగన్ ప్రతిపక్ష నేతగా పూర్తిగా విఫలమైనాడని తెలిపారు.

సాధించుకున్న తెలంగాణలో జయశంకర్ లేకపోవడం బాధాకరం

- రాష్ట్ర వ్యాప్తంగా సార్ జయంతి
- పాల్గొన్న మంత్రులు, అన్ని పార్టీల నేతలు
- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నివాళులు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ప్రొఫెసర్ జయశంకర్ 83వ జయంతి వేడుకలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మంత్రులు, నేతలు మొదలుకుని సామాన్యులు వరకూ అందరూ జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకర్త జయశంకర్‌సార్ జయంతి వేడుకలను విపక్షపార్టీల నేతలు సైతం పాల్గొన్నారు. జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అధికారులు, సిబ్బంది నివాళ్లర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, అధికారులు మాట్లాడుతూ తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ అని ఆయన సేవలను కొనియాడారు. సాధించుకున్న తెలంగాణలో జయశంకర్ లేకపోవడం బాధాకరం.. జయశంకర్ అడుగుజాడల్లో నడుస్తామని వారన్నారు.కళ్లారా చూడకుండానే..

తెలంగాణ ఏర్పాటును కళ్లారా చూడాలని ఉంది.. ఆ తర్వాత మరణించినా ఫర్వాలేదు.. అని అనేవారు ఆచార్య జయశంకర్. ఆశ తీరక ముందే 2011 జూన్ 21న ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రొఫేసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ప్రధానగేటు వద్ద ఉన్న ప్రొఫేసర్ జయశంకర్ విగ్రహానికి ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు పూలదండవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఆయనతో పాటు రిజిస్ట్రార్, ఉన్నతాధికారులు నివాళ్లర్పించారు.విద్యుత్‌సౌధలో జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ట్రాన్స్‌కో డైరెక్టర్ జి.నర్సింగ్‌రావు, జెన్‌కో డైరెక్టర్ సల్లకొండ ఆశోక్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంకోసం ఫోరాడిన ధీరుడుః స్వామిగౌడ్

ప్రొఫెసర్ జయశంకర్ సర్ జయంతి సందర్భంగా శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ఆయన ఫోటోకు దండ వేసి నివాళులర్పించారు. స్థానిక టీఆర్ఎస్ నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామిగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ జాతిపిత అని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అహర్నిషలు కష్టపడిన మొదటి వ్యక్తి అని అందుకు ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి జీవిత కాలం పోరాడిన ధీరోదాత్తుడని కొనియాడారు. మన నీళ్ళ ,నిధులు,నియామకాలు తెలంగాణ ప్రజలకే చెందాలని ఆయన ఆకాంక్షించారని, రాష్ట్రం ఏర్పడి ఆ రోజులు వచ్చి నప్పటికీ ఆయన చూడలేకపోవడం బాధాకర మన్నారు.

610జీవోపై ఓనమాలు నేర్పారు : మంత్రి హరీశ్

సిద్ధిపేల జిల్లాలో జరిగిన జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ 610 జీఓ గురించి తనకు జయ శంకర్ సారే ఓనమాలు నేర్పారని తెలిపారు.మూడున్నర కోట్ల ప్రజల ప్రేమను పొందటమే జయ శంకర్ సారూకు ముఖ్యమైన ఆస్తి.అప్పటి కేంద్రమంత్రి చిదంబరం ప్రకటనకు రూపకర్త జయ శంకర్ గారే. జయ శంకర్ సారూ భావవ్యాప్తి చేస్తూనే తెలంగాణ నిర్మాణం, ఉద్యమాన్ని కేసీఆర్ రూపంలో నడిపించారు.పిల్లలు తల్లిదండ్రులను.. ఏలాగైతే ప్రేమిస్తారో..!, తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఏలా గౌరవంగా ఉంటారో.. మన జయ శంకర్ సార్ పై అలాగే ఉంది అని అన్నారు. జయ శంకర్ సార్ జీవితమంతా కొన ఊపిరితో ఉన్నప్పుడు కూడా తెలంగాణాకే అంకితం చేశారని కొనియాడారు. 2001 మలిదశ ఉద్యమం కేసీఆర్ గారి చేతుల్లో పెట్టారు. ఎప్పుడూ కేసీఆర్ వెన్నంటి ఉండి.. సిద్ధాంత కర్తగా వ్యవహరించారు. పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేకుండా తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ఆదర్శంగా నిలిచిన వ్యక్తిగా చరిత్రపుటల్లో నిలిచిపోయారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్-1 పరీక్షలో, సిలబస్



బోధనలో జయ శంకర్ సారూ గురించి చేర్చడం అభినందనీయమన్నారు. సమాజాన్ని ప్రేమించాలని., ప్రేమాభిమానాలను చూపాలని జయశంకర్ సార్ సమాజానికి మంచి మెస్సేజ్ ఇచ్చార ని తెలిపారు. తెలంగాణ భావ వ్యాప్తి తగ్గిపోతున్న క్రమంలో తనదైన శైలిలో ప్రసంగాలు చేసి ఎంతగానో ఆకట్టుకునేలా తెలంగాణా ఆవశ్యకతను వివరించారని, తొలి దశ నుంచి మలిదశ ఉద్యమం దాక తెలంగాణపై జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ ..పోరాడిన ఘనత జయ శంకర్ సార్ కే దక్కుతుందని హరీశ్‌రావు తెలిపారు. జయశంకర్ సార్ బలం, బలహీనత తెలంగాణేనని.. 1952లో నాన్-ముల్కీ గో బ్యాక్ ఉద్యమం నుంచి 2010-11లో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆందోళన వరకు, ఫజల్ అలీ ఆధ్వర్యంలోని రాష్ట్రాల పునర్విభజన కమీషన్ (1954) నుంచి శ్రీకృష్ణ కమిటీ (2010) వరకు, ఇందిరాగాంధీ నుంచి సోనియా గాంధీ వరకు, కొండా వెంకటరంగారెడ్డి నుంచి కేసీఆర్ వరకూ అన్ని ఉద్యమాల్లో చురుగ్గా పనిచేస్తూ.., నివేదికలు, వాదనలు వినిపిస్తూ, నేతలకు సలహాలిస్తూ, ఎప్పటికప్పుడు తెలంగాణా ఉద్యమ దశా దిశను నిర్దేశిస్తూ మార్గదర్శిగా జయశంకర్ సార్ నిలిచినట్లు తెలిపారు.

తెలంగాణ కు మరో పదేళ్లు కేసీఆరే సీఎం : నాయిని



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రానికి మరో పదేళ్లు కేసీఆర్ సీఎంగా ఉంటారని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రొ. జయ శంకర్ సార్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో జయ శంకర్ కృషి ఎనలేనిదన్నారు. అలాగే జయ శంకర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని నాయిని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మన రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా మందుకు సాగుతుందన్నారు. కాగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా సాగుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వంపై అర్ధంపర్ధం లేని ఆరోపణలు చేస్తున్నాయని మంత్రి నాయిని నర్సింహారెడ్డి విపక్షాలను దుయ్యబట్టారు.


హవ్వా ! పొన్నం దీక్ష చేయడమా?



హైదరాబాద్, మేజర్‌న్యూస్: కరీంనగర్ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ అమరణ దీక్షకు దిగిన స్థానిక మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తీరుపై అధికార పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. ప్రభుత్వంపై పొన్నం చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని అధికార పార్టీ ఎంపీ బాల్క సుమన్ అన్నారు. గతంలో ప్రభుత్వంలో ఉండి ఏం చేయలేని పొన్నం ప్రభాకర్ ఇప్పుడు కాలేజీ పేరిట దీక్షలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. సిద్దిపేట, మహబూబ్ నగర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని సుమన్ తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే కాంగ్రెస్‌నేతలు విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ దుష్ట పన్నాగాలను ప్రజలు గమని స్తున్నారని, వారి ఆటలు ఇకపై సాగబోవన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు జీఎస్టీ శరాఘాతంలా మారాయన్న సుమన్, జీఎస్టీ తొలగించేవిధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. దీనిపై కేంద్రం పునరాలోచించకపోతే కోర్టుకు వెళ్తామన్నారు.

20 వేల ఉద్యోగ నియామాకాలు చేపట్టలేదు

టీ-జాక్ చైర్మన్ కోదండరామ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ ఏర్పాటుతో రాష్ట్రానికి చట్టపరంగా ఈ ప్రాంత వనరుల మీద అధికారం దక్కిందని టీజాక్ చైర్మన్ కోదండరామ్ అన్నారు. ప్రొ.జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సమస్యాత్మకంగా మారాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఆయన, ఇప్పటివరకు 20 వేల నియామకాలు కూడా చేపట్టలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాలన బాధ్యత రహిత్యంగా ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ భాష తన స్థాయికి తగినట్లుగా లేదని కోదండరామ్ విమర్శించారు. విద్యార్థుల మౌనం దేశానికే ప్రమాదకరమన్నారు. జయశంకర్ మానవతా వాది, ప్రజలందరూ సమానంగా ఎదగడానికి అవకాశాలు కావాలని కోరుకున్నారనిన తెలిపారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం ఎలావుండాలో ఓ స్పష్టత కలిగిన దార్శనికుడని చెప్పారు. తెలంగాణ వచ్చే దాకా రాష్ట్రం కోసం పోరాడాలని, తెలంగాణ వచ్చిన తరువాత ప్రజలందరిలో వెలుగు నింపడం కోసం పోరాడాలని హిత బోధ చేసేవారన్నారు. ప్రజలు కేంద్రంగా అభివృద్ధి సాధించగలిగింది అంటే జయశంకర్ వల్లే అని నమ్ముతున్నామని తెలిపారు.

ఏపీ కాంగ్రెస్‌కు ముందస్తు బెంగ



- ఇప్పుడిప్పుడే ఎన్నికలొస్తే మన సంగతేమిటిత ?
- హస్తం నేతల్లో అంతర్మథనం
- కొలుకొనేలోపే ఎన్నికలా ?-పార్టీ శ్రేణుల విస్మయం
- నిర్ణీత సమయంలోపు ఎన్నికలొస్తేనే పార్టీ బలపడేందుకు అవకాశం
- పార్టీ సీనియర్ నేతలతో హైకమాండ్ మంతనాలు
- పార్టీ శ్రేణులను సన్నద్ధంచేసే దిశగా సమాలోచనలు
- మోడీ వ్యూహంతో ఇరకాట స్థితిలో హస్తం

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో తన పార్టీ ప్రభుత్వాలు రావడం, బలంలేని చోట అక్కడి రాజకీయ పరిస్థితులు తనకు అనుకూలంగా మారడంతో మరోసారి బీజేపీ ముందస్తు ఎన్నికల యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో మహాకూటమి చీలడం నీతిష్‌కుమార్, లాలు ప్రసాద్ యాదవ్ దూరం కావడం ఆపై బీజేపీతో కలసి నితీష్ ప్రభుత్వం ఏర్పాటుచేయడం అంతా చకచక సాగిపోయాయి. ఇప్పటి వరకు దేశంలో మోడీ ప్రభంజనానికి సమీప భవిష్యత్తులో మహాకూటమి నుంచే కొత్త ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని కొన్నాళ్ల కిందట వరకు చర్చ సాగింది. కానీ ఇప్పుడు నీతిష్, లాలు విడిపోవడం బీజేపీకి బాగా కలిసొచ్చేంది. ఇప్పటికిప్పుడు బీజేపీకి వ్యతిరేకంగా ఇతర ప్రతిపక్షాలు ఏకమయ్యే పరిస్థితులు కనిపించడంలేదని కమలం నేతల భావన. దీనినే అనువుగా తీసుకొని అసెంబ్లీ, లోక్‌సభకు ఒకే సారి ఎన్నికల పేరుతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ నినాదంతో ముందస్తూ ఎన్నికలకు వెళ్లితే ఎలా ఉంటుందన్న ఆలోచనలో బీజేపీ అగ్రనాయకత్వం ఉన్నట్లు సమాచారం. గతంలోనూ ప్రధాని నరేంద్ర మోడీ ఈ దిశగా ఆలోచన చేసినట్లు కథనాలు వచ్చాయి. ఇప్పుడు తాజాగా దేశవ్యాప్తంగా పరిణామలు తనకు అనుకూలంగా మారడంతో బీజేపీ మళ్లీ ఆ దిశగా సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో దేశవ్యాప్తంగా ముందస్తు ఎన్నికల చర్చక సాగుతుంటే ఏపీలోని కాంగ్రెస్ పార్టీలో దీనిపై అంతర్మథనం సాగుతోంది. రాష్ట్రవిభజన నిర్ణయంతో విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభానికి గురైన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర విభజన అనంతరం జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఏపీ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరూ అసెంబ్లీలో కాలుమోపలేక పోయారు. దీంతో ఆ పార్టీలో ఉన్న సీనియర్లు సైతం ఆ తరువాత కాలంలో వలసబాట పట్టారు. ఉన్న కొందరు నేతలు సైతం అడపాదడపా తప్పా పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ముందస్తు ఎన్నికల సంకేతాలు రావడం కాంగ్రెస్ పార్టీకి కొంత విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని అధికార టీడీపీ, ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఇరు పార్టీలు ఎన్నికలకు సై అన్న దిశగా పార్టీ శ్రేణులకు సంకేతాలిస్తున్నాయి. కానీ మిగిలిన చిన్న పార్టీలు సైతం తమ ప్రజా ఉద్యమాలను నమ్ముకొని కథన రంగంలోకి దిగేందుకు కాలుదువ్వుతున్నాయి. కానీ అందుకు భిన్నమైన పరిస్థితి కాంగ్రెస్ పార్టీలో నెలకొన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవిభజన నిర్ణయంతో తీవ్ర సంక్షోభానికి గురైన ఆ పార్టీ అసెంబ్లీలో కనీసం కాలుమెపలేకపోయింది. అంతేకాకుండా పార్టీలో ఉన్న అరకొర నేతలు సైతం పార్టీని వీడి వలసవెళ్లారు. పలు చోట్ల ద్వితీయ శ్రేణి నేతలతోనే ఆ పార్టీ నెట్టుకొస్తోంది. అయితే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కొలువు దీరిన 2014 తరువాత ఏపీలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై ఉద్యమబాట చేపట్టింది. రాష్ట్రవిభజన బిల్లులోని హామీలు, ఏపీకి ప్రత్యేకహోదా అంశంపై ఉద్యమాలను పదునుపెట్టింది. ఈ ఉద్యమాలు కాంగ్రెస్ పార్టీకి పెద్దగా సానుభూతి తెచ్చి పెట్టకపోయినా ఆ పార్టీపై ఉన్న విభజన అపవాదు నుంచి కాస్త గెట్టెక్కించిందని స్వయంగా ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

అభ్యర్థులే దొరకని పరిస్థితి....?

రాష్ట్రవిభజన అపవాదు నుంచి గట్టెక్కె ప్రయత్నం చేస్తున్న ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం రాష్ట్రవిభజన బిల్లులోని హామీలు, ఏపీకి ప్రత్యేకహోదాపై నిరంతర పోరాటాలు సాగిస్తోంది. అయితే సాధారణ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయమున్నది. ఈ నిర్ణీత సమయం ప్రకారం ఎన్నికలు జరిగితే పార్టీ చేపట్టే పోరాటాలకు పెద్ద ఎత్తున్న యువత ఆకర్షితులవుతుందని, పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ నాయకత్వం యోచిస్తోంది. అంతేకాకుండా ఈ పోరాటాలే 2019 ఎన్నికల్లో పార్టీని గట్టెక్కిస్తాయని ఏపీ కాంగ్రెస్ నేతలు సమాలోచనలు చేస్తున్నారు. అయితే దేశంలో నెలకొన్న పరిణామాల క్రమంలో ముందస్తు ఎన్నికల అంశం మళ్లీ తెరపైకి రావడం కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడని విధంగా తయారైంది. ఉన్న కాస్తో కూస్తో నేతలు సైతం కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీ, వైసీపీ పంచాన చేరారు. నేతల వలసల వల్ల ఏర్పడ్డ ఖాళీ స్థానాల్లో కొత్తనాయకత్వంను సృష్టించుకొనే పనిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తలమునకలైంది. ఈ తరుణంలో ఇంకా పలు చోట్ల కాంగ్రెస్ పార్టీకి పూర్థిస్థాయి నాయకత్వంలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఏపీ కాంగ్రెస్ పార్టీకి ముందస్తు ఎన్నికలు ఓ సవాల్‌గానే రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ముందస్తు ఎన్నికల్లో పోటీచేసేందుకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాల్‌గా పరిణమించనున్నదని స్వయంగా ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



విజయవాడ, మేజర్‌న్యూస్ః బాధిత దళితులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని ఏపీ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘు వీరా రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో రాష్ట్రంలో దళితలపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై టీడీపీ నేతల దాడులని ఖండిస్తు న్నామని చెప్పారు. కృష్ణాజిల్లా గుడివాడలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని రఘువీరా ధ్వజమెత్తారు. ఏపీకి ఇచ్చిన విభజన హామీలను మూడేళ్లయిన కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదాపై ఇచ్చిన మాటను ప్రధాని నరేంద్ర మోదీ తప్పారని విమర్శించారు. మోదీ మాట తప్పినందుకు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపడతామని రఘువీరారెడ్డి తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా మోదీకి నిరసన రాఖీలు పంపనున్నట్లు వెల్లడించారు


జగన్ సైకోలా ప్రవర్తిస్తున్నారు

ఎమ్మెల్యే అనిత



విశాఖపట్నం,సూర్యప్రతినిధి: వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు పిచ్చిపట్టి సైకోలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే అనిత అన్నారు. ఆదివారం సూర్యప్రతినిధితో ఆమె మాట్లాడుతూ జగన్‌ది ఫ్యాక్షన్ కుటుంబం కావడంతో విద్రోహ చర్యలను ప్రేరేపించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. తాతకు తగ్గ మనవడిగా ఫ్యాక్షనిజమ్‌ను నరనరాన జగన్ జీర్ణిం చుకున్నారని ఆరోపించారు. జగన్‌ను నమ్ముకున్న వారంతా రోడ్డును పడతారని జోస్యం చెప్పారు.జగన్ సైకిక్ స్వభావానికి భయ పడి వారి ఎమ్మెల్యేలు ఇతర పార్టీల్లో చేరుతున్నారని అనిత విమర్శించారు. కేసుల మాఫీ కోసం జగన్ ఢిల్లీ నాయకుల కాళ్లు కూడా పట్టుకున్నారని ఆరోపి ంచారు. నంధ్యాలలో ఓడిపోతే చేతులకు గాజులు తొడుక్కుంటానన్న వ్యాఖ్య లకు స్పందిస్తూ అపజయానికి మహిళలు గుర్తా అని ప్రశ్నించారు.

ముద్రగడ పాదయాత్రకు మళ్లీ బ్రేక్



కిర్లంపూడి, మేజర్‌న్యూస్ః కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రను పోలీసులు ఆదివారం మళ్లీ అడ్డుకున్నారు. కిర్లంపూడిలోని ఆయన స్వగృహం నుంచి 6వ రోజైన ఆదివారం కూడా బయటకు రానీయకుండా చేశారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు పాదయాత్రకు అనుమతులు లేవని పోలీసలు మద్రగడను అడ్డుకున్నారు. ముద్రగడ, కాపు జేఏసీ కార్యకర్తలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. దీంతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. శనివారం కూడా ఆయన పాదయాత్రను అడ్డుకున్నారు. ఎన్ని రోజులు పాదయాత్రను ఆపుతారు. 24 గంటల్లో పాదయాత్రకైనా అనుమతి ఇవ్వండి లేదా మమ్మల్ని జైల్లోనైనా పెట్టండి అని ముద్రగడ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

సీఎం మాట శిలాశాసనం

- గాలివాటం మాట్లాడడం సరి కాదు
- జీఎస్టీపై రెండు విధాలా మాట్లాడడం మీకే చెల్లింది
- తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించినందుకు క్షమాపణ చెప్పాలి
- సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మాట అంటే శిలాశాసనంలా ఉండాలని, ఆ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా ఉండాలి..తప్ప గాలివాటంలా మాట్లాడడం సరికాదని తెలంగాణ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విషయంలో సీఎం కేసీఆర్ తీరు ఆయన విశ్వసనీయతపైనే అనుమానాలు కలిగించేలా ఉందని అన్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. జీఎస్టీ కారణంగా రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదన్న ప్రకటనతో తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. గతంలో నోట్ల రద్దు గురించి, ఇప్పుడు జీఎస్టీ గురించి..ఇలా ఒకే విషయంపై రెండు మాటలు మాట్లాడడం అన్నది ఈ మధ్య మీకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఇతర విషయాలు ఎలా ఉన్నా ఇప్పుడు జీఎస్టీ విషయంలో మీరు సృష్టిస్తున్న గందరగోళం రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్ను విధానాన్ని అమలు చేయడానికి ముందు కేంద్ర స్థాయిలో ఎన్నో సమావేశాలను నిర్వహించిందని తెలిపారు. ఈ సమావేశాలలో రాష్ట్రం తరపున ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ పాల్గొన్నా ఏ ఒక్కరోజు కూడా జీఎస్టీ విధానాన్ని తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకిస్తుందన్న సమాచారం ఎప్పుడూ ఎక్కడా వినపడలేదన్నారు. పైగా జీఎస్టీకి ఉభయ సభల్లో ఆమోద ముద్ర వేయాలన్నప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే ముందుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి జీఎస్టీ బిల్లుపై ఎవరినీ మాట్లాడనీయకుండా చేసి యధాతథంగా ఆమోదించి పంపండం మీకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. జీఎస్టీని దేశవ్యాప్తంగా అమలు చేసినప్పుడు కూడా దానిని ఆహ్వానిస్తున్నట్లుగానే మాట్లాడారని తెలిపారు. అయితే ఈటెల రాజేందర్ జీఎస్టీతో రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని, ఏటా రూ.4వేల కోట్లదాకా లోటు ఏర్పడుతుందని స్పష్టంగా చెప్పారని తెలిపారు. జీఎస్టీ కారణంగా రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని తప్పుడు ప్రకటన చేసి ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు లెంపలేసుకుని, ముక్కు నేలకురాసి ప్రజలను క్షమాపణ అడగాలని లేఖలో పేర్కొన్నారు. జీఎస్టీ



సమీక్షా సమావేశాలకు ఆర్థికమంత్రిని ఎందుకు దూరంగా ఉంచుతున్నారో అధికారికంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పన్ను విధానాన్ని చేనేత, బీడీ పరిశ్రమలకు మినహాయించాలని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమకు కూడా మినహాయింపు ఇవ్వాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలతో పాటు డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని కూడా జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని పలు డిమాండ్లతో కూడిన లేఖను కేంద్ర ప్రభుత్వానికి రాసి, మినహాయింపులు ఇచ్చే వరకు కేంద్రప్రభుత్వానికి మద్దతు ఇవ్వకుండా నిరసన ప్రకటించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాకాకుండా మళ్లీ మీరు జీఎస్టీపై మాటమార్చి కొత్త పల్లవిని ఎత్తుకుంటే టీడీపీ చూస్తూ ఉరుకోదని జీఎస్టీ కారణంగా నష్టపోయిన వర్గాలతో కలిసి ఆందోళనకు పూనుకుంటామని రేవంత్‌రెడ్డి తెలిపారు.

రైతు సంక్షేమమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం : చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రైతుల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఆది వరసింహస్వామి ఆలయంలో ఆయన సతి సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించి అక్కడి నుండి వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ లో నీటిని నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 10న శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. 1000 కోట్ల నిధులతో రైతులకు ఎంతగానో మేలు చేసే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని చెప్పారు. ఎస్సారెస్పీ ఆధునీకరణ ద్వారా 9 లక్షల ఎకరాలు భూమి సాగులోకి వస్తుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తప్పులను వెతికి చూసే అవకాశం లేకపోవడంతో చిన్న చిన్న సంఘటనలను రాద్ధాంతం చేస్తున్నారన్నార్ని మండిపడ్డారు. స్వార్థ రాజకీయ ప్రయోజనం కోసం పాకులాడూతున్నారిని విమర్శించారు.

కాంగ్రెస్ రాఖీ నిరసన

అమరావతి, మేజర్‌న్యూస్ః రాష్ట్రంలో రాజకీయంగా మళ్లీ పుంజుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రాఖీ ప్రొటెస్ట్ పేరుతో రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ఏపీపీసీసీ చీఫ్ రఘువీరా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నిరసనలో భాగంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అకౌంట్‌కు ట్యాగ్ చేసి నిరసన తెలపాలని రాఘువీరా సూచించారు. ఏపీలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. దొండపాడులో దళితులపై దాడికి పాల్పడింది టీడీపీ వారేనని, దళితులపై దాడులు జరిగితే మోదీ స్పందించినా చంద్రబాబు స్పందించడం లేదని విమర్శించారు.

స్కూల్ ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించండి

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: గద్వాల జోగులాంబ జిల్లాలోని గుట్ట మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్, ఇస్కాన్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధులకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డా.ఆంజనేయగౌడ్ లేఖలు రాశారు.

గుట్ట పాఠశాలలో మొత్తం 552 మంది విద్యార్థులున్నారని, వారికి మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. బాల, బాలికలు కలిసి చదువుతున్న ఈపాఠశాలలో తక్షణమే మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని ఆంజనేయగౌడ్ కోరారు.

ఈ మేరకు ఆయన, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్, ఇస్కాన్ ప్రతినిధులతోను ఫోన్‌లో మాట్లాడారు. ఆంజనేయగౌడ్ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్, ఇస్కాన్ ప్రతినిధులు గుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించేందుకుసుముఖత వ్యక్తం చేశారు.

త్వరలోనే మరుగుదొడ్ల, మూత్రశాలలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం ఆంజనేయగౌడ్ వ్యక్తిగతంగా 20 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.



అమరావతిలో మరో మూడు రోడ్లు

- ముందస్తు వ్యయానికి ప్రపంచ బ్యాంకు ఆమోదం
- రూ.714 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- టెండర్లు పిలిచిన అమరావతి అభివృద్ధి సంస్థ
- అన్ని ఎల్పీఎస్ లే అవుట్లకు రోడ్లు అనుసంధానం

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధాని అమరావతిలో మరో మూడు ప్రధాన రహదారుల నిర్మాణాన్ని సుమారు రూ.714 కోట్లతో చేపట్టేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) టెండర్లు పిలిచింది. ఈ మూడు రోడ్ల నిర్మాణ వ్యయాన్ని త్వరలో తాము ఇవ్వబోయే రుణం నుంచి సర్దుబాటు చేసుకునేందుకు ప్రపంచబ్యాంకు ఇటీవలే అనుమతిచ్చింది. రాజధానిలో ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు)తో కలిపి మొత్తం 8 ప్రధాన రహదారుల నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. ఇప్పుడు టెండర్లు పిలిచిన మూడు రహదారులతో ఈ సంఖ్య 11కు చేరుతుంది. సీడ్ యాక్సెస్ రోడ్డుని మినహాయిస్తే మిగతా 10 రోడ్లలో 5 తూర్పు నుంచి పడమరకు, మరో 5 ఉత్తరంనుంచి దక్షిణ దిశగాను ఉంటాయి. ఈ 10 రహదారుల్ని సబ్ ఆర్టీరియల్ రోడ్లుగా వ్యవహరిస్తున్నారు. వీటి వెడల్పు 50మీటర్లు. ఇవన్నీ ప్రధానంగా ప్రజా రవాణా వ్యవస్థకు అనుకూలంగా నిర్మిస్తున్నవే. వీటి నిర్మాణంతో రాజధానిలోని అన్ని ఎల్పీఎస్ లేవుట్లను (రాజధానికి భూములిచ్చిన రైతులకు స్థలాలు ఇచ్చేందుకు వేస్తున్న లేఅవుట్లు) అనుసంధానించినట్లు అవుతుందని సీఆర్‌డిఏ అధికారులు తెలిపారు. వాణిజ్య ప్రాంతాల్ని అనుసంధానిస్తూ వీటిని నిర్మించనున్నారు. అమరావతిలో ఇ6, ఇ12, ఎన్11 రహదారులకు ఏడీసీ టెండర్లు పిలిచింది. ఇ6 పొడవు 9.845 కి.మీ.లు, అంచనా వ్యయం రూ.251.33 కోట్లు. ఇ12 పొడవు 6.791 కి.మీ.లు, అంచనా వ్యయం రూ.207.18 కోట్లు. ఎన్11 పొడవు 8.657 కి.మీలు, అంచనా వ్యయం రూ.255.26 కోట్లు. వీటిలో ఎన్11 రహదారి 900 ఎకరాల్లో నిర్మించే పరిపాలనా నగరానికి కుడిపక్కన ఉత్తరం నుంచి దక్షిణ దిశగా ఉంటుంది. ఇది ప్రధాన అనుసంధాన రహదారిని అనుసంధానిస్తూ లింగాయపాలెం, రాయపూడి, కొండమరాజుపాలెం, ఐనవోలు మీదుగా శాఖమూరు వరకు వెళుతుంది. ఇ6 రహదారి అనంతవరం, తుళ్లూరు, వెలగపూడి, మందడం, మల్కాపురం మీదుగా సచివాలయం పక్క నుంచి, ఇ12 రహదారి నీరుకొండ, కురగల్లు, యర్రబాలెం, నవులూరు మీదుగా వెళుతుంది.



ఈ మూడు రహదారులు ఆయా గ్రామాలకు సమీపంలో అభివృద్ధి చెందే ప్రధాన వాణిజ్య సముదాయాల్ని అనుసంధానం చేస్తాయి. ఎస్ఆర్ఎం, విట్, ఎన్ఐడీ వంటి విద్యా సంస్థల్ని కూడా అనుసంధానించినట్లవుతుంది.

భారీ నీటి ప్రాజెక్టులపై జీఎస్టీ భారం తొలగించండి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో భారీ నీటి పారుదల ప్రాజెక్టులపై జీఎస్టీ భారం తొలగించాలని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన, సహచర ఎంపీ బీబీపాటిల్‌తో తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల పెద్ద ఎత్తున నిర్మిస్తున్న నేపథ్యంలో జీఎస్టీ 18 శాతం భారం మోపకుండా, తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇతర రాష్ట్రాలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం శాసనసభ స్థానాల పెంపు, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా లభిస్తుందని ఆశించినప్పటికీ, ఆ అంశాలపైన కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. మొదట్లో జీఎస్టీ విధానం వల్ల పన్నులు సరళీకృతమై పన్నులు తగ్గుతాయని ఆశించమన్నారు. అందుకే మోడీ సర్కార్ జీఎస్టీ అమలు చేస్తామంటే మద్దతునిచ్చామని తెలిపారు. కానీ కేంద్రం ఈ రకంగా అభివృద్ధి కార్యక్రమాలపై జీఎస్టీ భారాలు మోపడాన్ని నిరసిస్తున్నట్లు చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతామన్నారు. తెలంగాణ ప్రజానీకం, రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారీ నీటి ప్రాజెక్టులపై జీఎస్టీ భారాన్ని పూర్తిగా తొలగించి రాష్ట్రానికి న్యాయం చేయాలని ఎంపీ బీబీ పాటిల్ కేంద్రాన్ని కోరారు.

వెట్టిలో చిట్టిచేతులు

బాలకార్మికులతో నిర్బంధ పనులు



- నీరుగారిన నిర్బంద విద్య
- చైల్డ్ లేబర్ చట్టం అమలులో విఫలం

(హైదరాబాద్,న్యూస్‌నెట్‌వర్క్)‌: ఖరీదైన హోటళ్ల దగ్గర నుంచి రోడ్డుపై మెకానిక్ షాపుల వరకు బాల కార్మికులతో పనులు చేయిస్తున్నారు. లేత భుజాలపై పెనుభారం మోపుతూ వారి బతుకులను చిద్రం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే నిర్బంధ విద్య ప్రవేశపెడతామన్న నేతలు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై శ్రద్ధ చూపడం లేదు. వెరసి బాలకార్మికుల సంక్షేమం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు బాల కార్మికుల నియంత్రణకు అమలు చేస్తున్న చట్టాలన్నీ అధికారులల్లో చిత్తశుద్ధిలేని కారణంగా నిర్వీర్యమవుతున్నాయి. 1986 చైల్డ్ లేబర్ యాక్టును పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'రైట్ కంపల్‌సరీ ఎడ్యుకేషన్ యాక్టు 2009' అమలు కూడా అంతంత మాత్రమే అమలవుతోంది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్తచట్టం ప్రకారం 6సంవత్సరాల నుంచి 14సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలు, బాలురు చదువు కోవాలని ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. అయితే రాష్ట్రంలో రైట్ ఎడ్యుకేషన్ యాక్టుపై గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సరైన అవగాహన కొరవడింది. బడిలో ఒడిలో పెరగాల్సిన బాల్యం చెత్తకుప్పల పాలవుతోంది. పది సంవత్సరాలు కూడా పూర్తికాని చిన్నారులు ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారు. పుస్తకాలు చేతపట్టాల్సిన చిన్నారులు మట్టితట్టలు మోస్తున్నారు. బాల కార్మిక నియంత్రణకు ప్రవేశపెట్టిన చట్టాలు ఆచరణలో నిర్వీర్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలో కార్మిక సంక్షేమ శాఖ అధికారులు తూ.తూ మంత్రంగానే తనిఖీలు చేపడుతున్నారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఇటుక బట్టీల్లో చిన్నారులతో పనులు చేయిస్తున్నారు. ప్రమాదకరమైన పరిశ్రమల్లో బాలకార్మికులతో పనులు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం నిషేధించి ప్రమాదకర పరిశ్రమలు, బ్రాందీ షాపులలో, బారుల్లో సైతం చిన్నారులే దర్శనమిస్తున్నారు. బాలకార్మికులతో బండ చాకిరి చేయిస్తున్నారు. జిల్లా కేంద్రాలు, రాష్ట్ర రాజధానిలో సైతం పెద్దపెద్ద హోటళ్ల, ప్రైవేట్ సంస్థల్లో బాలకార్మికులే కనిపిస్తున్నారు. వీరిలో అతితక్కువ వేతనాలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. ఇదిలావుంటే ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ప్రైవేట్ సంస్థలు అనధికారికంగా పనిచేస్తున్నాయి. వీటిల్లో అధికంగా బాలకార్మికులు ఉంటున్నారు. బడి బయట 14సంవత్సరాల లోపు పిల్లల్ని పాఠశాలకు పంపించడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత నిర్బంద విద్య ఆచరణలో అపహాస్యం పాలవుతోంది. బాల కార్మికులకు విముక్తి కల్పించాలని ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమా? అని జిల్లాల వారీగా బాలకార్మికుల తీరు తెన్నులు చూస్తే ఇట్టే అర్థమవుతోంది. 15సంవత్సరాల లోపు పిల్లలతో పనిచేయిస్తే బాలల ఉద్యోగ సవరణ చట్టం ప్రకారం 1970 చట్టం ప్రకారం శిక్షార్హులు. 1954 చట్టం ప్రకారం 17సంవత్సరాల వయస్సులోపు వయస్సు కలిగిన వారితో కర్మాగారాల్లో పనిచేయించడం నేరం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాల ప్రకారం 18సంవత్సరాలలోపు వయస్సున్న ప్రతీ ఒక్కరూ బాలలే. వారితో పనిచేయిస్తే వారి హక్కులను హరించడమేనని చట్టాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. బాలల హక్కుల పరిరక్షణ చట్టం 1986 ప్రకారం ప్రమాదకర ప్రదేశాల్లో బాలలతో పనిచేయించుకోవడం నేరమే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు 'వె లుగు' లాంటి పథకాలు అమలు చేసింది. బాలల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. నిషేధిత ప్రాంతాల్లో పనిచేసే బాలలను గుర్తించి వారికి పునరావాసం కల్పించడంలో అధికారులు తరచూ విఫలమవుతున్నారు. పాఠశాలకు వెళ్లని చిన్నారులు, చెడు వ్యసనాలకు లోనవుతున్నారు. విలువైన బాల్యం బుగ్గిపాలవుతోంది. పేదరికం వల్ల తల్లి.తండ్రులు తమతో పాటు పిల్లలను భవన నిర్మాణాలు, ఇతర పనులకు వెంట తీసుకెళుతూ వారిని కూలీలుగా తీర్చుదిద్దుతున్నట్లు ఒక సర్వేలో వెల్లడైంది. ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేసే బాల కార్మికులకు విముక్తి కల్పించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాలు బాల కార్మికుల సంక్షేమానికి వెచ్చించే నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారుతోంది. ప్రభుత్వాలతోపాటు తెలుగు రాష్ట్రాలలోని కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా బాలకార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన ఉచిత నిర్బంధ విద్య చట్టాలను జిల్లా కలెక్టర్లు సక్రమంగా అమలు చేసేందుకు కృషిచేయాల్సి ఉంది. రైట్ టు కంపల్‌సరీ ఎడ్యుకేషన్ యాక్టు 200 పటిష్టంగా అమలు చేయాల్సిన అధికారులు మొక్కుబడిగా పనిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బాల కార్మికులు ఇటుకబట్టీలు, క్వారీలు, మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారు. కొందరు అధికారుల ఇళ్లలో కూడా బాలకార్మికులే దర్శనమిస్తున్నారు. చ ట్టాలను అమలు చేయాల్సిన అధికారులే నిబంధనలకు విరుద్ధంగా తమ ఇళ్లో బాల కార్మికులతో పనులు చేయించుకోవడం విచారకరం. కంచే చేను మేసిన చందాన బాల కార్మికుల చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కొందరు అమ్యాయ్యాలకు అలవాటు పడి చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే తెలుగు రాష్ట్రాలలో బాల కార్మికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర రాజధానిలో సచివాలయం సమీపంలోని హోటళ్లలో బాలకార్మికులు పనిచేస్తున్న దృశ్యాలు బాల కార్మిక చట్టాన్ని అపహాస్యం చేసే విధంగా ఉన్నాయి. 14ఏళ్లలోపు బాలికలు సైతం బడాబాబుల ఇళ్లల్లో పనిచేస్తున్నారు. బాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు అమలు చేసే పథకాఉ అమలులో పాలకుల ఉదాసీన వైఖరి వల్ల ఆచరణలో బాల కార్మికుల సంక్షేమం కేవలం ప్రకటనలకే పరిమితమవుతుండటం గమనార్హం. తెలుగు రాష్ట్రాలలో బాల కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకునే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. ఇంత వరకు బాలకార్మికులతో పనిచేయించుకన్న వారికి కఠిన శిక్షలు పడిన దాఖలాలు లేవు. ప్రమాదకర ప్రదేశాల్లో పనిచేసే బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తున్న యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల అనుబంధ సంఘాలు గతంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన విషయం విధితమే. బాలకార్మికులకు పునరావాసం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ అధికారుల కాకిలెక్కలతో సరిపెడుతున్నారు. గతంలో పాఠశాలలకు వెళ్లేవారినే ప్రభుత్వ లెక్కల్లో పేర్కొంటున్నారు. బాలకార్మిక వ్యవస్థ నియంత్రణకు ప్రవేశ పెట్టిన పథకాలు కేవలం కాగితాలకే పరిమితంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా అనేక ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే బాలకార్మికులను బడిబాట పట్టించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈక్రమంలో నాటి బాలలే రేపటి పౌరులు అన్న విషయాలను ప్రభుత్వాలు గుర్తెరగాలి. లేనిపక్షంలో రేపటి పౌరులు విద్యాకు దూరంగా కూలీలుగా అవతారం ఎత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తెలుగు రాష్ట్రాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శ్రద్ధ కనబరుస్తారని ఆశిద్దాం..!

త్వరలో ఐదు వేల పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ : సీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : నిరుద్యోగ యువతలో కృషి పట్టుదల, తపన ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి అన్నారు. నార్త్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో చేయూత కార్యక్రమం ద్వారా పోలీసు నియామకాల కోసం నిరుద్యోగులకు ముందస్తు శిక్షణ ప్రారంభ కార్యక్రమం సికింద్రాబాద్‌లోని హరి హరకళాభవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దానిలో భాగంగా పోలీసులకు అవసంమైన సాంకేతిక పరిజ్ఞానం, వసతులను కల్పిస్తుందని చెప్పారు. ముఖ్యంగా నగరంలో 5 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాలకోసం శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. నార్త్‌జోన్ పరిధిలో శిక్షణ తీసుకోబోతున్న 1248 మంది నిరుద్యోగులు పోలీసు ఉద్యోగాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. మంగళ్‌హాట్ పోలీసులు అందించిన శిక్షణతో 252 మంది యువతీ, యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించారని, వారిని ఆ దర్శంగా తీసుకొని నార్త్‌జోన్‌లో శిక్షణ ప్రారంభించారని తెలిపారు. నార్త్ జోన్ డీసీపీ బి. సుమతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నార్త్ జోన్ పరిధిలో 1248 మంది ఈ శిక్షణకు ఎంపిక అ య్యారని, మూడు చోట్ల శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో భాగ్యకిరణ్ పోలీసు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్యకిరణ్, టీఎంఐ చైర్మన్ మురళీధరన్, నార్త్‌జోన్ ఏసీపీలు రంగారావు, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ పరిపాలన దక్షత కోల్పోయారు



వరంగల్, మేజర్‌న్యూస్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన దక్షత కోల్పోయారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా బాలసముద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆచార్య జయశంకర్‌సార్ కలలుగన్న ఆశయాల కోసం మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ వర్గానికి న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తున్న విపక్షాలను విమర్శించడమే అధికార పక్ష నేతలు ధ్యేయంగా పెట్టుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో టీఆర్ఎస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని రేవూరి వెల్లడించారు.

ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప దార్శనికుడు : ఎండీ రమణారావు



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలంగాణ జాతిపితగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ పంథాలో వేసిన అడుగులు భవిష్యత్తు తరాల వారికి మార్గ నిర్దేశకలాని టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జివి.రమణారావు అన్నారు. బస్‌భవన్‌లో ఆదివారం ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ జయశంకర్ విద్యార్థి దశనుంచే ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో నాయకులకు మార్గనిర్దేశం చేయడమే కాక ప్రజల్లో చైతన్య బీజం వేసిన తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్ గొప్ప దార్శినికుడు అంటూ రమణారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్లు సత్యనారాయణ, రవిందర్, వేణు, టివి రావు, అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రుణం' కోసం రైతు గోస

- బ్యాంకుల వద్ద పడిగాపులు
- రెండు నెలల నుంచి రుణకోసం తిప్పలు
- ఆర్థిక మంత్రి ఆదేశాలు బేఖాతర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ వస్తే సమస్యలు తీరుతయి..ఎంతో ఆనందంగా ఉండొచ్చు ఎలాంటి కష్టాలు పడుతున్నమో తెలుసుకున్న పాలకులు ఆ కష్టాలను తొలగిస్తారు..అంటూ కోరుకున్నారు. ఆ కోరుకున్న వారిలో 'రైతులు' కూడా ఉన్నరు. తెలంగాణ వచ్చేసింది..మూడేళ్లు దాటిపోతోంది..కానీ వారి సమస్యలు తీరాయా ? వారు ఆనందంగా ఉంటున్నరా ? సమైక్య పాలనలో ఇబ్బందులు పడిన రైతులు అలాంటి పరిస్థితి రానివ్వబోమని చెప్పిన పాలకులు ఆ దిశగా పాలిస్తున్నారా ? అంటే లేదు అనే సమాధానం వస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్యాంకుల ఎదుట పడిగాపులు..

ఆరుగాలం శ్రమించి పట్టెడన్నం పెట్టే రైతుకు ప్రస్తుతం అడుగడుగునా అవస్థలే ఎదురవుతున్నయి. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నయి. కానీ ఆ రైతన్నకు రుణాలు మాత్రం లభించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని పలు బ్యాంకుల ఎదుట రైతులు పడిగావులు పడుతున్నరు. రుణం పొందాలని ఇల్లు వదిలి..భార్య పిల్లలను వదిలి బ్యాంకుల ఎదుట నిరీక్షిస్తున్నారు. పనులన్నీ వదిలేసి పడిగాపులు పడుతున్నరు. బ్యాంకులు తెరవకముందే భారీ క్యూలు...రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది.

అరకొర నగదు..

ధాన్యం డబ్బులు బ్యాంకుల్లో జమైన రైతులు వాటిని తీసుకోలేక పోతున్నారు. రైతులకు సాధారణంగా గ్రామీణ ప్రాంత బ్యాంకుల్లో ఖాతాలు ఉంటాయనే సంగతి తెలిసిందే. నోట్ల రద్దు తర్వాత పలు బ్యాంకుల్లో నగదు నిండుకోవడం..దీనితో ఒక్కో చోట కేవలం రూ. 4 వేలు.. పది వేలు చేతిలో పెడుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ పనులు మానుకొని బ్యాంకుల వద్ద పడిగావులు కాయాల్సి వస్తోంది. మళ్లీ వ్యవసాయానికి పెట్టుబడబి కావాలె..చేతిలో పైసల్లేక ఇబ్బంది అవుతంది అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీతో సహా పూర్తి రుణం కడితేనే కొత్త అప్పు ఇస్తామంటూ బ్యాంకులు కొర్రీ పెడుతున్నట్లు సమాచారం. అంతిమంగా



బ్యాంకుల్లో రుణం అందక.. పెట్టుబడుల కోసం చేతిల చిల్లిగవ్వ లేక అన్నదాతలు అగచాట్లు పడుతున్నరు. ఇటీవలే దీనిపై రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో నగదు కొరత తీవ్రంగా ఉన్నదని, తక్షణమే రూ. 5వేల కోట్ల నగదును పంపాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ కేంద్రాన్ని అప్పట్లో కోరారు. రైతులు తాము వేసుకున్న నగదు కోసం తామే బ్యాంకుల చుట్టూ బిచ్చగాళ్లలా తిరుగాల్సిన పరిస్థితి కొనసాగడమేమిటని కేంద్రంపై మండిపడ్డారు.మరి రైతులు పడుతున్న రుణ ఆగచాట్లపై ప్రభుత్వం..బ్యాంకులు ఎలా స్పందిస్తాయో చూడాలి.

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి


జస్టిస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: మాదక ద్రవ్యాలు ఎంతో ప్రమాదకరమని, వాటిని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్, ఎంసీసీ బార్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం నెక్లెస్‌రోడ్‌లో 5కే సైక్లింగ్, 5కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జడ్జిలు రాధారాణి, రేణుకలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు ఎంతో ప్రమాదకరమైనవని వాటిని నివారించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు చిన్నారులు బలి కాకుండా పేరెంట్స్, పాఠశాల ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల నిర్వాహకులను అభినందించారు.

సూర్యకుమారి కేసులో కీలక మలుపు

విద్యాసాగర్‌కు రిమాండ్



విజయవాడ,సూర్యప్రతినిధి: సంచలనం సృష్టించిన డాక్టర్ సూర్యకుమారి అదృశ్యం కేసు విషాదంగా ముగిసింది. వారం రోజులుగా మిస్టరీని తలపించిన కేసు ఆమె మరణంతో మలుపు తిరుగుతోంది. సూర్యకుమారిది హత్యా..?, ఆత్మ హత్యా..? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. సూ ర్యకుమారి అదృశ్యమైన నాటినుంచి ఆమె స్నేహితుడు మాజీ ఎమ్మెల్యే జయ రాజ్ కుమారుడు విద్యాసాగర్ చుట్టూనే కేసు తిరుగుతోంది.

బహ్రెయిన్‌లో జయశంకర్ జయంతి

టీఆర్ఎస్ ఎన్నారైసెల్ ఆధ్వర్యంలో హరితహారం

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : బహ్రెయిన్ ఎన్నారై టీఆర్ఎస్ సెల్ అధ్వర్యంలో తెలంగాణా జాతిపిత, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా మూడో విడత హరితహారంలో భాగంగా బహ్రెయిన్ ఎన్నారై టీఆర్ఎస్ సెల్ సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం బహ్రెయిన్ ఎన్నారై టీఆర్ఎస్ సెల్ ప్రెసిడెంట్ రాధారపు సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బోలిశెట్టి వెంకటేష్ లు మాట్లాడుతూ జయశంకర్ మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. జయశంకర్ చేసిన భావజాల వ్యాప్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను సాధించుకున్నామన్నారు.

వారసత్వ ఉద్యోగం వద్దనుకుంటే ఐదు లక్షలు

తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన టీఎస్ ఆర్టీసి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : టీఎస్ ఆర్టీసిలో వారసత్వ ఉద్యోగాన్ని వద్దనుకునే కుటుంబానికి ఇచ్చే అదనపు ఆర్థిక సహాయం మొత్తాన్ని ఆసంస్థ రూ.5 లక్షలకు పెంచింది. ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగిపై ఆధారపడిన అతని కుటుంబసభ్యులు తమకు వారసత్వ ఉద్యోగం అక్కరలేదని లిఖిత పూర్వకంగా తెలియజేస్తే వారికి ఆ ప్రయోజనం దక్కనుంది. కొంతకాలంగా సంస్థలో పెండింగ్‌లో ఉన్న ఈ విషయమై తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు ఉత్తర్వులు జారీచేశారు. వారసత్వ ఉద్యోగం వద్దన్న చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి, ఆర్టీసీ ఇప్పటివరకు సదరు ఉద్యోగి క్యాటగిరీని బట్టి రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. క్లాస్-3, 4 ఉద్యోగులకు రూ.లక్ష, క్లాస్-2కు రూ.1.25 లక్షలు, క్లాస్-1 వారికి రూ.1.50 లక్షల చొప్పున అందజేస్తూ వస్తోంది.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

అక్షరం

4

సోమవారం 7 ఆగస్టు 2017

editpage@suryaa.com

అందరికీ విద్య



అందరికీ విద్య
మృగ్యమైన అసమానతల వెలిలో
అసమగ్ర విశ్లేషణ చదువుల
కొలిమిలో
కాల్చబడి
కార్పొరేట్ల కాల్పనిక చదువుల
అంగడిలో
ప్రశ్నకే అవకాశంలేని
జవాబే చెప్పలేని
మెటీరియలైజ్డ్ ఫండమెంటలిస్టిక్
ఐడియాలజీ చదువులవేటలో
ఎటునుండి ఎటు చదువుతున్నామో
తెలియని ధ్యాసలో
మానసిక వేదనలో
నిర్వేదంలో
ఎవరో నిర్దేశించే గమ్యంలేని
చదువుల ఆకలింపులో
అణువణువు క్షోభతో
సామాజిక వికాసమే కొరవడి
అచేతనమై
పుస్తకాల ఛేదన లో చెదుగుడు

బట్టీయం మహమ్మారి
మెదడును మొద్దుబారేట్లు చేస్తుంటే
భావితరం చట్రంలో బందీ
మానవసంబంధాల విలువల
వలువలు
సత్తెకాలపు చదువుల చేతిలో చిక్కి
వలవల వెలవెల
జ్ఞానసముపార్జన కొరవడి
ర్యాంకుల రంకు లో రచ్చ
అదే మహాభాగ్యమనుకునే
మహానుభావుల పుట్టిల్లు
జీవనమంటే ఆ చదువే
సంకనాకిపోయే మెదళ్ళ శక్తి
మెకాలే చదువు గుమస్తాగిరీనిస్తే
గీ చదువు గిరగిరతిప్పి
ఈడ్చికొడితే ఎదగలేక వెర్రిగా
అయినా చదువు కార్పోరేట్ల చేతుల్లో
కీలుబొమ్మ
ఏలికలంతా ఆ తానుముక్కలే

గిరిప్రసాద్ చెలమల్లు

వేటగాళ్లు



అంతటా విస్తరిస్తుంటే
గుడ్డి కొంగైనా
నిఘా మీద నిలబడ్డ
సరిహద్దు సైనికుడే!

అడవులు అంతమవుతున్నందుకా
మృగాలు
నగరాల్లో తిరుగుతున్నవి?

పసి బిడ్డ మొదలు
పండు ముసలి దాక
పద్మవ్యూహాలు ఛేదించాల్సిందే!


ఇక్కడ సీక్రెట్ కెమరాలకూ
రేచీకట్లే

దృశ్యాలు స్పష్టాస్పష్టాలు!
బలమైన చట్టాలు
ఆకాశాపు అంచులు తాకే
నేరాల గ్రాఫులు!
పాలకులారా!
మీ రిచ్చే భద్రత భ్రమాన్వితమే!

స్వీయ మెలుకువే
సహజ కవచకుండలం!
ఇంద్రుడు బహురూపి
ఒంటరిగున్నప్పుడల్లా
అమ్మలూ!కవచ
కుండలాలు జాగ్రత్త!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి

చేళ్ల గట్లలో



చెంగు చెంగున
ఎగిరే పెయ్యల
వెంట పరుగు
పొలాల ఒరాల్లో
వడివడిగా
నడిచి జారి
మడిలో
బావుల్లో మోట దోలి
మళ్ళల్లోకి నీరు మలిపి
ఒరాలు తెంపి
మళ్ళు నింపి
జానపదం నాలుకలపై
నాట్యం చేస్తుంటే
అలుపెరగక వంచిన నడుము
ఎత్తక నాట్లేస్తున్న పడచుల శ్రమ
చెమట బిందువులై
మళ్ళల్లో కలిసి
చల్లని పైరగాలిలో సేదతీరి
మోదుగు ఆకులు విస్తరులై
నలుగురూ కలిసి
తిన్న సద్దిలో రుచి

మరువని జిహ్వ
కడిగిన చేయి
ఆలి కొంగుకి తుడుచుకున్న
అనుభూతి
ఊరుమ్మడి బతుకుల
చిత్రం చెరువు గట్టు
అలుగుల్లో జలకాలు
ఊరి మురికి చెర్వు బండపై వదులు
తాటి ఈత చెట్ల అందాలు
దిగిన లొట్లలో కల్లు
నిషాతో మరోప్రపంచంలో విహారం
పండుగలు పబ్బాలు
ఇల్లిల్లూ ఎర్రమట్టి అలుకుతో
సున్నంతో గోడలపై ముగ్గులు
వాకిళ్ళు సాంపి నీళ్ళతో కళకళ
నేత ధోతులూ చీరలతో
కొత్తదనం
కందిలి హెచ్చుతగ్గుల వెలుగులో
రాత్ర వంట
భోజనం – ఆపై కునుకు కంటినిండా
వెరసి నాటి పల్లె బతుకు

ఆంధ్ర వాల్మీకి వాసుదాసు సుందరకాండ ఎందుకు చదవాలి?

రావణాసురుడి అంతఃపురాన్ని చూసిన హనుమంతుడు

– వనం జ్వాలా నరసింహారావు, ఫోన్ :8008137012



ఇంటింటికి పోతూ, పలురూపాలతో, అసమాన సౌందర్యంతో అలరారుతున్న ఇళ్లను కన్నులపండుగగా తిలకించాడు వాయుపుత్రుడు. అలా తిరుగుతున్న హనుమంతుడికి ఆపట్టణంలో వర్ణనాతీతమైన పలురకాల ధ్వనులు వినిపిస్తాయి. ఆ ధ్వనులేమిటంటే... స్వర్గంలోని దేవతా స్త్రీల లాగా లంకలో, రొమ్ము, కంఠం, శిరం లో పుట్టిన మనోహర, మంద్ర, మద్యమ తారలనే స్వరాల రాక్షస స్త్రీలు పూర్ణ మదంతో ఆసక్తిగా చేస్తున్న గానధ్వనులు... మనోహర రత్నాలు చెక్కబడ్డ రాక్షస స్త్రీల వడ్డాణాలలోని చిరుగజ్జెల ధ్వనులు... అందెల ఝుళం–ఝ్ఝళ ధ్వనులు... అందెలు, మెట్టెలు, పాముజీలున్న కాలి ఆభరణాలు మెట్లకు తగులుతున్నప్పుడు కలిగే ధ్వనులు...వీరులు భయంకరంగా సింహనాదం చేస్తున్న ధ్వనులు...శూరులు భుజాలు తట్టుకున్నప్పుడు పుట్టిన ధ్వనులు... జపాలు చేస్తున్నవారి ధ్వనులు... మాంత్రికుల ధ్వనులు.....ఇలా పలు రకాల, రకరకాల ధ్వనులు.

ఈ ధ్వనులకు తోడు, వేదాధ్యయనం చేసేవారిని, రాక్షస వందిమాగధులను, రాచబాటల నడుమ నిల్చున్న గుంపులను, వేగులను, గర్జించే రాక్షసులను, దీక్షక్కలో వున్నవారిని, జడలు పెంచుకుని తిరుగుతున్నవారిని, బోడితలల రాక్షసులను, ఎద్దుచర్మాలు ధరించిన వారిని, దర్భ పిడికిళ్లు, అగ్నికుండాలు ఆయుధాలుగా కలవారిని, సమ్మెటలు, ఇనుప గుళ్లు ధరించిన వారిని, ఒంటికన్ను, ఒంటిచెవి, వేళ్లాడే పొట్టలు, రొమ్ములు కలవారిని కూడా చూసాడు హనుమంతుడు. మిట్టపళ్లున్నవారిని, పెద్ద విల్లంబులు ధరించిన వారిని, పొట్టివారిని, వంకర నోటివారిని, బాకులు, రోకళ్లు, గుదియలు, ఇనుపముళ్ల గదలు ఆయుధాలుగ వున్నవారిని, కవచాలు తొడుక్కున్నవారిని, స్థూలకాయులు కానివారిని, కృశించని దేహాలున్నవారిని, మరీ పొడగరి కాని వారిని, మరీ పొట్టి కాని వారిని, మరీ పచ్చని శరీరం లేనివారిని, కారునలుపు లేని వారిని, అంతగా గూనిలేనివారిని, వికార రూపాలున్నవారిని, సుందరులను, సుకాంతున్తులను, అనేక రకాలవారినికూడా హనుమంతుడు చూసాడు. వలలు, పాశాలు చేతుల్లో వున్నవారిని, గంధం అతిగా పూసు కున్నవారిని, పూల దండలు వేసుకున్నవారిని, విలువ కట్టలేని ఆభరణాలతో అలంకరించుకున్నవారిని, ఇష్టమొచ్చిన రీతిగా తిరిగే వారిని, రకరకాలుగా అలంకరించుకున్న వారిని, భయంకర బలవంతులను, ములికైన ఆయుధాలు ధరించిన వారిని, వజ్రాయుధం లాంటి ఆయుధాలు పట్టుకుని తిరిగేవారినీ చూసాడు హనుమంతుడు. వీరికి తోడుగా రావణాసురుడి ఇంటి ముందు, ఆయన



ఆజ్ఞానుసారం కాపలాకాస్తున్న ఆయన మూలబలగాన్నీ చూసాడు హనుమంతుడు.

అక్కడే చూసాడు రావణాసురుడి అంతఃపురాన్ని కూడ హనుమంతుడు. వర్ణనాతీతంగా వుందది. స్వర్గంతో సరిసమానమైన మనోహరధ్వనులు వినిపిస్తున్నాయక్కడ. గుర్రాల సకిలింపులూ, మనోహర భూషణ ధ్వనులూ వినిపించాయి. విమానం, పల్లకి, మదించిన ఏనుగులు, పక్షుల గుంపులు, జింకల్లాంటి వాటితో అందంగా కనిపిస్తూ, బలవంతులైన యుద్ధభటుల రక్షణలో వుందా అంతఃపురం. బంగారం, ఇతర రత్నాలతో ప్రకాశిస్తున్న ప్రాకారంతో, విలువైన ముత్యాలు, రత్నాలతో అలంకరించబడిన లోగిలితో, అగరు చెక్కల కమ్మని వాసనలతో కూడి వున్న రావణాసురుడి అంతఃపురాన్నిచూసాడు హనుమంతుడు.

ఇంతవరకు పట్టణంలో సంచరించిన హనుమంతుడు, రావణుడి అంతఃపురాన్ని బయటనుండే చూసి, ఆ తర్వాత లోనికి ప్రవేశిస్తాడు. ఆరోజు శుద్ధ త్రయోదశీ తిథి. సుమారు తొమ్మిదిన్నర గంటల ఆసమయంలో చంద్రుడు ఆకాశం మధ్యలో వెన్నెల కురిపిస్తున్నాడు ప్రకాశవంతంగా. హనుమంతుడు చూసిన ఆనాటి చంద్రుడు.....వినోదకరమైన వెన్నెల కాంతులను విరజిమ్ముతూ, అందమైన ఎడ్ల గుంపులో ఆబోతులా తిరుగుతూ, ప్రపంచమంతా తన చల్లటి కాంతిని వ్యాపింప చేస్తూ, జనాల మనస్సుల్లో సుఖపడ్తున్నామన్న ఆలోచన కలుగ చేస్తూ, ఉప్పొంగిన సముద్రుడి నృత్యాన్ని తలపిస్తూ, ఆబాలగోపాలానికి దుఃఖ నాశనం చేస్తున్నట్లున్నాడు.

భూమ్మీదున్న మందర పర్వతపు కాంతి, సాయం సమయంలో సముద్రంలో వున్న కాంతి, సరస్సులందలి తామరపూల కాంతిని పోలిన కాంతే చంద్రుడిలో వుందప్పుడు. వెండి పంజరంలోని హంసలా, మందర పర్వత గుహలోని సింహంలా, ఏనుగెక్కిన వీరుడిలా ఆకాశంలో వున్న చంద్రుడు, మనోహరంగా, అందమైన స్త్రీ ముఖంలా కనిపించాడు. వాడికొమ్ముల బలిష్టమైన ఎద్దులా, బంగారు కొమ్ముల ఏనుగులా, ఎత్తైన శిఖరమున్న తెల్లటి కొండలా వున్న చంద్రుడు ఆసమయంలో పరిపూర్ణ శృంగుడై(నిండిన కొమ్ములు) లోకాలకు ఇంపైన కాంతినిస్తూ ప్రకాశించాడు. (పాడ్యమి–విదియ–తదియలలో కనిపిన్చినట్లు చంద్రుడి కొనలు, త్రయోదశినాడు కనిపించవు. పూర్ణబింబానికి కొంచెం తక్కువగా కనిపిస్తుంది. ఉత్తర శృంగమని, దక్షిణ శృంగమని చంద్రుడి కొనలకు పేర్లు. ఆరాత్రి ఆశృంగాలు లేవు)

నశించిన మంచు తుంపరల్లా మాలిన్యరహితుడిగా, బృహస్పతి కాంతినే తన కాంతితో కప్పేసినవాడిగా, ఆశ్చర్యకరమైన కాంతికి ఆశ్రయమై నిర్మలాంకమున్నవాడిగా, అమిత కాంతితో వున్నాడప్పుడు చంద్రుడు. (ఈవర్ణనతో మన్చుకాలం వెళ్లిపోయి ఫాల్గుణ మధ్యంలో వున్నట్లు విశదమవుతున్నది. సూర్యకిరణాల సంబంధమున్నందువల్ల తానువెలుగుతూ చీకటిని తొలగిస్తున్నాడని కూడా తెలుసుకోవాలి. సూర్యకాంతి అద్దంపై పడితే ఎలా ప్రతిబింబిస్తుందో, అలానే జలమైన చంద్రుడిపై పడ్డ సూర్యకాంతి కూడా ప్రకాశిస్తున్నదన్న అర్థం స్ఫురిస్తుంది)

విశాలమైన బండరాతిపై కూర్చున్న సింహమా? భీకర సంగ్రామంలో విజృంభించిన మత్తగజమా? రాజ్యం లభించిన రాజా? అనుకునేటట్లు, హంసలాగా ప్రకాశిస్తున్నాడు చంద్రుడు. అంత నిర్మలంగా వున్ది చంద్ర బింబమప్పుడు. త్రయోదశి నాటి ప్రదోష కాలంలో ప్రకాశిస్తున్న చంద్రుడి వల్ల చీకటి పటాపంచలయింది. రాక్షసులు, మాంసం తినే మృాఏగాల సంచారం మొదలయింది. స్త్రీ–పురుషుల మదనతాపం, ప్రణయకోపం పెరిగింది. అలా తన తేజస్సుతో స్వర్గలోక సంతోషంతో సమానమైన ఆనందాన్ని కలిగించింది చంద్రబింబమప్పుడు.

సరిగ్గా ఆసమయంలో వినవచ్చాయి కమ్మని వీణానాదాలు. కనిపించారు.... శృంగార చేష్టల స్త్రీలు....నిద్రాతిశయంతో భర్తల వెనుకబడడం.... హింసకలవాటుపడ్డ మాంసభక్షకులు క్రూరమైన పనులు చేయసాగారు. భర్తలను విడిచి వున్న స్త్రీలు విరహతాపంతో బాధపడ్డారు. మద్యపానంతో శరీరాన్ని మరిచి ఏంచేస్తున్నారో తెలియని రాక్షసులుండే ఇళ్ల సముదాయాన్ని కనుగొంటాడు మారుతి.

శొంఠి కృష్ణమూర్తి 'అంతా ఆడాళ్లలోనే ఉంది'

మరో వంద తప్పక చదవాల్సిన కథానికలు -55

–డా॥ వేదగిరి రాంబాబు, 9391343916



కథానిక ప్రారంభానికి, ముగింపుకి సంబంధం ఉండాలని, అవి కొట్టొచ్చినట్లు కనిపించాలని, ముగింపు చదవగానే మొదలు గుర్తుకు రావాలనే విషయం శొంఠి కృష్ణమూర్తిగారికి బాగా తెలుసు. శర్మ పెళ్ళయి కూడా మరో స్త్రీని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలని మిత్రుడి గదికి వచ్చి రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్ళి ఏర్పాట్లన్నీ చేసుకుంటాడు. విచిత్రమేమిటంటే ముగింపులో అదే రిజిస్ట్రారాఫీసులో మిత్రుడికి తనతో వచ్చినామెకి మధ్య పెళ్ళయితే, తను సాక్షి సంతకం పెడతాడు. ఈ మార్పుకి కారణమే ఆ కథానిక వస్తువు.

ఉత్తమ పురుషలో కథానికని చెప్పుకుంటూ పోయి, చివరి పేరాలో కొసమెరుపుతో మనల్ని ఓ కుదుపు కుదిపేస్తాడు రచయిత.

పెళ్ళికాని అతనింటికి మిత్రుడు శర్మ ఓ స్త్రీతో కలిసి వస్తాడు. ఆమె అతడి భార్యకాదని తెలుసతనికి. మరెవరు? అతనితోపాటు చదివే పాఠకుడిలోనూ ఉత్కంఠత పెరుగుతుంది.

మొదట్లో రచయితకి ఆమె అంటే చిన్నచూపు కలిగినా క్రమంగా ఆమె పనులతో ఆ విముఖత తగ్గుతుంది. శర్మ బయటికి వెళ్ళడంతో ఇద్దరూ మనసు విప్పి మాట్లాడుకుంటారు. మాటల్లో ఆమె గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి పాఠకుడికి, శర్మ మిత్రుడికి కూడా రచయితద్వారా.

ఆమె ఒక ఉపాధ్యాయిని. పెళ్ళికాలేదు. కానీ ఏళ్ళు మించి పోతుండడంతో కోరికలను జయించలేకపోతుంది. దాన్ని అవకాశంగా తీసుకుని శర్మ ఆమెని వలలో వేసుకుని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలని మిత్రుడి గదికి తీసుకువస్తాడు. శర్మమీద కోపం వస్తుంది రచయితకి. తన భార్యకే కాకుండా ఈమెకీ అన్యాయం చేస్తున్నాడని!

అదే మాట ఆమెతో అంటాడు. "ఏం చెయ్యను నా వయసుని జయించలేకపోతున్నాను?" అంటుంది.

"అయితే పెళ్ళికాని మరెవరినైనా చేసుకోవలసింది!" అంటాడు.

"నన్నెవరూ పెళ్ళిచేసుకోకే నేనీ నిర్ణయానికి రావల్సివచ్చింది!" అంటుంది.

"ఎవరైనా పెళ్ళిచేసుకుంటాననంటే"?

"అంతకంటేనా!"

సరిగ్గా అప్పుడే అతనికి ఆమెని పెళ్ళిచేసుకుంటే – అనిపిస్తుంది

ఆమాటే ఆమెతో అంటాడు.

ఆమే అందుకు అంగీకరిస్తుంది.

ఇద్దరూ శర్మని ఒప్పించాలనుకుంటారు.



ఇంతలో మర్నాడు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో తమ పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ చేసుకుని వస్తాడు శర్మ. రచయితని సాక్షి సంతకం పెట్టమంటాడు.

మర్నాడు ముగ్గురూ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు వెళ్తారు. కానీ శర్మ సాక్షి సంతకం పెడతాడు. ఆమెతో రచయిత పెళ్ళి జరుగుతుందంటూ ముగిస్తాడు కథానికని రచయిత.

కేవలం కొసమెరుపేకాక, చక్కటి సందేశాన్నిస్తుంది అంతా 'ఆడవాళ్ళలోనే ఉంది' కథానిక.

రెండు సంధ్యల నడుమ

ప్రముఖ కవయిత్రి డా.యం.బి.డి.శ్యామల పుస్తక సమీక్ష

ప్రముఖ కవయిత్రి డా.యం.బి.డి.శ్యామల గారు రచించిన రెండు సంధ్యల నడుమ పుస్తకం యువకవులకు ఒక గ్రంథం అని చెప్పుకోవాలి. పుస్తకంలో కవయిత్రి తీసుకున్న కవితా వస్తువులన్నీ వైవిధ్యభరితమైనవే ఆ కవితా అంశాలను చాలా క్లుప్తంగా వివరించారు. డా.ఎన్.గోపి గారి ముందుమాటతో ఈ పుస్తకానికి మరింత వన్నె తెచ్చింది అని చెప్పాలి ఇంకా కవితలు పరిశీలిస్తే మొదటి కవితే సర్కసు పిల్ల అనే శీర్షికతో సర్కస్ వారి కష్టాలు వారి ప్రాణాలు ఎప్పుడు గాల్లోనే అని హృదయ విదారకంగా వర్ణించిన తీరు కవయిత్రికి ఉన్న అనుభవం తెలిసిపోతుంది. చేనేత కార్మికుడి దుస్థితి నేడు వారి స్థితిగతులను వివరిస్తూ సంపూర్ణంగా రాసినా కవిత చదువుతుంటే కన్నులలో నీలి మేఘాలు కమ్ముకుంటాయి. రైతు కష్టాలు గురించి చెప్తూ రైతుగా దర్జాగా బతకాల్సిన ఆ రైతన్న.... రైతు కూలీగా మారిపోతున్నాడు అని ఆవేదనను తెలియ జేస్తారు. రైతు కూలీలు ఎంత శ్రమ పడిన వారి మో ములపై చిరునవ్వులు నాట్యం చేస్తూనే ఉంటాయి అని చక్కగా వివరించారు. వెన్నె ముద్ద చెట్టు అనే కవితలో ఈ పదబంధాలు చదివితే మనసు ఏంతో హాయిని ఇస్తుంది. ఒక వెన్నెల రాత్రి మాతోటలోకి అడుగు పెట్టి చూడు మాతోట ఆకాశ మైనట్లు వేలపూల నక్షత్రాల కాంతిలోనువ్వు విహరి స్తున్నట్లు అనిపించకపోతే అప్పుడడుగు తప్ప కుండా ఈ కవయిత్రి కవితలన్నీ ఒక అక్షరాలతోట అనే చెప్పాలి. కొన్ని అక్షరాలు ప్రస్నిస్తుంటే, కొన్ని ఆవేదన మరికొన్ని విషయాన్ని మనకు తెలియ జేస్తాయి. అవయవదానం గురించి ప్రాణ దీపమై వెలగాలంటే అని చెప్పిన కవిత ఈ పుస్తకానికి మకుటం అని చెప్పవచ్చు. రెండు సంధ్యల నడుమ అనే కవితలో కవిత చివర రెండు వాఖ్యలు మనల్ని ఆలోచించేలా చేస్తాయి. ఒక ఎడారికల కవితలో పిల్లలు విదేశాలలో ఉంటె తల్లిదండ్రుల బాధలు వారి ఒంటరితనాన్ని వివరిస్తూ రాసిన కవిత చదువుతున్నంత సేపు గుండె బరువేక్కిపోతుంది.



ఒక కవితలో బాధ గురించి కవయిత్రి చెప్పిన వాక్యం మనిషి పాడుకునే బ్రతుకుపాటకు పల్లవే బాధచూడండి ఇందులో కవయిత్రి ఒక్కటే చెప్పదల్చుకున్నారు మన జీవితంలో బాధ కూడా చాల ముఖ్యమైనది దాన్ని కూడా అనుభవిస్తేనే పరిపూర్ణం అవుతాము అని. ఆ పాట అనే కవితలో సంగీతం మనకు ఇచ్చే ఆనందాన్ని, ఆహ్లాదాన్ని చెప్తూ పాటకు ఉన్న శక్తి ఏంటో చక్కగా చెప్పారు. చూపు, ఎన్నెలెండ, ఇంకా అపూర్వ రాగం, నేనిప్పుడు కవిత్వాన్ని, ఏల పాటల పిల్ల ఏరు, ఇలా అని కవితలు మనసుకు హత్తుకుంటాయి. పని మనిషి గురించి గాయాల నది అనే కవితలో పనిమనిషిని నదితో పోలుస్తూ రాసిన తీరు అమోఘం అని చెప్పచు. ఒక మహిళా ఉద్యోగస్థురాలి గురించి చెప్పిన ప్రయాణం గురించి చెప్పిన తీరు ఈ కవయిత్రి మనసు ఎంతో సున్నితం అని తెలియజేస్తాయి. అమ్మ ఒడి కవితలో చివరి రెండు వాఖ్యలు చదవగానే ఆశ్చర్యాన్ని కలిగించాయి. పరీక్షల గురించి చాల బాగా చెప్పారు స్వతహాగా ఉపాధ్యాయురాలు కనుక తన అనుభవాలను చక్కగా వివరించారు. పెళ్ళికాని దేవుడు,వంటిల్లు, శీతవేళ ఇలా అన్ని కవితలు బాగున్నాయి చివరి కవిత గంగమ్మ పుట్టుక గురించి ఒక నాలుగు పేజీల కవితతో తను ఏంటో నిరూపించుకున్నారు ఈ కవయిత్రి పస్తకం మొత్తం అందరికి అర్థం అయ్యేలా చక్కని పదాలతో చిక్కని కవిత్వాన్ని మన హృదయాలపై చిలికించారు ఈ కవయిత్రి ముఖ్యంగా ఇప్పుడిప్పుడే కవిత్వం రాస్తున్న యువకవులు తప్పకుండా చదవాల్సిన పుస్తకం కవయిత్రి ఇంకా ముందు ముందు ఎన్నో పుస్తకాలు తెలుగు సాహిత్యలోకానికి అంది ఇవ్వాలి అని ఆశిస్తూ వారికీ శుభాకాంక్షలు.

అఖిలాశ,7259511956

మత్తు జగత్తును జయించాలి



భౌతిక జగత్తునుండి
ఒక మాయా లోకం లోకి ...
అగాధం లోకి ...
అంధకారం లోకి ...
ఊగే.. తూగే.. రంగుల పల్లకి లోకి
శరీరాన్ని శిథిలం చేసుకుంటూ,
ఛిద్రం చేసుకుంటూ పయనిస్తూ
వారు ...!
సకల భోగాలున్నాయి
ఊహు ... చాలట్లేదు !
సమస్త సౌఖ్య సుఖాలున్నాయి
ఊహు ...దాహం తీరట్లేదు !
ఇహం లో లేనిదేదో కావాలి
కాళ్ళు నేలపై కాదు
మేఘాల్లో ఉండాలి ,
గాలిలో ధూళి లా, దూదిలా ఎగరాలి
ఖేచరమై సాగాలని ,
సమ్మోహన స్వర్గానికి
రాజులమై పోవాలని రాక్షసారాటం!
నగ్న దేహపు నరాలలోకి
అగ్ని డ్రగ్స్ ని నింపి
దగ్ధ కాయ ధూపాన్ని చూసి
స్వర్గమనుకునే ఉన్మాద స్థితి !
పంచేంద్రియాలు పనిచేయవు
పంచభూతాలు పంచనుండవు
పంచభక్ష్య పరమాన్నమిక
మాదకద్రవ్యమే ..!!
అది కోటి స్వర్గాల
మాయా ద్వీపం !
డ్రగ్స్ అంటే
మేలుకువలోనే
రంగుల స్వప్నాలు చూపించే
జాదూ !

నేలకి నింగికి మధ్య వేలాడే
నీ దేహ పతంగ దారమే
మాదక ద్రవ్యం
నరనరాల్లో రుధిరం
నర్మదా వరదవుతుంది
కండరాలన్నీ
కాగితపు పడవలవుతాయి
మది పరాధీన మవుతుంది!
కళ్ళు కొంగ్రొత్త ప్రపంచం వేపు
కాళ్ళను లాక్కెళతాయి
దేహమేకాదు ఇంద్రియాలన్నీ
డ్రగ్స్ వలయం లో బంధీలవుతాయి
భ్రమ నుండి మతి భ్రమించే దాకా
డ్రగ్స్ రాకాసి ఈడ్చుకెళ్తూనే
ఉంటుంది!
అనివార్యంగా నీ దేహమిక
అన్యాక్రాంత మవుతుంది
మాదకద్రవ్యాల కోసం
మానవ మృగాలు యుద్ధం
ప్రకటిస్తాయి
నిన్ను నీవు,
నీ కుటుంబాన్ని, సమాజాన్ని
ఆఖరికి దేశాన్ని ధ్వంసం చేసే
మారణ హోమానికి సమిదల్ని
సమకూర్చుతూనే ఉంటావు !
ఈ డ్రగ్స్ దావాగ్ని
దేశాన్ని కాల్చక ముందే
విద్రోహుల్ని చెరసాలకి పంపాలి
తారలైన, నేతలైనా
తెగ బలిసిన సంపన్నులైనా
కాలకూట విషాన్ని పంచే, పెంచే
కసాయిల్ని శిక్షించాలి!
దేశాన్ని రక్షించాలి!!



చికాగోలో ఎయిరిండియా విమానాన్ని ఆపేసిన అమెరికా

న్యూఢిల్లీ: సీటు బెల్టులపై ట్యాగ్ నంబరు మిస్సయ్యాయన్న కారణంతో చికాగో నుంచి ఢిల్లీ రావాల్సిన ఎయిరిండియా విమానాన్ని అమెరికా అధికారులు ఎగరకుండా అడ్డుకున్నారు. ఢిల్లీ బౌండ్ బోయింగ్-777లో పలు సీట్ల బెల్టులపై నంబర్లు లేకపోవడాన్ని గుర్తించిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) అధికారులు విమానాన్ని 8 గంటలపాటు నిలిపివేశారు. చికాగో నుంచి ఢిల్లీ వెళ్లే విమానంలో డెల్టా ఫ్లైట్‌లో కొన్ని సీటు బెల్టులు పాడవడంతో న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెన్నడీ విమానాశ్రయంలో పార్క్ చేసి ఉన్న ఎయిరిండియా విమానంలో కొన్ని సీటు బెల్టులను తెప్పించి వాటిని డెల్టా ఫ్లైట్‌లో అమర్చారు. అనంతరం విమానం ఢిల్లీకి టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమవుతుండగా 44 మంది ప్రయాణికుల సీట్లు, 12 మంది విమాన సిబ్బంది సీట్లపై ట్యాగ్ నంబరు మిస్సయినట్టు గమనించిన అమెరికా అధికారులు విమానాన్ని దాదాపు ఎనిమిది గంటల పాటు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎఫ్ఏఏ తీరుపై ఎయిరిండియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త సీటు బెల్టులు లేకపోవడం వల్లే వేరే విమానంలోని బెల్టులు వాడాల్సి వచ్చిందని, కొత్తవాటికి ఆర్డర్ చేశామని, త్వరలోనే వాటిని మారుస్తామని ఎయిరిండియా అధికారులు తెలిపారు.

వ్యాపార అవసరాలకు వాట్సాప్

● సరదా, కాలక్షేపం పోయి వ్యాపార ప్రచారానికి ఉపయోగపడుతున్న వాట్సాప్ ● ఎన్నో అవసరాలకు ఉపయోగపడుతున్న సామాజిక మాధ్యమ వేదిక ● ఒక గ్రూపులో 250 మందికి చోటు ● తమ వ్యాపారులను పెంచుకుంటున్న వాట్సాప్ కస్టమర్‌లు

న్యూఢిల్లీ: వాట్సాప్ సరదా, కాలక్షేపానికి పరిమితం కాదు. ఇదో అతిపెద్ద సమాచార వారధి. వినోదానికే కాకుండా మనసుపెట్టి ఆలోచిస్తే వాట్సాప్ తో బోలెడు ఉపయోగాలున్నాయి. ఎన్నో అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది. ఉపాధి, వ్యాపారానికి కూడా ఇది చుక్కాని వంటిదే.

వ్యాపార అవసరాలు కమ్యూనికేషన్ సాధనం అయినందున వాట్సాప్ వ్యాపార వృద్ధికీ చక్కగా ఉపయోగపడుతోంది. సేల్స్ టీమ్ నిర్వహణకు, వారితో నిరంతరం సంప్రదింపులకు దీన్ని వాడుకోవచ్చు. ఒక గ్రూపు పరిధిలో 250 మందికి చోటు ఉంటుంది గనుక ఓ కంపెనీలో సేల్స్ మేనేజర్ స్థాయిలో ఓ గ్రూపును ఏర్పాటు చేసుకోవచ్చు. మెయిల్స్ తో పోలిస్తే వాట్సాప్ సాయంతో చాలా వేగంగా, సులభంగా అవతలివారిని కనెక్ట్ కావొచ్చు.

కస్టమర్ తో సంప్రదింపులకు, సర్వీస్ కు కూడా వాట్సాప్ ఓ చక్కని సాధనం. నేరుగా ఫోన్ కాల్స్ చేసి మాట్లాడడం సమయం తీసుకునే ప్రక్రియ కనుక కస్టమర్లు సేవ, వస్తువులకు సంబంధించి వాట్సాప్ లో సులభంగా ఫిర్యాదు చేయవచ్చు. కంప్లయింట్ స్టేటస్ గురించి తెలుసుకోవచ్చు. అయితే, భారీ సంఖ్యలో కస్టమర్ల నుంచి ఫిర్యాదులు, విచారణలు వస్తే వాట్సాప్ వేదికగా సమాధానం ఇవ్వడం కష్టమేనంటున్నారు నిపుణులు. అటువంటప్పుడు కస్టమర్ల నుంచి ఫిర్యాదు స్వీకరించేందుకు వాట్సాప్ ను ఉపయోగించుకుంటూనే, ఆ తర్వాత వాటికి మెయిల్స్ ద్వారా సమాధానం ఇచ్చుకోవచ్చు. మార్కెటింగ్, ప్రమోషన్ కు



కూడా వాట్సాప్ ఉపయోగపడు తుందంటున్నారు. కోల్గేట్ కంపెనీ తన టూత్ పేస్ట్ కు ప్రచారం కల్పించుకునేందుకు ఇటీవల వాట్సాప్ ను వాడుకుంది. టూత్ పేస్ట్ ప్యాక్ పై ఉన్న వాట్సాప్ నంబర్ కు కస్టమర్లు నవ్వుతూ ఉన్న సెల్ఫీ ఫొటోలను తీసి పంపించాలని కోరింది. బ్రాండ్ అంబాసిడర్ సోనమ్ కపూర్ చేతుల మీదుగా స్టైలిస్ట్ గా రూపొందే అవకాశాన్ని గెలుచుకోవచ్చని ప్రకటించింది. కస్టమర్ల నుంచి ఫీడ్ బ్యాక్ కోసమూ దీన్ని వాడుకోవచ్చు. ఉత్పత్తుల గురించి సమాచారాన్ని తెలియజేసేందుకు వీలుగా వాటిపై వాట్సాప్ నంబర్ ఇస్తే కస్టమర్ల అభిప్రాయాలు నేరుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.

భిన్న రకాలుగా...

★ ముంబైకి చెందిన రష్ అనే సంస్థ వాట్సాప్ నుంచి కేక్, పుష్పాల కోసం ఆర్డర్లను స్వీకరిస్తోంది.

★ నేడు చాలా వేదికలు వాట్సాప్ నుంచి ఫుడ్ కోసం ఆర్డర్లు స్వీకరిస్తున్నాయి. ఉదాహరణకు ఓ రెస్టారెంట్‌కు సంబంధించిన మెనూను వాట్సాప్ లో పెడితే, మెనూ చూసి అందులో నంబర్ ను చెబితే చాలు. ఆ నంబర్ పై ఉన్న ఐటమ్‌ను ఇంటికే డెలివరీ చేస్తారు.

★ వైద్యుల అపాయింట్ మెంట్ బుకింగ్ ను వాట్సాప్ వేదికగా చేసుకునేందుకు కొన్ని చోట్ల అవకాశం ఉంది. అలాగే సాధారణ ఆరోగ్య సమస్యలపై వైద్యుల సూచనలు, సలహాలను కూడా వాట్సాప్ వేదికగా పొందే అవకాశం ఉంది.

★ ఫార్మసీ స్టోర్స్ కు సంబంధించిన వాట్సాప్ నంబర్ కు ప్రిస్క్రిప్షన్ పంపితే చాలు. అన్ని మందులను ప్యాక్ చేసి ఇంటికే పంపించేస్తారు.

★ ఢిల్లీ పోలీసులు వాట్సాప్ నంబర్ తో ఓ హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశారు. ప్రారంభం రోజున 23,000 ఫిర్యాదులు వచ్చిపడ్డాయి.

ఆమె వ్యాపారానికి చక్కని తోడ్పాటు

నీతా అడప్పా ప్రకృతి హెర్బల్స్ పేరుతో హెర్బల్ ఉత్పత్తుల విక్రయాల కోసం, ప్రచారం, కస్టమర్ల సేవల కోసం వాట్సాప్ గ్రూపులను ప్రారంభించింది. విసుగు అనుకోకుండా వచ్చిన ప్రతీ సందేశానికి సమాధానమిస్తుంది. దీంతో ఆమె ఉత్పత్తులకు, సేవలకు చక్కని గుర్తింపు లభించింది. దీంతో ఆమె వ్యాపారం మరింత విస్తరించింది. దీనివల్ల కస్టమర్లతో సన్నిహిత సంబంధాలకు అవకాశం ఉంటుందని నిపుణుల అభిప్రాయం.

వాట్సాప్ ట్యూషన్స్

వాట్సాప్ ను చిన్న ఆన్ లైన్ పాఠశాలగానూ ఉపయోగించుకోవచ్చు. టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఒక గ్రూపులోకి రావచ్చు. టీచర్లు పాఠశాల ముగిసిన తర్వాత కూడా విద్యార్థులతో విద్యకు సంబంధించి ట్యూషన్స్ ను వాట్సాప్ లో చెప్పుకోవచ్చు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలు, వారికి అసైన్ మెంట్స్, పాఠాలకు సంబంధించిన ఆడియో, వీడియోలు క్లిప్పులు పంపడం, గ్రాఫిక్స్, చార్టులు పంపడం చేసుకోవచ్చు. విద్యార్థులకు వాట్సాప్ యాక్సెస్ ఇవ్వడం అంతగా మంచిది కాదు గనుక వారి తల్లిదండ్రుల ద్వారా అనుసంధానం కావచ్చు.

వ్యాపారుల కోసం ప్రత్యేక యాప్


వాట్సాప్ వ్యాపారుల కోసం త్వరలోనే ప్రత్యేకంగా ఓ యాప్ రానుంది. చిన్న వ్యాపారులు ప్రస్తుత యాప్ కు భిన్నమైన వర్షన్ ను డౌన్ లోడ్ చేసుకుని మరింత మంది కస్టమర్లకు వాట్సాప్ వేదికగా సేవలు అందించొచ్చు. ప్రస్తుతం సాధారణ గ్రూపులో గరిష్టంగా 250కి మించి ఉండేందుకు అవకాశం లేదు. కానీ వ్యాపారుల కోసం రానున్న యాప్ లో సభ్యుల సంఖ్య మరింత ఎక్కువే ఉండనుంది. ప్రస్తుతం ఇది టెస్టింగ్ దశలో ఉంది.

70 శాతం మౌనంగా భరిస్తున్నారు

లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళపై జాతీయ మహిళా కమిషన్

● వర్ణనాతీత వేదననూ భరిస్తున్న వారెందరో ● జాతీయ మహిళా కమిషన్ సెక్రటరీ సత్బీర్ బేడీ ● సెక్సువల్ హెరాస్‌మెంట్‌పై ప్రత్యేక సదస్సు ● ఫిర్యాదుకు ముందుకు రాని వారికి సహాయం అందించాలని నిర్ణయం

న్యూఢిల్లీ: తాము పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళల్లో 70 శాతం మంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) మెంబర్-సెక్రటరీ సత్బీర్ బేడీ తెలిపారు. తెలంగాణ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెక్స్‌వల్ హరాస్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎట్ వర్క్‌ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్ అండ్ రెడసల్) యాక్ట్ 2013పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బేడీ మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్న ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదు చేయడానికి 70 శాతం మంది మహిళలు ముందుకు రావడం లేదని, వారు ఆ వేధింపులను మౌనంగా భరిస్తున్నారని



తెలిపారు. చాలామంది చట్టాల్లోని లోపాలను తమకు అనుగుణంగా ఉపయోగించుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు దిగుతున్నారని పేర్కొన్నారు. లైంగిక వేధింపులు, చట్టాలపై మహిళల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి చెప్పారు. లైంగిక వేధింపులను మహిళా ఉద్యోగులు ధైర్యంగా ఎదుర్కోవాలని హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ జి.యతిరాజులు పిలుపునిచ్చారు. మహిళలపై లైంగిక వేధింపుల విషయంలో చట్టాన్ని మరింత కఠినంగా రూపొందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసినట్టు తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ టి.వెంకటరత్నం తెలిపారు. ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురవుతున్నా చాలా సంస్థలు అస్సలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.




నీతి ఆయోగ్‌కు కొత్త వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్




న్యూఢిల్లీ: నీతి ఆయోగ్‌కు కొత్త వైస్ చైర్మన్ వచ్చేశారు. ఆర్థికవేత్త డాక్టర్ రాజీవ్ కుమార్‌ను ప్రభుత్వం నీతి ఆయోగ్ కొత్త వైస్ చైర్మన్‌గా నియమించింది. అరవింద్ పనగారియా వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి టీచింగ్‌లో కొనసాగనున్నట్టు ప్రకటించిన ఐదు రోజుల తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే ఎయిమ్స్‌లోని చిన్నపిల్లల వైద్య నిపుణుడైన డాక్టర్ వినోద్ పాల్‌ను నీతి ఆయోగ్ సభ్యుడిగా నియమించింది. రాజీవ్ కుమార్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో డీఫిల్ పట్టా అందుకున్నారు. లక్నో యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సీపీఆర్)లో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఫిక్కికి సెక్రటరీ జనరల్‌గానూ పనిచేశారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ (ఐసీఆర్ఐఈఆర్)కు డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. 2006 నుంచి 2008 వరకు జాతీయ భద్రతా సలహా బోర్డులో సభ్యుడిగా ఉన్నారు.

ఫ్లెక్సీ ఫేర్ విధానంతో రైల్వేకి ఏడాదిలో టికెట్లపై రూ.540 కోట్ల ఆదాయం




న్యూఢిల్లీ: ఫ్లెక్సీ ఫేర్ విధానం రైల్వేకు కాసులు కురిపిస్తోంది. ఈ పథకాన్ని రైల్వే శాఖ గతేడాది సెప్టెంబర్ 9న ప్రారంభించింది. రాజధాని, శతాబ్ది, దురంతో రైళ్లకు దీన్ని అమలు చేస్తున్నారు. మొత్తం సీట్లలో 10 శాతం సీట్లను సాధారణ ధరకే విక్రయిస్తారు. ఇక ఆ తర్వాత నుంచి ఫ్లెక్సీ ఫేర్ మొదలవుతుంది. ప్రతీ 10 శాతం సీట్లకు 10 శాతం చొప్పున ధర పెంచి అమ్ముతారు. చివర్లో టికెట్లు కొనుగోలు చేసే వారు గరిష్టంగా 50 శాతం అదనపు ధర చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతుండగా, రైల్వే ఖజానాకు మాత్రం ఇప్పటి వరకు అదనంగా రూ.540 కోట్ల ఆదాయం వచ్చి చేరింది. ఫ్లెక్సీ ఫేర్ తో అదనపు ఆదాయం వచ్చింది. దీన్ని నిలిపివేయడానికి ఎటువంటి కారణం లేదు. ప్రయాణికులు సైతం విముఖత చూపడం లేదు అని రైల్వే శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

డెల్ క్యాంపసడర్స్ మూడో సీజన్ సేల్



హైదరాబాద్: ఉద్యోగార్థులుగా ఉన్న యువత కోసం మూడో విడత డెల్ క్యాంపసడర్స్ సేల్స్ ప్రారంభమయ్యాయి. కాలేజీలోని క్యాంపస్ అంబాసిడర్స్‌తో మరింత లోతైన అనుబంధం ఏర్పచుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టి విజయం సాధించామని, పర్సనల్ కంప్యూటర్ ద్వారా నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడం, ఆలోచనలను అభివృద్ధి చేసుకునేందుకు వేదికగా ఇది ఉపయోగపడుతుందని30 నగరాల్లోని 100 కాలేజీల నుంచి 200 మందిని డెల్ క్యాంపసడర్స్‌గా నియమించనుందని సంస్థ కన్స్యూమర్ అండ్ స్మాల్ బిజినెస్ మార్కెటింగ్ డైరెక్టర్ రీతూ గుప్తా వ్యాఖ్యానించారు. వీరు 1400 కాలేజీల్లోని సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులతో స్ట్రీమ్ అవుతారని తెలిపారు.

కాగ్నిజెంట్ నుంచి 400 మందికి ఉద్వాసన



న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఐటీ సేవల దిగ్గజం కాగ్నిజెంట్ 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఉద్వాసన పలికింది. ఇటీవల కంపెనీ ప్రకటించిన తొమ్మిది నెలల వేతనంతో కూడిన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఎస్‌పీ) పథకానికి వీరు అంగీకారం తెలిపారని కాగ్నిజెంట్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2.5 లక్షల మంది ఉద్యోగులు కాగ్నిజెంట్‌లో పనిచేస్తున్నారు. వీఎస్‌పీకి ఆమోదం తెలిపిన 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లలో ఎక్కువ మంది భారత ఉద్యోగులేనని భావిస్తున్నారు. ఈ ఆఫర్‌ను అంగీకరించిన వారిలో భారత ఎగ్జిక్యూటివ్‌లు ఎంత మంది ఉన్నారనే వివరాలను కంపెనీ వెల్లడించలేదు. 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు వైదొలుగుతుండటంతో కంపెనీకి ఏటా 60 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయని కాగ్నిజెంట్ సీఎఫ్ఓ కరెన్ మెక్లీన్ పేర్కొనడం గమనార్హం. ఉద్యోగులపై వేటుతో కంపెనీ లాభాలు మెరుగుపడతాయని వ్యాఖ్యానించారు. సామర్థ్య మదింపు, వీఎస్‌పీ కారణంగా తమ సంస్థలో ఉద్యోగుల నిష్క్రమణ రేటు అత్యధికంగా ఉందని చెప్పారు.

అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ ఎకౌంటెంట్స్‌తో స్ట్రాటజెమ్ డీల్



హైదరాబాద్: స్ట్రాటజమ్ నేడు అసోసియేషన్ ఆఫ్ చార్డర్డ్ సర్టిఫైడ్ ఎక్కౌంటెంట్స్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా, ఇండియాకు అంతర్జాతీయ ఫైనాన్స్ కెరీర్ అవకాశాలు తీసుకురానున్నామని పేర్కొంది. ఈ భాగస్వామ్యంతో స్ట్రాటజెమ్, ఇప్పుడు ప్రపంచశ్రేణి కెరీర్ అవకాశాలను ఎక్కౌంటెన్సీ, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌లో అందిస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, వీసీ ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉన్నత విద్య అనేది ప్రభుత్వ బాధ్యత అని, కొన్ని ప్రైవేట్ ఇనిస్టిట్యూట్స్ ఈ ఉన్నత విద్యలో కూడా నాణ్యమైన విద్యనందించడానికి ప్రయత్నిస్తున్నాయి. అలాంటి వాటిలో ఒకటి స్ట్రాటజెమ్ ఒకటని అన్నారు. స్ట్రాటజెమ్ ఫైనాన్షియల్ స్కూల్ సీఈవో మహేష్ మాట్లాడుతూ యువ ప్రొఫెషనల్స్ వేగంగా వృద్ధి చెందడంతో పాటుగా పలు రంగాల్లో తమ ప్రతిభను వెల్లడిస్తూ అంతర్జాతీయంగా పనిచేయాలని కోరుకుంటుండటం పెద్ద రహస్యమేమీ కాదని, తాము పనిచేసే కంపెనీలు సాంకేతికంగా అత్యున్నతమైన దానిని వినియోగించుకోవాలని వారు కోరుకుంటున్నారని అన్నారు.

బార్బిక్యూ నేషన్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుక



హైదరాబాద్: విభిన్న రకాల రుచులను అందిస్తూ పేరు తెచ్చుకున్న బార్బిక్యూ నేషన్‌లో స్నేహితుల దినోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. 'నియర్‌బై డాట్ కామ్'తో భాగస్వామ్యంలో ఓ పోటీని నిర్వహించి, స్నేహితులకు నగదు బహుమతులను అందించినట్టు బార్బిక్యూ నేషన్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ సుమన్ ముఖర్జీ వెల్లడించారు. తమ ఔట్‌లెట్లలో స్నేహితులకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుంటామని, ఈ సంవత్సరం ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో పెద్దఎత్తున యువతీ యువకులు పాల్గొన్నారని ఆయన అన్నారు.

త్వరలో మార్కెట్లోకి పతంజలి దుస్తులు

న్యూఢిల్లీ: ఇప్పటికే ఆహార పదార్థాలు, మందులు, ఇతర సామాగ్రి తయారీ మార్కెట్లో ప్రవేశించిన బాబా రామ్దేవ్ పతంజలి బ్రాండ్, త్వరలో తమ బ్రాండ్ దుస్తులను కూడా మార్కెట్లోకి తీసుకురానుంది. వచ్చే ఏడాది ఏప్రిల్లో దేశీయ మెన్స్ వేర్, విమెన్స్ వేర్, కిడ్స్ వేర్ దుస్తులను పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ తయారు చేయనున్నట్లు తెలుస్తోంది. వీటిని కొనుగోలు కోసం బిగ్బజార్తో పాటు దాదాపు 250 స్టోర్లలో అందుబాటులో ఉంచనున్నట్లు పతంజలి ప్రతినిధి ఎస్కే తిజారావాలా తెలిపారు. దుస్తుల తయారీ రంగంలో పతంజలి అడుగుపెడుతుందని, ప్రత్యేకంగా దేశీయ కుర్తా – పైజామాలతో పాటు విదేశీ జీన్స్, టీషర్టును కూడా తయారుచేస్తామని ఇండోర్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమావేశంలో బాబా వెల్లడించిన సంగతి తెలిసిందే.

మీ ఆధార్ సమాచారానికి తాళం వేస్తే నిశ్చింత



న్యూఢిల్లీ: ఆధార్ రూపంలో ఉన్న మన వ్యక్తిగత సమాచారం గోప్యంగానే ఉందా? లేక అసాంఘిక శక్తుల చేతిలో పడుతోందా? ఇటీవల వస్తున్న వార్తలు చూస్తుంటే ఆధార్ డేటాను ఇతరులు చాలా సులువుగానే చేజిక్కించుకుంటున్నట్టు తెలుస్తోంది. టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ కుటుంబ సభ్యుల ఆధార్ సమాచారం లీకైనట్టు ఇటీవల వార్తలు వచ్చాయి కూడా. ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ డేటా లీక్ కాకుండా ఉండేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడం, ఆర్థిక లావాదేవీలకు కూడా ఆధార్ నంబరు తప్పనిసరి చేయడంతో థర్డ్ పార్టీ చేతిలో పడుతున్న ఆధార్ వివరాలు అక్కడి నుంచి అసాంఘిక శక్తుల చేతిలో పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఆధార్ డేటాను అత్యంత సురక్షితంగా ఉంచుకునే మార్గాన్ని ఆధార్ సంస్థ యూఐడీఏఐ పేర్కొంది. ఆధార్ డేటాను లాక్ చేసుకుని అవసరమైనప్పుడు అన్ చేసుకునే విధానాన్ని తెలియజేసింది. ఇందుకోసం కొంత ఇంటర్నెట్ పరిజ్ఞానం ఉంటే సరిపోతుంది. ఆధార్ వెబ్‌సైట్ యూఐడీఏఐ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆధార్ సర్వీసెస్ లింక్‌పై లాక్/అన్‌లాక్ బయోమెట్రిక్స్‌ను క్లిక్ చేయాలి. అలా చేయగానే పేజీ ఓపెన్ అవుతుంది. ఈ పేజీలో నిర్దేశించిన చోట ఆధార్ నంబరు, సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేయాలి. ఆ వెంటనే రిజిస్టర్ మొబైల్ నంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. దీనిని ఎంటర్ చేసిన వెంటనే ఆధార్ వివరాలు లాక్ అయిపోతాయి. అంటే వేరెవరూ వాటిని చూడలేరన్నమాట. ఎవరైనా చూసేందుకు ప్రయత్నిస్తే పేజీపై ఎర్రర్ కోడ్ 303 అని చూపిస్తుంది. అంటే మన ఆధార్ వివరాలు భద్రంగా ఉన్నట్టు లెక్క. ఇలా లాక్ చేసుకోవడం వల్ల మొబైల్ ఆపరేటర్లు, ఇతర సంస్థలు మన డేటాను దొంగిలించలేవు. ఒకవేళ ఎవరికైనా అనుమతి ఇవ్వాలంటే మాత్రం ఇంతకుముందు చేసినట్టుగానే అన్‌లాక్ చేయవచ్చు.

అమరావతిలో బిజినెస్ స్కూల్

వరల్డ్ ఎకనమిక్ ఫోరం తరహా సంస్థ కూడా - 200 ఎకరాల్లో రూ.500 కోట్ల వ్యయం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)ను తలదన్నేలా ప్రపంచశ్రేణి ప్రమాణాలతో అమరావతిలో ఒక బిజినెస్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) తరహాలో ఇక్కడ కూడా ఒక అత్యున్నత వేదికను నిర్మించనున్నారు. 200 ఎకరాల్లో వీటిని నెలకొల్పనున్నారు. భారత వాణిజ్య మండలి(సీఐఐ) సంయుక్త భాగస్వామ్యంతో ప్రభుత్వం దీన్ని ఏర్పాటుచేస్తుంది. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌కు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను తీసుకురాగలిగారు. ఇప్పుడు ఆయన అమరావతిలో కూడా అంతకంటే మించి ఉత్తమంగా ఉండేలా, దానికంటే పెద్ద స్థాయిలో ఐఎస్‌బీని ఏర్పాటుచేయాలనే సంకల్పంతో ఉన్నారు. ఇందులో మామూలుగా అందించే ఎంబీఏ కోర్సులతో పాటు కార్పొరేట్, పొలిటికల్, ఉన్నతాధికారుల పాలన (బ్యూరోక్రటిక్ గవర్నెన్స్) లాంటి వాటిలో ప్రత్యేక కోర్సులు అందిస్తారు. 300 నుంచి 500 మందికి ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పించనున్నారు. అలాగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం తరహాలో ఇక్కడ ప్రత్యేక ఫోరాన్ని ఏర్పాటుచేసి దానికి గుర్తింపు తీసుకురావాలనే తలంపుతో ఉన్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.500 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. నిధుల కోసం ఇబ్బందులు లేకుండా కార్పొరేట్ సంస్థల సహకారంతో సీఐఐ భాగస్వామ్యంతో నిర్మించాలనేది ప్రతిపాదన. పంజాబ్‌లోని మొహాలీలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను నాలుగు కార్పొరేట్ సంస్థల విరాళాలతో నిర్మించారు.

ఉత్సాహంగా సాగిన హైదరాబాద్ మారథాన్

హైదరాబాద్: త్వరలో జరిగే ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్‌కు సన్నాహకంగా హైదరాబాద్ రన్నర్స్ నిర్వహించిన ట్రయల్ రన్ ఉత్సాహంగా సాగింది. 21.195కిలోమీటర్ల దూరం సాగిన ఈ పరుగు, ఉదయం 5:30కి ప్రారంభం కాగా, పలువురు సెలబ్రిటీలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. నక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా నుంచి సోమాజిగూడా, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, మైండ్ స్పేస్ మీదుగా గచ్చిబౌలీ వరకూ పరుగు సాగింది. సుమారు 350 మంది దీనిలో పాల్గొనగా, వీరందరికీ 'ఆప్టమ్' సంస్థ బ్రేక్‌ఫాస్ట్‌ను అందించింది. కాగా, ఈ నెల 19న ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్ పోటీలు జరగనున్న సంగతి తెలిసిందే. గచ్చిబౌలీ స్టేడియంలో ఇది ముగుస్తుంది.



సార్ కలలను నిజం చేస్తున్నాం : కేసీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. జయశంకర్ 83వ జయంతి సందర్భంగా కేసీఆర్ ఆయనకు ఘన నివాళులర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను గుర్తు చేసుకున్నారు. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం కృషి చేసిన జయశంకర్‌ను తెలంగాణ సమాజాం ఎన్నటికీ మరువదని కేసీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో విలీనమైన నాటి నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం రగిలే వరకు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించుకుంటూ వచ్చి, భావజాల వ్యాప్తికి జీవితాన్ని ధారపోశారని సిఎం కొనియాడారు. భావజాల వ్యాప్తికి తన జీవితాన్నే ధారపోశారని గుర్తుచేశారు. జయశంకర్ సర్ తెలంగాణ సమాజానికి ఎన్నటికీ స్ఫూర్తి ప్రధాతగానే నిలుస్తారన్నారు. సార్ కలలు కన్నట్లే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ బంగారు తెలంగాణ దిశగా ముందుకెళ్తొందన్నారు. మంత్రి తుమ్మలకు పరామర్శ : అస్వస్థతకు గురై యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. ఆదివారం మధ్యాహ్నం ఆసుపత్రికి వెళ్లి తుమ్మలతోనూ, వైద్యులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. చికిత్స అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. త్వరగా కోలుకోవాలని, తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాతే విధులకు హాజరుకావాలని సిఎం కేసీఆర్ మంత్రి తుమ్మలకు సూచించారు.



కేంద్రంపై 'టి.సర్కార్' యుద్ధం!

- తాడో..పేడో తేల్చుకొనేందుకు నిర్ణయం
- రాష్ట్రానికి అన్యాయంపై సీఎం గుర్రు
- ఒంటెత్తు పోకడలంటూ ఆగ్రహం
- ప్రభుత్వ పథకాలపై జీఎస్టీ పన్నుపై గుస్సా



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తూ వస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కేంద్ర ప్రభుత్వ విధానాలపై యుద్ధం చేయాలని నిర్ణయించారు. రూ.1000, 500రూపాల కరెన్సీ రద్దు చేసిన తర్వాత దేశంలో ఏ ముఖ్యమంత్రి స్పందించక ముందే కేసీఆర్ స్పందించారు. కేంద్ర నిర్ణయాన్ని ఆయన బలపరచడమే కాకుండా, శాసనసభలో సైతం నిర్ణయాన్ని సమర్థించారు. అప్పట్లో బీజేపీతో కేసీఆర్ దోస్తీ అయ్యిండన్న ప్రచారం కొనసాగింది. అనంతరం ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థికి మద్ధతు ప్రకటించిన బీజేపీయేతర తొలి ముఖ్యమంత్రి కూడా కేసీఆరే. దీనితో పాటు ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుకు సైతం సంపూర్ణ మద్ధతు తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు ముగిసిన గంటలోనే జీఎస్టీ కమిటీ నిర్ణయంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణాలో ప్రజా సంక్షేమం కోసం..దీర్ఘకాల సమస్యను నివారించేందుకు వేల కోట్లు వెచ్చించి చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ, రోడ్ల అభివృద్ధి పథకాలకు జీఎస్టీ విధించడాన్ని మొదటి నుంచి తెలంగాణ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ పథకాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ పలు మార్లు ప్రధాని నరేంద్రమోడీతో పాటు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కలిసి వినతులు సమర్పించారు. సాగునీరు.. తాగునీరు.. రోడ్లు వంటి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే పనులపై జీఎస్టీ విధించడం అన్యాయం. ప్రభుత్వ కాంట్రాక్టు పనులపై జీఎస్టీ ఎత్తేయండి. కనీసం 5 శాతానికి తగ్గించండి. ఒక్క తెలంగాణకు మాత్రమే కాదు.. అన్ని రాష్ట్రాలకూ ఇది భారమే అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ సాక్షాత్తూ ప్రధాన మంత్రి మోదీకి విన్నవించారు. టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో నినదించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మంత్రులతో కలిసి టీఆర్ఎస్ మంత్రులు జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఒత్తిడి చేశారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అనేకసార్లు మొర పెట్టుకున్నారు. అయినా కూడా శనివారంనాడు ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కమిటీలో ప్రాజెక్టులకు 18శాతం నుంచి 12శాతం జీఎస్టీ విధించాలంటూ తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలపై పన్నేంటి!?.. జీఎస్టీకి ముందటి ప్రాజెక్టులకూ 12 శాతమా? తెలంగాణపైనే 19 వేల కోట్ల భారం.. అన్ని రాష్ట్రాలకు కూడా ఇది తీవ్ర సమస్య అంటూ జీఎస్టీ కమిటీ నిర్ణయాన్ని ఆయన తూర్పారబట్టారు.

కేంద్ర సర్కారుపై న్యాయపోరాటం : ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేపట్టే పనులపై జీఎస్టీ విధించడం రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై కేంద్రం దిగి రాకపోతే న్యాయపోరాటం చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకుగాను ఆదివారంనాడు ప్రభుత్వ సంక్షేమపథకాలపై జీఎస్టీ విధింపునకు సంబందించిన అంశాలను న్యాయశాఖ అధికారులతో పాటు పేరున్న న్యాయవ్యాదులతో సలహాలు సైతం తీసుకున్నట్లు సమాచారం. న్యాయసలహాలు తీసుకున్న ముఖ్యమంత్రి ఆదివారంనాడు ప్రధానమంత్రికి లేఖ ద్వారా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈనెల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కావాలని అనంతరం ప్రధాని నరేంద్రమోడీతో భేటీలో ప్రభుత్వం చేపట్టే పనులపై జీఎస్టీ ఎత్తివేయాలని గట్టిగా కోరాలని నిర్ణయించారు.

అన్ని రాష్ట్రాలను కూడగట్టే యత్నం...: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే పనులు, ప్రాజెక్టుల కాంట్రాక్టు పనులపై 12శాతం జీఎస్టీ విధించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీఎం కేసీఆర్, జీఎస్టీ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకించేందుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో స్వయంగా మాట్లాడి మద్దతుసైతం కూడగట్టే ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి అంశానికి మద్దతు ప్రకటిస్తున్నా...తాము చేసిన వినతులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక తాటిపైకి రానున్న ములాయం, లాలూ, శరద్ యాదవ్

న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న ముగ్గురు కీలక నేతలు ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, శరద్ యాదవ్ ఒకే తాటిపైకి రానున్నారు. ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు వారు ముగ్గురు కలసి ఓ రాజకీయ వేదికను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఈ త్రిమూర్తుల కలయిక 2019 సాధారణ ఎన్నికల్లో ఎన్డీయే విజయావకాశాలపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే లాలూ, శరద్‌లతో ములాయం సింగ్ చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ఫాసిస్టు శక్తులపై పోరాడేందుకు తమతో చేతులు కలపాలని శరద్ యాదవ్‌ను ఇప్పటికే లాలూ కోరిన సంగతి తెలిసిందే. మరో వైపు వారు ముగ్గురూ ఏకం కావడం కాంగ్రెస్ పార్టీకి కూడా ఇబ్బందిని కలిగిస్తోంది. కాంగ్రెస్‌తో జత కట్టేందుకు ములాయం సింగ్ ససేమిరా అంటున్నారు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా కుంతియా

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా రామచంద్ర కుంతియాను అధిష్ఠానం నియమించింది. ఈ నెల 8న వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయనకు అధిష్ఠానం లేఖ పంపింది. సహజంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి మాత్రమే సీడబ్ల్యూసీ సభ్యునిగా అవకాశం ఇస్తారు. అయితే, ప్రధాన కార్యదర్శిగా కుంతీయాను నియమించక పోయినా ఆయనకు సీడబ్ల్యూసీలో అవకాశం ఇవ్వడంతో త్వరలోనే ఆయనను ప్రధాన కార్యదర్శిగా కూడా నియమిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో కుంతియానే రాబోయే రోజుల్లో తెలంగాణకు దీర్ఘ కాల ఇన్‌చార్జ్‌గా ఉంటారని భావిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణకు కార్యదర్శిగా ఉన్న కుంతియాను ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జ్‌గా నియమించిన ఏఐసీసీ దీర్ఘ కాలికంగా కొనసాగిస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పదవి నుంచి దిగ్విజయ్ తొలగించిన విషయం తెలిసిందే.


మొదటి పేజీ తరువాయి

బీజేపీ దోస్తీ ఎవరితో?

చర్చ సాగింది. ఇలా టీడీపీ, వైసీపీ పార్టీలు బీజేపీతో జతకట్టే విషయంలో తమ సానుకూల వైఖరిని స్పష్టంచేసినా బీజేపీ జాతీయ నాయకత్వం మాత్రం ఈ పొత్తులు, దోస్తీ విషయంలో మాత్రం మాట మాత్రం నోరు తెరవడంలేదు. కానీ బీజేపీకి ఏపీలో ఎదిగేందుకు ఇప్పటికిప్పుడు ఉన్న అవకాశాలు మాత్రం అంతంత మాత్రమే. కానీ దోస్తీ విషయంలో ఆ పార్టీ ప్రదర్శిస్తున్న వైఖరి మాత్రం రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలను ఆత్మరక్షణలో పడేస్తోంది.

వ్యూహాత్మక మౌనమా...?: జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కోనే బలమైన కూటమి గానీ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ గానీ ఇంకా అంతగా పుంజుకోలేదన్నది రాజకీయ వర్గాల భావన. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలు తమ తమ అవసరాల రిత్యా బీజేపీతో జతకట్టేందుకు పోటీపడుతున్నాయన్నది సమాచారం. రాష్ట్రంలో బీజేపీ దోస్తీతో అటు టీడీపీ గానీ ఇటు వైసీపీ గానీ పెద్దగా బలపడే అవకాశాలు మాత్రం లేవు. కానీ బీజేపీతో పొత్తు కింద కొన్ని సీట్లు కేటాయించి టీడీపీ, వైసీపీలు నష్టపోవాల్సి వస్తుంది. అయినా బీజేపీతో దోస్తీ కోసం ఈ రెండు పార్టీలు పోటీపడటం వెనక వారి వారి అవసరాలు అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కేంద్రంలోని తిరిగి బీజేపీ సర్కార్ వస్తుందన్నది ఈ రెండు పార్టీల భావన కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. కేంద్రంలో తిరిగి బీజేపీ ప్రభుత్వం వస్తుందన్న సంకేతాలు పంపిస్తున్న కమలనాథులు దానినే అవకాశంగా మల్చుకొని దక్షణాధిన బలపడే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులో జయలలిత మరణం తరువాత అన్నాడిఎంకెలో గ్రూపులు మొదలయ్యాయి. అన్నాడిఎంకెలో ఈ గ్రూపులు బీజేపీ తెరచాటు వ్యూహం పుణ్యమేనన్నది రాజకీయ వర్గాల్లో చర్చ. ఇక తమిళనాడు రాష్ట్ర రాజకీయాలలో వచ్చే ప్రయత్నం చేస్తున్న రజనీకాంత్‌ను వలవేసేందుకు బీజేపీ నాయకత్వం సర్వశక్తులు ప్రయత్నం చేస్తోంది. జాతీయ స్థాయిలో ఉన్న తన గ్లామర్‌ను ఆధారంగా చేసుకొని తెలుగు రాష్ట్రాలలో కాలు మోపేందుకు కమల దళం పావులు కదుపుతోంది. అందుకే టీడీపీ, వైసీపీ తమతో జతకట్టే విషయంలో బహిరంగంగా ముందుకొస్తున్న బీజేపీ జాతీయ నాయకత్వం మాత్రం దీనిపై వ్యూహాత్మకంగా మౌనందాల్చుతున్నట్లు తెలుస్తోంది. ఏ పార్టీ బలంగా ఉంటే ఆ పార్టీ వైపు ఎన్నికల నాటికి మొగ్గుచూసేందుకేనా ఈ మౌనం అన్న చర్చ ఓ వైపు సాగుతుంటే రేపు భవిష్యత్తు అవసరాల రిత్యా ఏ పార్టీ తమ వద్ద రాయబారానికి వస్తుందా ఆ పార్టీతో పెద్ద ఎత్తున్న భేరమాడి అత్యధిక సీట్లు లాగే వ్యూహంలోనే బీజేపీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీలో బలపడాలంటే టీడీపీ, వైసీపీల పట్ల ప్రత్యర్థివైఖరిని ప్రదర్శిస్తూ తన బలాన్ని పెంచుకోవడమే కాకుండా పొత్తు కట్టేందుకు వచ్చే పార్టీతో భారీ డీల్ చేసి గణనీయంగా సీట్లు అడిగే వ్యూహంలోనూ బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. పొత్తు కట్టి కేవలం పదిలోపు సీట్లుతో సరిపుచ్చుకోకుండా మెజార్టీ సీట్లు సాధించే దిశగా కమల దళం వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. ఇలా చట్టసభలో ఏపీలోనూ తన బలాన్ని పెంచుకొనే దిశగానే తన వ్యూహాన్ని పదునుపెట్టే అందుకు అంగీకరించే పార్టీకి బీజేపీ జైకొట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

దినకరన్‌కు షాక్ : పార్టీ ఆఫీసుకు వస్తే అరెస్ట్ చేయాలని సీఎం పళనిస్వామి ఆదేశం



చెన్నై : తమిళనాడు రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా అన్నా డీఎంకే పార్టీలో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. శశికళ బంధువు, పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్ పార్టీ కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తనను ఎవరు ఆపుతారో చూస్తానని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా అన్నా డీఎంకే పార్టీ కార్యా లయం వద్ద పోలీసు భద్రతను పెంచారు. ఒకవేళ దినకరన్ పార్టీ కార్యాల యానికి వస్తే, అరెస్ట్ చేయాలని ముఖ్యమంత్రి పళనిస్వామి ఆదేశాలు జారీ చేశారు. దినకరన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ కార్యాలయంలోకి అడుగు పెట్టనివ్వబోమని పళనిస్వామి, పన్నీర్ సెల్వం వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి.

బడుగుల ఆగ్రహ జ్వాల

రాజ్యాంగ బద్ధమైన హోదా కల్పించే బిల్లును ఆమోదించాలని బీసీలు డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలతో పాటు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానాకు చెందిన వేలాది మంది బీసీలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు 1470 ఐఏయస్, ఐపియస్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీసీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టే వరకు పోరాటం ఆగదన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిల పక్షనేతల ప్రతినిధి బృందంతో వెళ్లి ప్రధాని నరేంద్రమోదీని కలిసి పార్లమెంటులో బిసి బిల్లు పెట్టించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు అసెంబ్లీలలో తీర్మాణం చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. పార్లమెంటులో ఉన్న 36 రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నం కొనసాగించాలని కోరారు. పార్లమెంటులో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా బీసీల పక్షాన మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. దేశంలోని అత్యధిక శాతం జనాభా కలిగిన కులాల ప్రధాన సమస్యలను పట్టించుకోని రాజకీయ పార్టీలను వ్యతిరేకించే రోజులు దగ్గరలో ఉన్నాయని, రాబోయే ఎన్నికలల్లో ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీలు సిద్దంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. రాజస్థాన్ గుజ్జర్లు, గుజరాత్ పటేళ్లు, హర్యానాలో జాట్లు చేసినట్లు తెగించి పోరాటం చేయాలని బీసీలకు పిలుపునిచ్చారు. బీసీ కమిషన్‌ను రాజ్యసభలో ప్రతిపక్షాలు వ్యతిరేకించడం బాధాకర మని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ రంగంలో 14శాతం ప్రాతినిద్యం దాటలేదని కేంద్ర ప్రభుత్వమే ఇటీవల సేకరించిన సమాచారంలో వెల్లడయ్యిందన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా మెజార్టీ ప్రజలైన బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో కనీస ప్రాతినిద్యం దక్కడం లేదు. అక్రమంగా సంపాదించి, స్కాములు చేసిన అగ్రకుల నేతలు అసెంబ్లీ-పార్లమెంటు ఎన్నికలలో కోట్లు గుమ్మరించి, ఓటుకు నోటుతో బీసీలను అణగదొక్కుతూ చట్ట సభలలో తిష్ట వేస్తున్నారని ఆయన మండి పడ్డారు. హక్కుల సాధనకోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని, మెజార్టీ ప్రజలను పాలనలో భాగస్వామ్యం కల్పించకపోతే ఈ దేశంలోని రాజకీయ పార్టీలకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసేందుకు బీసీలను మేల్కొలుపుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, సత్యనారాయణ, గొరిగె మల్లేష్ యాదవ్, గుజ్జ రమేష్, నీల వెంకటేష్, వేణుమాధవ్, శారదాగౌడ్, భిక్షపతి, అభిలాష్ యాదవ్, భూపేష్ సాగర్, బర్క కృష్ణ యాదవ్, రామలింగం తదతరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

నేడు చంద్ర గ్రహణం

ప్లాన్ చేసుకోవాలని టిటిడి తిరుమల జెఇఓ కె.ఎస్.శ్రీనివాసరాజు తెలియజేశారు. తిరుమలలో ఆదివారం జెఇఓ మీడియాతో మాట్లాడుతూ సోమవారం రాత్రి 10.52 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై మరుసటి రోజు మంగళవారం ఉదయం 12.48 గంటలకు పూర్తవుతుందని, అయితే గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ నెల 8వ తేది ఉదయం 2 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యహవచనం నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అష్టదళ పాదపద్మారాధన, అనంతరం ఉదయం 7 గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుందన్నారు. గ్రహణం సమయంలో కంపార్టుమెంట్లలోకి భక్తులకు అనుమతి ఉండదని తెలిపారు. అదే విధంగా అన్నప్రసాద భవనం, కంపార్ట్‌మెంట్లు, క్యూలైన్లలో అన్నప్రసాద వితరణ ఉండదని తెలియజేశారు. సోమవారం అలిపిరి మార్గంలో 4 వేలు, శ్రీవారి మెట్టు మార్గంలో 2 వేల టోకెన్లు కలిపి మొత్తం 6 వేల దివ్యదర్శనం టోకెన్లు మ్రామే జారీ చేస్తామన్నారు. నడకదారి భక్తులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు. చంద్రగ్రహణం కారణంగా సోమవారం విశేషపూజ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు తెలిపారు.

చంద్రులకు మావోల ముప్పు



రాష్ట్రాలలో మావోయిస్టు ఉద్యమం బలపడటానికి చాలా అవకాశాలున్నాయి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్థిరత్వాన్ని సాధించకపోవడం. నూతన రాష్ట్రాలు నిర్వహణ, నిధుల సమీకరణ, పాలనా వ్యవస్థ తదితర సమస్యల్లో నిమగ్నమవడం మావోయిస్టు పార్టీ బలోపేతానికి ఉపకరించనున్నాయి. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు సాధారణ శాంతిభద్రతలపై దృష్టిసారించడంలోనే ఉండిపోయాయి. ఈ తరహా పరిస్థితులను మావోయిస్టు పార్టీ అవకాశంగా చేసుకుని పార్టీ విస్తరణ దిశగా అడుగులేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర విభజన ఉద్యమం నుంచే పార్టీ బలోపేతమవుతూ వస్తోంది. ఈక్రమంలో రెండు రాష్ట్రాల్లో విభజన సమయంలో హోరెత్తిన ఉద్యమాల సమయం నుంచి ముందస్తుగా పార్టీని ఇరు ప్రాంతాల్లో బలోపేతం దిశగా పయనించాయి. ఇటీవల కాలంలో వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం వనకుటీరాలో మావోయిస్టులు దుశ్చర్యకు దిగారు. వైల్డ్ లైఫ్ విభాగానికి చెందిన ఓ వాహనాన్ని, మరో ఇంటిని మావోయిస్టులు తగలబెట్టారు. హరిత హారం పేరుతో పేదిత వర్గాల భూములను లాక్కోవాలని టీఎస్ ప్రభుత్వం చూస్తోందని, ఆదివాసీల పోడుభూములను స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వానికి తగిన విధంగా బుద్దిచెబుతామని హెచ్చరించారు. గ్రీన్‌హంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని సంఘటనాస్థలంలో వదిలి వెళ్లిన లేఖలో పేర్కొన్నారు.ఈ క్రమంలో అటవీ శాఖకు చెందిన గెస్టు హౌజ్, జీపును తగలబెట్టారు. ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల సీపీఐ మావోయిస్టు నేత దామోదర్ పేరిట రాసిన లేఖ సంఘటనా స్థలంలో లభ్యమైనట్టు పోలీసు అధికారులు తెలిపారు. అటు ఏపీలో విశాఖ జిల్లాలోని మంచంగిపుట్ట మండలం గొబ్రపడలో మావోయిస్టులు ఘాతుకానికి తెగబడ్డారు. రామన్న అనే గిరిజన యువకుడిని హతమార్చారు. మృతదేహం తమ ఆధీనంలోనే ఉందంటూ గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో గిరిజన గూడెంలో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. తమ కదలికలపై పోలీసులకు సమాచారం అందిస్తున్నాడనే నెపంతో రామన్నను మావోయిస్టులు శనివారం కిడ్నాప్ చేసిన విషయం విదితమే. రామన్నను నిర్బంధించే క్రమంలో నాలుగు ఇళ్లను కూడా పేల్చేశారు. మావోయిస్టుల దుశ్చర్యను ఖండించిన విశాఖ జిల్లా పోలీసులు.. తమకు సహకరిస్తున్నాడనే నెపంతో అమాయక గిరిజనుణ్ని పొట్టనపెట్టుకున్నారన్నారని వివరిస్తున్నారు. విశాఖ జిల్లా ముంచంగిపుట్ మండలంలోని గొబ్బరిపడలో మావోయిస్టులు నలుగురు గిరిజనులను కిడ్నాప్ చేయడమే కాకుండా నాలుగు ఇళ్లను తగులబెట్టిన సంఘటన జరిగింది. ఈ సంఘటనతో గొబ్బరిపడ గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నామని చెప్పి మావోలు ఈ చర్యకు పూనుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసు ప్రత్యేక దళాలు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. మావోయిస్టు సీనియర్ నేత ఎన్ కౌంటర్, నలుగురు గిరిజనుల కిడ్నాప్ ఘటన, రామన్న అనే గిరిజన యువకుడి హత్యతో తెలుగు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశారు. మావోయిస్టులు తెలుగు రాష్ట్రాలలో తలదాచుకునే అవకాశా లున్నాయని పోలీసులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇసుక మాఫియా, నేరెళ్ల ఘటనపై స్పందిస్తూ తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకుడు తాజాగా జగన్ బహిరంగ లేఖ రాసిన విషయం విధితమే. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌లు పూర్తిస్థాయిలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, కాగా కర్ణాటక రాష్ట్రాన్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని పార్టీ కార్యక్రమాలు చేపడుతోంది. ఇక ఆంధ్రపదేశ్ విషయానికి వస్తే పొరుగు రాష్ట్రాలైన ఒడిశా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కాగా కర్ణాటకాను షెల్టర్ జోన్‌గా చేసుకున్న విషయం విధితమే. రెండు రాష్ట్రాలు కర్ణాటకను షెల్టర్ జోన్‌గా చేసుకుని బలోపేతమవుతున్నాయి. దీంతో ఉద్యమంతోపాటు పార్టీ కార్యక్రమాలు ఊపందుకునే అవకాశాలు సైతం ఉన్నాయి. గతంలో ఇంటలిజెన్సీ విభాగంలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులు పదవీ విరమణ పొందారు. కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడం, అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారులను తెలంగాణకు కేటాయించారు. దీంతో అధికారుల వికేంద్రీకరణ కారణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు తగ్గిపోయాయి. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందిలో కొంతమేర బలంగా ఉన్న కారణంగా అరకొర ఫలితాలు సాధ్యమవుతున్నాయి. ఈక్రమంలో మావోయిస్టు కేంద్ర కమిటి తాజాగా రెండు రాష్ట్రాలలో బలోపేతం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో బెంగళూరు కేంద్రంగా చేసుకుని పార్టీ పటిష్టం చేసేందుకు యత్నాలు సాగుతున్నాయి. అలాగే తెలంగాణలో పార్టీ పటిష్టానికి చత్తీస్‌గడ్‌ను కేంద్రంగా చేసుకున్నట్లు సమాచారం. రెండు రాష్ట్రాలలో షెల్టర్‌జోన్స్ నుంచి పరేషన్స్ నిర్వహించాలని నిర్ణయాలు తీసుకున్నట్టు తెలియవచ్చింది. ఈ విషయంపై పార్టీ దృష్టిసారించిందని, ఇకపై పార్టీలోనూ ఆపరేషన్స్ చేసే దళాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారన్నది సమాచారం. ఈక్రమంలో ఏకే47 సంఖ్య పెంచడం, ఏకే 56లను వినియోగించడం, గ్రెనేడ్స్ వాడకం, అత్యాధునిక బైనాక్యులర్స్, భారీ ఎత్తున తూటాలను సమకూర్చుకోవడంతోపాటు, వాటనికి తీసుకెళ్లగలిగే సామ్యర్థాన్ని పెంపొందించుకునే దిశగా పార్టీ సమాలోచనలు చే స్తోంది. పార్టీలో చురుకైన యువకులను గ్రేహౌండ్స్ దళాలకు ధీటుగా కఠోర శిక్షణ ఇచ్చేందుకు పార్టీ కసరత్తులు చేస్తోంది. ఇటు అత్యాధునిక ఆయుధాలు, అటు ప్రత్యేక శిక్షణ పొందిన దళాల ఏర్పాటుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మావోయిస్టులు బలపడేందుకు యత్నాలు సాగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల డిజిపిలు ఎప్పటికప్పుడు ఛత్తీస్‌గడ్ పోలీసు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో భారీ ఎత్తున బలగాలను మోహరించన్నుట్లు తెలియవచ్చింది. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రా సరిహద్దులో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ముఖ్యంగా దంతెవాడ జిల్లా సరిహద్దు నుంచి రాకపోకలు సాగించే వారిపై నిఘా అధికం చేశారు. ఇందులో భాగంగా కుబింగ్ దళాలను సైతం అప్రమత్తం చేశారు. వందలాది మంది మావోయిస్టులు ఒక్కసారిగా తెలుగు రాష్ట్రాలలోకి చొరబడే అవకాశం ఉందన్న కోణంలో పోలీసు ఉన్నతాధికారులు సమాలోచనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గడ్ నుంచి మావోయిస్టులు తెలుగురాష్ట్రాలలోకి ప్రవేశించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.కాగా సరిహద్దు రాష్ట్రాల నుంచి వారి చొరబాట్లను నిలువరించేందుకు జిల్లా పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. మావో యిస్టులు ఎక్కడో ఒకచోట పంజా విసురుతూనే ఉన్నారు. జిల్లా పోలీసు అధికారులు నక్సలైట్ల ఆటలను కట్టడి చేస్తున్న ప్రతిసారీ మావోయిస్టులు మహారాష్ట్ర-ఆదిలాబా ద్ సరిహద్దుల్లో తమ ఉనికి చాటుతూనే ఉన్నారు. వరుసగా ఏదో ఒక హింసాత్మక సంఘటనకు పాల్పడి కలకలం రేపుతున్నారు. ఇటీవల మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌ల నుంచి మావోయిస్టులు ప్రాణహిత నది గుండా జిల్లాలోకి చొరబడుతున్నార న్న పక్క సమాచారంతో పోలీసులు అడవులను జల్లడప డుతున్నారు.అయితే పోలీసుల కూంబింగ్‌ల కళ్లుగప్పి నక్సలైట్లు జిల్లాలోకి యథేచ్ఛగా చొరబడుతున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనల బట్టి అర్థమవుతోంది. పోలీసులు ఓ వైపు ప్రాణహిత నది పరివాహకంలోనే కాకుండా ప్రభావిత పల్లెల్లో పెద్దఎత్తున కూంబింగ్‌లు జరువుతుండగానే బుధవారం తెల్లవారుజామున బెజ్జూర్ మండలం గూడెం గ్రామ సమీపంలో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడి అలజడి రేపారు. ఇక్కడ ప్రాణహి త నదిపై నిర్మిస్తున్న వంతెన పనుల కోసం ఉపయోగిస్తున్న వాహనాలను మావోయిస్టులు దహనం చేశారు. ప్రభుత్వం ప్రజల అనుమతి లేకుండా ఓపెన్ కాస్టు గనులను తవ్వేందుకు సిద్ధమవుతోందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలంటూ మావోయిస్టులు సంఘటన స్థలంలో వదిలిన లేఖలో పేర్కొనడం సంచలనం రేపింది. ఓపెన్ కాస్టు గనులను అడ్డుకోవాలంటూ నక్సలైట్లు ఓ వైపు ప్రజలకు పిలుపునిస్తూనే మరోవైపు ఓపెన్ కాస్టు గనుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలం టూ సర్కార్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల వరకు స్తబ్దంగా ఉన్న మావోయిస్టులు వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు చెందిన యంత్రాలను దహనం చేసి ఓపెన్ కాస్టు గనుల వ్యవహారాన్ని తెర పైకి తేవడం గమనార్హం. ఇప్పటికే తూర్పు ప్రాంతంలో ప్రజలు, ప్రజా సంఘాలు, వివిధ ప్రతిపక్ష పార్టీలు ఓపెన్ కాస్టు గనులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే అంశాన్ని భుజానెత్తుకొని తిరిగి తూర్పు ప్రాంత ప్రజల సానుభూతిని సంపాదించాలని మావోయిస్టు పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

అలాగే మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాలను జిల్లాకు అనుసంధానం చేస్తే ప్రాణహిత నది పై బ్రిడ్జి నిర్మాణం ఈ 3 రాష్ట్రాలకు మావోయిస్టులకు కంట గింపు గా మారుతుంది. దీని నిర్మాణాల పనులను అడ్డుకోవాలనే లక్ష్యంతోనే మావోయిస్టులు హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వర్గాలు భావిస్తున్నాయి.దాదాపుగా మావోయిస్టు ఉద్యమం తుడిచి పెట్టుకుపోయిందనుకుంటున్న తరుణంలో మావోయిస్టులు తామున్నామంటూ విధ్వంసానికి పాల్పడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గడిచిన రెండేళ్లలో మావోయిస్టులు అక్కడో ఇక్కడో తమ ఉనికి చాటుతున్నారు. ఇప్పటికే పక్క రాష్ట్రంలో తరుచూ జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో మావోయిస్టులు తరుచూ ఇక్కడికి వచ్చి తలదాచునేకు అవకాశాలు లేకపోలేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక వైపు అటవీ ప్రాంతంలో గాలింపుకొనసాగిస్తూనే ప్రాణహిత సరిహద్దుల్లో గట్టి తనిఖీలు చేస్తున్నారు.

దత్తాత్రేయ ఆగ్రహం

అంశంపై తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన విమర్శలను ఆయన ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ఏ అంశంపైనా ఏకపక్ష నిర్ణ యం తీసుకోలేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించిన తర్వాతే జీఎస్టీ అమల్లోకి తెచ్చామని తెలిపారు. ఈ అంశంపై నిర్వహిం చిన పలు సమావేశాలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ హాజరైన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని కేసీఆర్ అనడం సమంజసం కాద న్నారు. ఒకే దేశం ఒకే పన్ను విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని తొలుత స్వాగతిం చింది టీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన మరోసారి గుర్తుచే శారు. తమ అవసరాలకు అనుగుణంగా మాట్లాడడం సరికాదన్నారు. జీఎస్టీ 12శాతం నుంచి తగ్గే అవకాశం ఉందన్నారు. రైతాంగానికి ఉపయోగపడే అంశం కావడంతో దీనిపై అరుణ్ జైట్లీతో చర్చిస్తానని ఆయన చెప్పారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నిక కావడం అభినందనీయని అన్నారు. అనేక ప్రాంతీయ పార్టీలు ఆయనకు మద్దతివ్వడం నూతన పరిణామానికి నాంది అని బండారు దత్తాత్రేయ తెలిపారు.

టిడిపిలోకి మంత్రి కామినేని?



చేసుకుంటే కామినేని తన మంత్రి పదవిని కోల్పోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆయన టీడీపీలోకి చేరాలని భావిస్తున్నట్టు సమాచారం. టీడీపీలోకి చేరితే, తన మంత్రి పదవికి ధోకా ఉండదనేది కామినేని అభిప్రాయంగా తెలుస్తోంది. మరోవైపు తనకు బీజేపీని వీడాలన్న ఆలోచన ఏమాత్రం లేదని ఆయన బయటకు చెబుతున్నారు. బీజేపీ సిద్ధాంతాలను తాను ఇష్టపడతానని, పార్టీని వీడే ప్రసక్తే లేదని ఆయన అంటున్నారు.



తండోపతండాలుగా బయలుదేరిన ప్రజలు

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః నేడు వరంగల్ నగరంలో నిర్వహిస్తున్న టిఆర్ఎస్ బహిరంగ సభకు ప్రజలు తండోప తండాలుగా బయలుదేరారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. ఇప్పటికే పాలమూర్, ఇందూర్ తదితర జిల్లాల నుండి వచ్చిన రైతులు నగర శివార్లలోకి చేరుకున్నారని వివరించారు. వారంతా నేడు సాయంత్రం సభా స్థలికి చేరుకుంటారని తెలిపారు. టిఆర్ఎస్ ఏర్పాటు చేయబోయే బహిరంగ సభ స్థలి ప్రకాశ్‌రెడ్డి పేటను సందర్శించిన ఆయన అనంతతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో భారీ బహిరంగ సభలను నిర్వహించిన చరిత్ర ఓరుగల్లుకు ఉందన్నారు. అదే స్పూర్తితో ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేతలతో పాటు ప్రజలు కూడ స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు ఆసక్తిని చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభ కోసం పార్టీ డబ్బులు ఖర్చు చేయడం లేదని శ్రమదానం ద్వారా నిధుల సమీకరణ చేశామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ నగరంలో నిర్వహించిన సభ గిన్నీస్ రికార్డులలోకి ఎక్కిందని గుర్తు చేశారు. అదే స్పూర్తితో టిఆర్ఎస్ శ్రేణులు ఈ సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో బాగంగా టిఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మందితో ఈ సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల ప్రజలను సభకు తరలిస్తున్నామని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని వారి అవినీతిని ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాజకీయ కక్ష సాదింపులకు పాల్పడాల్సిన అవసరం టిఆర్ఎస్ పార్టీకి లేదన్నారు.


ఈ సమావేశంలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, అరూరి రమేశ్, వినయ్‌భాస్కర్, కొండాసురేఖ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, కుమార్, పోగుల సుదాకర్, చింతం సదానందం తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం

ఎదురుచూస్తున్న వలస నేతలు

- తెలంగాణలో టిడిపిని ఖాళీ చేసిన టిఆర్ఎస్
- టిడిపి నేతలతో పాటు గులాబీ కండువాలు వేసుకున్న క్యాడర్
- నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు
- టిఆర్ఎస్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్న కెసిఆర్
- పార్టీలో బెర్త్ దొరకక ఇబ్బందులు పడుతున్న నేతలు
- ప్రభుత్వంలో స్థానం కోసం మరికొందరి ఎదురుచూపులు
- మీడియాకు దూరంగా ఉంటున్న కీలక నేతలు
- ఎంపి, ఎమ్మెల్యేలకు కరవైన ఆదరణ





మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః తెలంగాణలో టిఆర్ఎస్ రోజు రోజుకు బలపడుతుంది. ఓ వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో ఆ పార్టీ దూసుకుపోతుంది. పార్టీకి ప్రజల నుండి విశేష స్పందన వస్తుంది. దీంతో అన్ని పార్టీల నుండి అధికార పార్టీలోకి వలసల జోరు కూడ అలాగే కొనసాగింది. పార్టీ, ప్రభుత్వ పదవుల పంపిణీపై ఇన్నాళ్లు మౌనం వహించిన సిఎం కెసిఆర్ ఇపుడు దూకుడు పెంచారు. రాబోయే కొద్దీ రోజులలో పదవులన్నింటిని పంపిణీ చేసేందుకు రంగం సిద్దం చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న గులాబీ కండువాలు కప్పుకున్న తదనంతరం కూడ పలువురు నేతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకపుడు ఇతర పార్టీలలో ఉండి తమ హవాను కొనసాగించిన వారు ఇపుడు సైలెంట్ అయిపోయారు. కనీసం మీడియా సమావేశాలు కూడ నిర్వహించే సాహసం చేయడం లేదు. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు వరంగల్ జిల్లాకే చెందిన మాజీ మంత్రి బస్వరాజ్ సారయ్య, రాజ్యసభ ఎంపి గుండు సుధారాణి లతో పాటు సీనియర్ నేత పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి పి.రాములు గ్రేటర్ హైదరాబాద్ నగరానికి చెందిన కె. విజయరామారావు వంటి నేతలున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో పాటు పార్టీ మారిన పలువురు నాయకులు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.పార్టీ మారే సందర్భంలో తమకు అధినేత నుండి స్పష్టమైన హామీ ఉందని కొందరు నేతలు పేర్కొంటుంటే మరికొందరు మాత్రం జిల్లా స్థాయిలోనైనా అవకాశాలు రాకపోతాయా అంటు ఎదురుచూస్తున్నారు. నామినేటెడ్ పదవుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావడంతో పలు మార్కెట్, దేవాలయ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు కార్పోరేషన్ ఛైర్మన్ పదవులతో పాటు ఎమ్మెల్సీ వంటి పదవులను ఆశించి పార్టీలో చేరిన వారు ఎదురుచూపులతో కాలం వెళ్లదీస్తున్నారు.

దక్షిణ తెలంగాణలో నలుగురు నేతల ఎదురుచూపులు...

గ్రేటర్ హైదరాబాద్ కార్పోరేషన్ ఎన్నికలను టిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే ఎలక్షన్స్‌కు ముందు ఇతర పార్టీలకు చెందిన నేతలను భారీగా పార్టీలో చేర్చుకుంది. ఇందులో ప్రధానంగా టిడిపి నుండి వచ్చిన మాజీ మంత్రులు కె. విజయరామారావు, సి. కృష్ణాయాదవ్, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, మాగంటి గోపినాథ్, సాయన్న, మాధవరం కృష్ణారావు వంటి వారు ఉన్నారు. వీరందరికి రాజకీయంగా ఉన్నత స్థానం కల్పిస్తామని సిఎం కెసిఆర్‌తో పాటు పార్టీ సీనియర్‌నేతలు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాలలో హ్యాపిగానే ఉండగా పదవులు లేని సీనియర్‌నేతలు మాత్రం తమకెపుడు అవకాశాలు వస్తాయో తెలియక ఎదురుచూస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయింది. రెండు ప్లీనరీలు జరిగినా రాష్ట్ర కార్యవర్గాన్ని మాత్రం కెసిఆర్ ప్రకటించలేదు. కనీసం పార్టీ పదవులైన దక్కుతాయనుకున్న వారికి నిరాశే ఎదురైంది. పార్టీ అనుబంద సంఘాల అధ్యక్షులుగా ఉన్న బొంతు రామ్మోహన్, తుల ఉమ, బాల్కసుమన్ వంటి వారిని కీలకమైన పదవులు వరించాయి. అయినా వారే ప్రస్తుతం అనుబంద సంఘాల అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పార్టీ అగ్రనేతలు, మంత్రుల అపాయింట్‌మెంట్లు కూడ లభించడం లేదని మరికొందరు నేతలు వాపోతున్నారు. తమతో పాటు వచ్చిన కార్యకర్తలకు కనీసం న్యాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓరుగల్లు ఖిల్లాలో ఎర్రబెల్లి సహ పలువురు నేతల ఇక్కట్లు...

తాము ప్రాతినిథ్యం వహిస్తున్న పార్టీని కాదని గులాబీ గూటికి చేరిన మరో నలుగురు కీలక నేతలు వరంగల్ జిల్లాలో పదవుల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఉన్నారు. టి టిడిపిలో కీలకనేతగా ఉంటూ దశాబ్దకాలం పాటు టిఆర్ఎస్ పై పోరు కొనసాగించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు అనూహ్య రాజకీయ పరిణామాల మధ్య గులాబీ గూటికి చేరారు. ఆయనతో పాటు వరంగల్ జిల్లాకు చెందిన పలువురు నేతలు పార్టీ కండువాలు కప్పుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గ టిడిపి మొత్తం ఎర్రబెల్లి వెంటే నడిచింది. తెలంగాణలో పలువురు ఎమ్మెల్యేలను మల్కాజ్‌గిరి ఎంపి మల్లారెడ్డిని టిఆర్ఎస్‌లో చేర్పించడంలో ఆయనది కీలకపాత్ర. అయితే త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అందులో ఎర్రబెల్లికి బెర్తు దక్కుతుందని ఆయనతో పాటు ఆయన అనుచరులు భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ ఉండదని కెసిఆర్ స్పష్టం చేయడంతో ఆయన ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. దీంతో ఎర్రబెల్లి కనీసం మీడియా సమావేశాలకు కూడ దూరంగా ఉంటూ వస్తున్నారు. అంతకు ముందే పార్టీలో చేరిన రాజ్యసభ ఎంపి గుండు సుధారాణి బాధ వర్ణనాతీతం. సిట్టింగ్ ఎంపి హోదాలో పార్టీ మారినప్పటికి ఆమెకు పార్టీలో ఏ విధమైన ప్రాధాన్యం లభించడం లేదు. గుండు సుధారాణి కోడలు అశ్రితారెడ్డిని కార్పోరేటర్ చేసుకోవడం మినహ మరే ప్రాధాన్యత ఆమెకు ఇప్పటివరకు లభించలేదు. ఎమ్మెల్సీ కానీ రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ పదవిని గుండు కుటుంబం ఆశిస్తోంది. కానీ టిఆర్ఎస్ అధిష్ఠానం నుండి మాత్రం ఆమెకు ఇప్పటి వరకు ఎలాంటి హామీ లభించలేదని సమాచారం. గ్రేటర్ వరంగల్ కార్పోరేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయిన తరువాత కాంగ్రెస్ పార్టీని వదిలి టిఆర్ఎస్ లో చేరిన మాజీ మంత్రి బస్వరాజ్ సారయ్య పరిస్థితి అయితే మరీ అధ్వానంగా ఉంది. ఎమ్మెల్సీ పదవి హామీతోనే తాను పార్టీ మారానని ఆయన పైకి చెబుతున్నప్పటికి కనీసం ఇపుడు పార్టీ ముఖ్యుల అపాయింట్‌మెంటు కూడ లభించడం లేదని సమాచారం. మరో కాంగ్రెస్ నేత రాజారపు ప్రతాప్ కూడ వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. వరంగల్ పార్లమెంటు ఉప ఎన్నికలలో ఆయన కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా పోటీపడ్డారు. ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, పాలమూరు వంటి జిల్లాలలో మరికొందరి ద్వితీయ శ్రేణి నేతల పాట్లు పడుతున్నారు. టిఆర్ఎస్‌లో మొదటి నుండి పనిచేస్తున్న పలువురు నేతల నుండి తీవ్రంగా పోటీ ఉండడంతో వారంతా తమకు పదవులు కావాలని గట్టిగా డిమాండ్ చేయలేని పరిస్థితులు ఉన్నాయి.

ఓరుగల్లులో జయశంకర్ జయంతి



- జయశంకర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన నేతలు
- ప్రొఫెసర్ ఆశయ సాధన కోసం కృషిచేస్తామన్న మంత్రి ఈటెల
- ఉద్యమకారుడిగా కోదండరామ్ ఆయన బాటలో నడవాలని విజప్తి
- బంగారు తెలంగాణ సాదనలో సర్కార్‌కు సహకరించాలన్న రాజేందర్
- హన్మకొండలోని ఏకశిలా పార్కుకు జయశంకర్ పార్కుగా నామకరణం
- హాజరైన దయాకర్, సీతారం నాయక్, మేయర్ నరేందర్, ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ ఆశీర్వాదంతో ఆచార్య జయశంకర్ సార్ ఆశయ సాధనకు కృషి చేస్తామని మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా హన్మకొండ బాలసముద్రం లోని స్మృతి వనంలో ఏర్పాటుచేసిన ఆచార్య జయశంకర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈటెల మాట్లాడుతూ జయశంకర్ కలలుకన్న తెలంగాణ నిర్మాణం కోసం సిఎం కెసిఆర్ అహర్నిషలు కష్టపడుతున్నారని అన్నారు. నీళ్లు, నిధులు, నియమాకాలు అన్న ట్యాగ్ లైన్‌తోనే ఉద్యమం మొదలైందని గుర్తు చేశారు. వీటిని సాదించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్దికి ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారితో ప్రొఫెసర్ కోదండరామ్ వంటి వారు జట్టు కట్టడం అన్యాయమన్నారు. ఆచార్యజయంకర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నామని చెబుతూ....సర్కార్‌పై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ రాజకీయ జెఎసి ఛైర్మన్‌గా ఆయనపై గౌరవం ఉందన్న ఈటెల విలువైన సూచనలిస్తే స్వీకరిస్తామని అన్నారు. నేతలంతా జయశంకర్ సార్ అమర్‌రహే అంటూ నినాదాలు అర్పించారు. వారి ఆశయసాధనకు, ఆకాంక్షల మేరకు పని చేసి బంగారు తెలంగాణ నిర్మాణంకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయాలను ఆధారాలతో సహా వివరించి ప్రజలను చైతన్య పరిచిన మహానుభావుడు ఆచార్య జయశంకర్ అని ఎమ్మెల్యే దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర ఆవశ్యకతను గుర్తించి చివరి వరకు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఉద్యమ బావజాల వ్యాప్తికి విశేష కృషి చేసారని ఎంపి దయాకర్ కొనయాడారు. ఉద్యమ జ్వాలలు నిరంతరం సజీవంగా ఉంచి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ నేత, రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వెనక ఉంటూ కడవరకు దిశానిర్దేశం చేశారన్నారు. వారి మాట దర్శకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని అన్న ఆయన వారి ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషి చేసి బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత చిరకాల వాంఛ తెలంగాణ రాష్ట్రం సాకారం కావడంలో క్రియాశీల పాత్ర పోషించిన వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ తెలంగాణ జాతి పిత ఆచార్య జయశంర్ సార్‌పేరు మీద ఏకశిల పార్కును ఆచార్య జయశంకర్ సార్ స్మృతి వనంగా రూ.43.65ల క్షలతో అభివృద్ది చేస్తున్నామన్నారు. రాబోయే తరాలకు ఆచార్య జయశంకర్ సార్ చరిత్ర తెలిసేల రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనల మేరకు స్మృతి వనం, ఆడిటోరియం, మ్యూజియం, గ్రంధాలయ నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తెలిపారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మ, ఎంపిలు దయాకర్, సీతారం నాయక్, ఎమ్మెల్యేలు కొండా సురేఖ, చల్లా ధర్మారెడ్డి, మేయర్ నన్నపునేని నరేందర్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 8 కోట్లతో నిర్మించిన 3 కోర్టుల బిల్డింగ్ కాంప్లెక్స్‌కు ప్రారంభోత్సవం





సూర్యాపేటలీగల్, మేజర్‌న్యూస్: జ్ఞానమే అత్యున్నతమైనదని, అంతరాత్మప్రభోదంతో దర్మంవైపు దానిని ఉపయోగించాలని హైకోర్టు న్యాయమూర్తి డా.బి. శివశంకర్ రావు సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఫోర్టుపోలియో న్యాయమూర్తిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఆదివారం సూర్యాపేటలో రూ. 8 కోట్లతో నిర్మించిన మూడు కోర్టుల బిల్డింగ్ కాంప్లెక్స్‌ను వేదమంత్రోచ్చారణ మధ్య ఆయన ప్రారంభించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంలగా ఉమ్మడి జిల్లా ప్రిన్స్‌పల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి డి. తిరుమలరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ప్రతిష్టను ఇనుమడింపచేయాల్సిన బాధ్యత న్యాయమూర్తిలు, న్యాయవాదులపై వుందని హైకోర్టు న్యాయమూర్తి డా. బి. శివశంకర్‌రావు పేర్కొన్నారు. అభియోగాల నమోదులో పారదర్శకంగా నిష్పక్షపాతంగా వ్యవమరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను కోరారు. క్లయింట్‌కు లబ్దిచేకూర్చేందుకు మాత్రమే కేసులను వాదించరాదని న్యాయవాదులకు సూచించారు. కక్షలు, కార్పాన్యాయాలు పక్కన పెట్టి చిన్న చిన్న వివాధాలను రాజీ మార్గంలో స్థానికంగానే పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంలో జరిగే త్పుల వలన రెండు వైపులవున్న కుటుంబాలకు నష్టం జరుగుతుందని వివరించారు. ప్రాచీన న్యాయసుత్రాలను అవగాహన చేసుకోవాలని, చిన్న చిన్న ంశాలను వివాదస్పదం చేసుకుని కేసులవైపు వెళ్ళినేట్లైతే కలిగే ప్రయోజనాల గురించి ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపారు. సామాజిక ధృక్పధంతో శాంతియుతంగా జీవించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఉమ్మి హైకోర్టు న్యాయమూర్తులు ఏ. రాజశేఖర్‌రెడ్డి, డా. షమీంఅక్తర్, జి. శ్యాంప్రసాద్, రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జి. జగదీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్, సూర్యాపేట రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్‌కె. రజాక్, ఉల్ జూమా, ఎస్పీ పరిమళ నూతన్ , మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రవళికప్రకాశ్, బార్‌సోసియేషన్ అధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు, ఆర్‌డివో యస్. మోహన్‌రావు, ఉమ్మడి జిల్లా న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్య వికాసానికి జాగృతి చేస్తున్న కృషి అభినందనీయం: రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్



భానుపూరి, మేజర్‌న్యూస్: తెలంగాణ జాగృతి ఆద్వర్యంలో తెలంగాణ సాహిత్య వికాసానికి జాగృతి చేస్తున్న కృషి అబినంద నియమని రాష్ట్ర గ్రందాలయ చైర్మన్ ఆయాచిత్రం శ్రీధర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్దానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన సాహిత్య వికాసానికి ఆయన ముఖ్యతిదిగా హజరై మాట్లడుతూ రాష్ట్రంలో తొలి సారిగ 31జిల్లలో 31చోట్ల దాదాపు 1800 కవులలో గ్రామీణ ప్రాంతంలోని కవులను వెలికి తీస్తు వారికి గుర్తింపు తెస్తున్నందుకు అబినందని యం అన్నారు. 40మంది కవులు పాల్గోన్న వారికి సన్మానం మోమెంటొతో సతంకరించారు. జిల్లా కన్వినర్ రంగినేని ఉపేందర్‌రావు అద్యక్షతన నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నవీనాచారి, రాష్ట్ర సాహిత్య విభాగ కన్వీనర్ కె. శ్రీనివాస్, పెదిరెడ్డి గణేష్ , డా. ఆర్.రాంబబు, పగడాల నాగేంద్ర బాబు, జిల్లా యువజన కన్వీనర్ బత్తుల రంజిత్‌గౌడ్, అసెంబ్లి కన్వీనర్ డి.శ్యాం నాయక్, నాగునాయక్,యస్‌కె. మస్తాన్, శ్రీనివాస్ దితరులు పాల్గోన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: జిల్లా కలెక్టర్

- జనహిత దరఖాస్తు దారునికి ట్రై సైకిల్ అందజేసిన కలెక్టర్
- జయశంకర్ సార్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



సూర్యాపేటప్రతినిధి, మేజర్ న్యూస్: విద్యార్థిదశ నుండి తెలంగాణ సాధనకు కృషి చేసి, తెలంగాణ అభివృద్ధి చేందాలనే సంకల్పంతో దశాబ్దాలకు పై తెలంగాణ సాధనకు యువతలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ స్పూర్తి నింపాలని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ పేర్కొన్నారు. వారి ఆశాయాలను స్ఫూర్తిగా తీసుకుని పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణకు బాటలు వేసేందుకు అధికారులు ఆహర్నిశలు కష్టపడి పనిచేయాలని తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ నందు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్, డిఆర్‌వో పి. యాదిరెడ్డితో కలసి పాల్గొన్ని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తెలంగాణకు జరుగుతున్న అన్నాయాన్ని యువతకు వివరించేవారని, తెలంగాణ పోరాట సాధనలో అనేక ఉద్యామాల్లోని పాల్గొని, దిశనిర్దేశము చేసేవారిన అన్నారు. తెలంగాణ అభివృద్ధి చేందాలంటే నిరుపేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. ప్రజలలో ప్రభుత్వంపై నమ్మక కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అప్పుడే ప్రజలు అధికారులపట్ల గౌరవప్రదాయంగా ప్రజలు వుంటారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతలును అర్హులైన వారికి చేరవేసి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం జనహితను సందర్శించి జనహిత విదివిధానాలు, సమస్యల పరిష్కారం జరుగుతున్న తీరుతెన్నులను అధికారుల వివరించారు. జనహితలో ఇప్పటి వరకు దాదాపు 1050 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 50 శాతము పైగా ఫర్యాదులు పరిష్కరించామని, మిగతా దరఖాస్తులు పరిశీలనలో వున్నాయని అన్నారు. అంతకుముందు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఛాయ చిత్ర ప్రదర్శనను సందర్శించి, అధికారులకు వివరించారు. సలీంపాషాకు అను దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను కలెక్టర్ అందజేశారు. ఈకార్యక్రమంలో పరిశ్రమల శాఖ డియం బాబురావు, వివిధశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'జయశంకర్ లేకపోవడం బాధాకరం'



సిద్దిపేట,మేజర్‌న్యూస్: ప్రొఫెసర్ జయశంకర్ 83వ జయంతి వేడుకలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరువుకున్నారు. మంత్రులు, నేతలు మొదలుకుని సామాన్యులు వరకూ అందరూ జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ అని ఆయన సేవలను హరీశ్ కొనియాడారు. సాధించుకున్న తెలంగాణలో జయశంకర్ లేకపోవడం బాధాకరం.. జయశంకర్ అడుగుజాడల్లో నడుస్తామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పాటును కళ్లారా చూడాలని ఉంది.. ఆ తర్వాత మరణించినా ఫర్వాలేదు.. అని అనేవారు ఆచార్య జయశంకర్. ఆశ తీరక ముందే 2011 జూన్ 21న ఆయన తుదిశ్వాస విడిచారు.

'సార్‌కు నివాళి'



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః హైద రాబాద్‌నగరంలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో తెలంగాణ ఉద్యమ కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు నిర్వహించారు, జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం తన జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన మహనీయుడు జయశంకర్ సార్ తెలంగాణ సాధన కేసీఆర్ వల్లే సాధ్యమని నమ్మి, చివరి శ్వాస వరకు కేసీఆర్ ను ముందుండి నడిపిన జయశంకర్ సార్ ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతారని జూపల్లి తెలిపారు.

చేనేత రంగాన్ని ఆదుకుందాం : సమంత



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణలో చేనేత పరిశ్రమ చాలా దీనావస్థలో ఉందని సినీనటి సమంత ఆవేదన వ్యక్తం చేసింది. చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు తన వంతుగా ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నానని.. ఆ విధంగా నేతన్నలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఓవెన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించిన సమంత... అక్కడే 30 మంది చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు తెలిపింది. భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు.

వృక్ష రక్షా బంధన్‌తో మొక్కలకు పూర్తిగా రక్షణ



సూర్యాపేట కల్చరల్, మేజర్‌న్యూస్: వృక్ష రక్షా బంధన్‌తో మొక్కలు నాటి సంరక్షించే బాద్యత తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రీన్ క్లబ్ గ్రీన్ కిడ్స్ ఆద్వర్యంలో వృక్ష రక్షా బంధన్‌లో పాల్గొని మొక్కలు రాఖీ కట్టారు. ఈకార్య క్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షులు ముప్పారపు నరేందర్, శివప్రసాద్, విద్యార్థిని విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిధులను వినియోగించుకోవడంలో టిఆర్ఎస్ విఫలం: సంకినేని



తుంగతుర్తి, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో పూర్తిగా తెలంగాణ ప్రభుత్వం విఫలమైదని భారతీయ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం జరిగిన తుంగతూర్తి మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు చేరవేయుటలో పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేద ప్రజలను దృష్టి ఉంచుకొని పంట నష్టపోయిన రైతులు దీమాగా ఉండే విధంగా పసల్ భీమా పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. జనధన్ పథకం క్రింద రూ. 12 చెల్లిస్తే 1 లక్ష వరకు భీమా వర్తించుందని అన్నారు. రానున్న ఎన్నికల దృష్టి పెట్టుకొని ప్రతి కార్యకర్త ఒక సైనికునిలా పనిచేసి 2019లో భారతీయ జనతా పార్టీ అదికారంలో వచ్చేలా కృషి చేయాలన్నారు. చదువుకున్న యువకులు మోడీ ప్రవేవ పెట్టిన సంక్షేమ పథకాలను రైతులకు ఎప్పకప్పుడు అర్దమైలా వివరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కొణతం సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీడి భిక్షం, తుంగతూర్తి నియోజకవర్గ అధ్యక్షులు మహేందర్, కన్వీనర్ కంచెర్ల నర్సింహ్మా, వెల్గుపల్లి యంపిటిసి సృజన, పెండెం యాదగిరి బాబాష్పర్దిన్, శ్రీనివాసులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వర్గాలను ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత జయశంకర్ సార్ : యస్సీ కార్పోరేషన్ చైర్మన్



భానుపూరి, మేజర్‌న్యూస్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ 83వ. జయంతి సందర్బంగా ఆదివారం జిల్లా కేంద్రలో స్దానిక ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ డా. పిడమర్తి రవి జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లడుతూ తెలంగాణ ఉద్యమ లక్ష్యం సాహకారం కావడానికి ఆయన చేసిన దోహదం అనూపమైనదని విబిన్న సామాజిక వర్గాలను ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత ఆయనదేనని కొనియడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆయన కల అశయ సాదన కోసం బంగారు తెలంగాణ కోసం అందరు పాటుబడి కెసీఆర్‌కు అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యంజేఎసి జిల్లా అద్యక్షులు కొండమీద గోవిందరావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బొజ్జ ఎడ్వడ్, బెజవాడ శ్రవణ్, జఫన్యా, బాబు, అర్జున్, పి. జయరాజ్, కమలాకర్, చందు, శ్రీను, మేడి రాజు, కె. మధు, కృష్ణ , పరమేష్, నరేష్ తదితరులు పాల్గోన్నారు.

స్విమ్స్‌ను సందర్శించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తిరుపతి : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్శిటి అనుబంధ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల, స్విమ్స్ హాస్పిటల్‌కు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమములో భాగంగా విశిష్ట గౌరవ అతిధిగా భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరవు వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, వైద్య విద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్‌లు సోమవారం ఉదయం 10.00గంటలకు స్విమ్స్‌కు విచ్చేయనున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ మరియు ఉపకుపలతి డాక్టర్ టి.ఎస్.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ యూనివర్శిటి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల విద్యార్థినుల నూతన వసతి భవనముల ప్రారంభోత్సవం, స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల 7 భవన నిర్మాణ ప్రాజెక్టుకు శంఖుస్థాపన, స్విమ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్ తదితర ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమమునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ అండ్ బి.సి.వెల్ఫేర్ మరియు చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఇండస్ట్రియల్ శాఖ మంత్రివర్యులు ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి , రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజి, పంచాయతీ రాజ్ శాఖ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి వర్యులు నారా లోకేష్‌తోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఉన్నతాధికారులు విచ్చేయనున్నట్లు చెప్పారు.



కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు 'వైసీపీ' సిద్ధం

- రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న చంద్రబాబు
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

కాకినాడ, సూర్య ప్రతినిధి : కాకినాడలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా వుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రివర్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. సరోవర్ పోర్టు-కో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ధర్మాన మాట్లాడుతూ కాకినాడలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలకు 50 డివిజన్లకు గాను 48 డివిజన్లకు మా పార్టీ పోటీకి సిద్ధంగా వుందని ఆయన తెలిపారు. అలాగే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తుందని, దీని కారణంగా ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతున్నప్పటికీ ఇందుకు విరుద్ధంగా ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదో తెలపాలని కోర్టు జోక్యం చేసుకుంటేనే తప్ప ఎన్నికలు నిర్వహించడం ఏంటనిఇ ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న ఈ రాజ్యాంగ విరుద్ధ పనులను ప్రజలు గుర్తిస్తున్నారని, గడిచిన మూడు సంవత్సరాల్లో వేల, లక్షల కోట్ల అవినీతి జరిగిందని, ఢిల్లీ లీడర్ దగ్గర నుండి సిఎం చంద్రబాబు నాయుడు వరకూ భారీస్థాయిలో అవినీతికి పాల్పడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దీనిలో భాగంగానే రాజధాని అమరావతి పేరుతో రైతుల వద్ద నుండి వేల ఎకరాలు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు అమ్మి అవినీతికి పాల్పడుతున్నారని, దేశంలో అవినీతిలో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో



ఉందన్నారు. దీనిపై మూడు సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, దీనిపై అక్రమ కేసులు బనాయించి వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం పాల్పడుతున్న అవినీతిని ప్రజలు గుర్తిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఆయన అన్నారు. ఇటు చట్టానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, దీనిని ప్రజలు గ్రహించి, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీకే పట్టంకట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జగన్ మాటల్లో తప్పేముంది...

– మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ :చంద్రబాబు నాయుడిపై చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు బొత్స సత్యనారాయణ టిడిపి శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతి బట్టబయలు చేస్తున్నందుకు, రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ, ప్రజలను మోసం చేస్తూ, కాపులను బిసిల్లో చేరుస్తామని చెప్పి మోసం చేసిన చంద్రబాబు నాయుడిని చంపేయాలి అన్న మాటలో తప్పేముందని ఆయన అన్నారు. మొన్న నంద్యాలలో జరిగిన వైఎస్సార్ సీపీ మహాసభకు లక్షలాదిగా కార్యకర్తలు తరలిరావడంతో భయపడి వైసీపీపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ముద్రగడ శాంతియుతంగా పాదయాత్ర చేసుకుంటానంటే ఎందుకు అనుమతి ఇవ్వలేదో తెలపాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో కాపులను బిసిల్లోకి చేరుస్తానని చెప్పి, కాపుల ఓట్లతో గెలిచి, వారిని చంద్రబాబు మోసం చేశారన్నారు. దీనిపై ముద్రగడ పాదయాత్ర చేయడంలో తప్పేముందని, ఆ పాదయాత్రను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. గోదావరి పుష్కరాల్లో 27 మంది ప్రాణాలు బలిగొన్నది చంద్రబాబు నాయుడని, ఇందుకు సంబంధించి విచారణ ఏమైందని ఆయన ప్రశ్నించారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, కాకినాడ సిటీ కోఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చలమలశెట్టి సునీల్, ముత్తా శశిధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల జీవన విధానంలో మార్పు కోసమే ప్రభుత్వ పథకాల అమలు

సిఎస్ దినేష్‌కుమార్



- జిల్లాలో పథకాల అమలు భేష్ , కలెక్టర్ ప్రద్యుమ్నకు సిఎస్ కితాబు
- బెల్టు షాపులు, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపండి
- రాష్ట్రస్థాయి స్వాతంత్ర్యదిన వేడుకలు తిరుపతిలో జరపడం చిత్తూరు జిల్లా అదృష్టం
- ఏర్పాట్లు పకడ్బందీగా చేయండి
- ఫారం పాండ్లకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను, ఆయిల్ ఇంజన్లను మంజూరు చేయండి : సిఎస్‌కు కలెక్టర్ విజ్ఞప్తి

తిరుపతి : గ్రామీణ నిరుపేద ప్రజల జీవన విధానంలో మార్పు కోసం ప్రభుత్వ పథకాలు అమలు చేసినపడే ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసాకు అర్థం ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో చిత్తూరు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న, జెసి గిరిషా, జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల లక్ష్యసాధనకై జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో కలెక్టర్ ప్రద్యుమ్న నేతృత్వంలో ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను భేషుగ్గా అమలు చేస్తున్నారని, అయితే పథకాల లబ్ధి ద్వారా నిరుపేద ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చేలా, పథకం ఫలితాలు వందశాతం ప్రజలకు ఉపయోగపడేలా అమలు చేయడానికి మరింత మెరుగైన చర్యలను ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఈ సంవత్సరం 2 కోట్ల వేతన పనిదినాలను లక్ష్యంఅ నిర్దేశించుకొని వివిధ శాఖల కన్వర్జన్స్‌తో పంటకుంటలు, నీరుప్రగతి పనులు, చెక్ డ్యామ్‌లు, సిసి రోడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, వర్మికంపోస్టు యూనిట్లు, అంగన్‌వాడి, పంచాయతి భవనాల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం లాంటి ప్రజోపయోగకరమైన పనులను ప్రజల భాగస్వామ్యంతో వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యతతో చేపట్టామని కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు.

జిల్లాలో ఈ ఏడాదిలో 2 కోట్ల ఉపాధి హామీ వేతన పని దినాల లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం అభినందనీయమని, అయితే మొదటి మూడు నెలల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య రాష్ట్ర సరాసరి కంటే తక్కువగా ఉందని, అందువల్ల ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూచించగా, రానున్న మూడు రోజుల్లో జిల్లాల్లో ఉపాధి హామీ మేళా పేరుతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డ్వామా పిడి కూర్మనాథ్ వివరించారు. అలాగే రోజువారీ సగటు ఉపాధి కూలీ వేతనం రూ.170 వరకు ఉండేలా, ఉపాధి హామీ కూలీ డబ్బులను వేగవంతంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరేగా ద్వారా హార్టికల్చర్, డ్వామా, డిఆర్‌డిఎ శాఖలు ద్వారా అదనంగా 40 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని, లక్ష ఫారంపాండ్ల నిర్మాణాన్ని, వెయ్యి కిలోమీటర్ల సిసి రోడ్లను చేపట్టామని కలెక్టర్ వివరించారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, ఫారంపాండ్ల నిర్మాణం వంటివి గ్రామాల్లో రైతులతో ప్రభుత్వాధికారులు మమేకమై వారికి కావలసిన విధంగా రూపొందించుకొని అమలు చేయాలని సిఎస్ సూచించారు. ఉదాహరణకు ఫారం పాండ్లు నిర్మించుకున్న విజయగాథల రైతులు వద్దకు అవగాహన కల్పించడానికి కొంత మంది రైతులను తీసుకెళ్లి వాటి ఉపయోగాలను గుర్తించే విధంగా చేయగలిగితే అవగాహన కలిగి మిగిలిన రైతులు ముందుకొచ్చి ఇంకా పెద్ద సంఖ్యలో చేసుకునే అవకాశం ఉంటుందని సిఎస్ అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సిసి రోడ్లు, మరుగుదొడ్లు, వర్మి కంపోస్టు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల లాంటి పథకాల వల్ల గ్రామీణ ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితం అందుతుందనే విషయం గ్రామీణ జలు గ్రహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైన్‌లను నిర్మించిన అనంతరం సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సిఎస్ సూచించారు. గ్రామాలను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, ఇందు కోసం చెత్త ఏరుకునే వారి నుంచి వేస్ట్ ప్లాస్టిక్‌ను కిలో రూ.20 నుంచి రూ.25 వరకు గ్రామ పంచాయతీల ద్వారా కొనుగోలు చేసి దానిని రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు అమ్మేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిఎస్ దినేష్‌కుమార్ సూచించారు. జిల్లాలో చేతి పంపులు ఉన్న చోట రీచార్జ్ పిట్స్‌ను పెద్ద సంఖ్యలో తవ్వించి వర్షపు నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడిని ఆదేశించారు. అలాగే ఎన్‌టిఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం రాష్ట్ర ప్రభుత్వానికి చాలా ప్రాధాన్యమైన పథకం అని, ఈ పథకం అమలులో వేగాన్ని పెంచి క్యాంపైన్ మోడ్గతో పనిచేయాలని హౌసింగ్ పిడి ధనంజయ్‌ను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 100 గంటల్లో 10 వేల మరుగుదొడ్లు నిర్మించిన జిల్లాలున్నాయని, అదే స్ఫూర్తితో ప్రజల్లో అవగాహన కల్పించి వారితో మమేకమై అన్ని పంచాయతిలను ఓడిఎఫ్ పంచాయతీలుగా మార్చాలని, దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత ఏర్పడి అంటు వ్యాధులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన గ్రామీణ జీవితం ప్రజలకు ఉంటుందన్నారు. భూగర్భజలాల పెంపుకు కొండవాలు ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖలు కీలకమైనవని, పనులలో జాప్యం చేస్తే సహించేది లేదని సిఎస్ హెచ్చరించారు. అదే విధంగా స్మశానాలు, అంగన్‌వాడి భవనాలు, గ్రామ పంచాయతి భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాన్నారు.రాష్ట్రంలో బెల్టుషాపులు ఉండకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఉచిత ఇసుకను ప్రజలందరికి తక్కువ రవాణా ఖర్చుకే అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందువల్ల జిల్లాలో బెల్టుషాపులు, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో 73 బెల్టు షాపులపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ డిసి ప్రసాదరావు సిఎస్‌కు వివరించగా కాల్ సెంటర్ ద్వారా 66 కేసులను కూడా సత్వరమే విచారించి కేసులు బుక్ చేయాలని సిఎస్ ఆదేశించారు. ఈసారి రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలో నిర్వహించడం చిత్తూరు జిల్లా యంత్రాంగం అదృష్టమని, అందువల్ల అధికారులందరూ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో బాగా పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లను చేసి విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. సమావేశం అనంతరం పద్మావతి అతిథి గృహం వద్ద తనను కలిసిన విలేకరులతో సిఎస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను బాగా అమలు చేస్తున్నారని, అయితే ఇంకా మెరుగుపరుచుకోవాల్సి ఉందని సమీక్షా సమావేశంలో తెలిపినట్లు సిఎస్ వివరించారు. అలాగే జిల్లాలో కరువు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తిరుపతి సైన్స్ సిటి డిపిఆర్‌ను సమర్పించడానికి ఈ సెప్టెంబరు ఆఖరు వరకు గడువు ఇచ్చినట్లు సిఎస్ వివరించారు. జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్నతో పాటు జెసి గిరిషా, మున్సిపల్ కమిషనర్ హరికిరణ్, జెసి2 చంద్రమౌళి, సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు పోలవరం రాక



ఏలూరు, బ్యూరో మేజర్‌న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు పోలవరం ప్రాజెక్టు పర్యటనకు రానున్నారని జిల్లా అధికార వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా తూర్పుగోదావరిజిల్లా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం వద్ద జరుగుచున్న పనులను పరిశీలించి అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలవరం ప్రాజెక్టు వద్దకు ముఖ్య మంత్రి చేరుకొని అక్కడ జరుగుచున్న ప్రాజెక్టు పనులను పరిశీలించి అనంత రం ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. నేడు అనగా సోమవారం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించే మీకోసం మరియు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాలను రద్దుచేసినట్లు డిఆర్‌ఒ కట్టా హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి కామినేని




తిరుపతి : తిరుపతి నందు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసులు పాల్గొనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6.55 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 8.05 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి స్విమ్స్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. భూమి పూజ కొరకు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. బాలికల వసతి గృహం కొరకు రెండో విడత రూ.18 కోట్ల నిధులతో నిర్మాణం పనులకు భూమిపూజ కార్యక్రమం, నర్స్ వసతి గృహాల కొరకు రూ.7 కోట్ల నిధులతో భూమిపూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల వసతి సౌకర్యం కోసం రూ.10 కోట్ల నిధులతో భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రొఫెసర్లు నివాసం కొరకు 11.95 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం, టీచింగ్ స్టాఫ్‌లో అధ్యాపకుల కొరకు రూ.9.60 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు భూమిపూజ, నాన్‌టీచింగ్ ఉద్యోగస్తులకు వసతి సౌకర్యం కొరకు రూ.9.66 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు భూమిపూజ, టిబి వార్డు కొరకు రూ.8.42 కోట్ల వ్యయంతో భూమిపూజ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు రుయా ఆసుపత్రిలోని డాక్టర్ కృష్ణమూర్తి సమావేశమందిరంలో కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు ట్యాబ్ పంపిణి కార్యక్రఎమంలో పాల్గొంటారన్నారు

'సోమిరెడ్డి లాలీకి ఎక్కువ.. తుటాకు తక్కువ'



నెల్లూరు, మేజర్‌న్యూస్:టీడీపీలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆకులో అరటిపండు లాంటివారని వైసీపీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమిరెడ్డి లాలీకి ఎక్కువ తుటాకు తక్కువ అని కాకాని అన్నారు. చంద్రబాబుది హత్యలు చేయించిన చరిత్ర అని ఆయన అన్నారు. రంగాతో పాటు ఒక జర్నలిస్ట్‌ను హత్య చేయించిన చరిత్ర చంద్రబాబుదని ఆయన ఆరోపించారు. రాజీనామా చేసిన తరువాత వైసీపీలో చేరాలని శిల్పా చక్రపాణి రెడ్డికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పరన్నారు. చక్రపాణి రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో వైసీపీలోకి చేరిన విషయం తెలిసిందే. చంద్రబాబు మాత్రం కోట్ల రూపాయలు ఇచ్చి ఎమ్మెల్యేలను కొన్నరని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, టీడీపీ నేతలకు మతిభ్రమించిందని అన్నారు. సోమిరెడ్డి లాంటి వారికి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదని కాకాని అన్నారు. నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా జిల్లాలో రాజకీయ వాతావరణ వెడెక్కింది

'సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి'



ఎన్నికలు వస్తేనే సీఎం చంద్రబాబుకు నంద్యాల గుర్తుకొచ్చిందని వైసీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. తప్పుడు హామీలతో మరోసారి ప్రజలను మభ్యపెట్టాలని సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలు చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. నంద్యాలలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 13వేల ఇళ్లు కట్టిస్తామని సీఎం చంద్రబాబు చెప్తే 11వందల దరఖాస్తులు కూడా రాలేదని, అందుకు కారణం కమీషన్లు వసూలు చేయడమేనని దుయ్యబట్టారు. కమీషన్ల కోసమే ఇళ్ల నిర్మాణానికి చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. ఓటమి భయంతోనే నంద్యాలలో కుట్టుమిషన్ల పంపిణీకి టీడీపీ నేతలు కుట్ర పన్నారని బుగ్గన ఆరోపించారు. చంద్రబాబు అవినీతిని చూసి మెట్రో శ్రీధరన్ కూడా పారిపోయారని అన్నారు. ఐఏఎస్ అధికారులు డిప్యూటేషన్ మీద ఢిల్లీకి వెళుతున్నారని గుర్తుచేశారు. ధర్మానికి- అధర్మానికి, విశ్వసనీయతకు-వంచనకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవని, ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని అన్నారు. నంద్యాల ఎన్నిక ద్వారా చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు

ఘనంగా వూర ముత్యాలమ్మ బోనాల పండగ

సూర్యాపేట,మేజర్‌న్యూస్: శ్రావణ మాసంలో ప్రారంభమైయే బోనాల పండుగ సూర్యాపేట పట్టణంలోని వూర ముత్యాలమ్మ సూర్యాపేటపట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమ ఇష్టాఆరాధ్యదైవం కు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి వ ర్యులు జి. జగదీష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమృద్ధి వర్షాలు కురిసి కాలం అవ్వాలని, రైతుల కష్టలు తీరాలని, రాష్ట్ర ప్రజలందరు సుఖసంతోషాలతో ఆంక్షాకించారు. కాంగ్రెస్‌పార్టీ చెందిన మాజీమంత్రి రాంరెడ్డి దామోదరెడ్డి, టిడిపి పార్టీ జిల్లా అధ్యక్షులు పటేల్ రమేష్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినే ని వెంకటేశ్వరరావులు తమ కార్యకర్తలతో దేవాలయం విచ్చేసి తమ మొక్కలను తీర్చుకొని మాట్లాడారు. తాళ్ళగడ్డ ఏరియా నుండి శనగాని రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో 27, 28, వార్డుల ప్రజలతో పెద్ద ఎత్తున దాదాపు డప్పుచప్పుల నడమ టిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, యువకులు ప్రజలు , మహిళలు



కోలహలం మధ్య దేవాలయం ప్రాంగణం చేరుకొని అమ్మ వారికి చీర , బోనాలు సమర్పించారు. పట్టణ వీధులన్నీ వూర ముత్యాలమ్మ దేవాలయం వైపు అన్న చందంగా ఉదయం తెల్లవారు జామునుండి రాత్రి 8 గంటల వరకు ఎటు చూసిన పండగ వాతావరణంలో ప్రజలు పాల్గొని తమ మొక్కలను తీర్చుకున్నారు.

అపూర్వ మద్దతు

- రెండవ రోజు భారీగా తరలి వచ్చిన ప్రజలు
- దీక్ష ప్రాంగణాన్ని అధీనంలోకి తీసుకున్న పోలీసులు
- కొనసాగుతున్న ఉత్కంఠ
- దీక్ష భగ్నం చేసే అవకాశం
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్ నేతలు
- నిమ్స్ వైద్యులచే నిరంతర వైద్య పరీక్షలు
- నా ప్రాణం జిల్లా ప్రజలకే అంకితం : పొన్నం

మేజర్‌న్యూస్- కరీంనగర్:జిల్లా ప్రజల ఆకాంక్ష అయినా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకోసం మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ రెండవరోజు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు అపూర్వ మద్దతు లభిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు, నేతలు, విద్యావంతులు, మేధావులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సంఘీభావాన్ని తె లిపారు. రెండవరోజు నిమ్స్ వైద్య నిపుణుల బృందంచే ఎప్పటికప్పుడు పొన్నంకు ఆరోగ్య పరీక్షలు చేస్తూ పలు సూచనలు ఇస్తున్నారు. శరీరంలో గ్లూకోజ్ శాతం తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు. గంటగంటకు తన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం పోలీసులను అధిక సంఖ్యలో మోహరించి దీక్ష శిబిరం ప్రాంగణాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏ క్షణంలోనైనా దీక్షను భగ్నం చేసి పొన్నం ప్రభాకర్‌ను అరెస్టు చేసే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి. అరెస్టు చేసే పరిస్థితి వస్తే కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అడ్డుకుని దీక్షను యథావిధిగా కొనసాగించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. పోలీసులు ఏలాగైనా అరెస్టు చేసి పొన్నం ఆరోగ్య పరిస్థితులరీత్యా ఆసుపత్రికి తరలించే అవకాశాలు కూడ లేకపోలేదు. టిఆర్ఎస్ ప్రభుత్వ మార్గదర్శనంలోనే పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోననే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది.

ప్రజా ఆకాంక్షలపై ప్రభుత్వం ఉక్కుపాదం

కాంగ్రెస్ నేతలు సురేష్ షెట్కార్, జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మృత్యుంజయం సాధించుకున్న తెలంగాణలో ప్రజలు తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడంలో భాగంగా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు నిర్వహిస్తే పోలీసులచే ప్రభుత్వం



ఉక్కుపాదం మోపుతుందని అన్నారు. సామాజిక తెలంగాణ, బంగారు తెలంగాణ ఏ విధంగా సాధ్యమవుతుందని, నిరంకుశ పాలన చేస్తూ అభివృద్ధి నిరోధకుడిగా కెసిఆర్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసుల చర్యలపై వారు మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాల కరీంనగర్ జిల్లాలో అత్యావశ్యక మన్నారు. ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే ఎన్‌వోసి జారీ చేయాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాలతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అప్పటి వరకు తెలంగాణ ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. దీక్ష భగ్నానికి పోలీసులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని, సిసి కెమెరాలు అమర్చి పుటేజీలను ఎవరికి చూపిస్తారని ప్రశ్నించారు. దీక్షకు అపూర్వ మద్దతు లభిస్తుందని, టిఆర్ ఎస్ పార్టీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు దీక్ష శిబిరానికి చేరుకొని తమ సంపూర్ణ సంఘీభావం తెలుపుతూ మద్దతు ఇస్తున్నారని వెల్లడించారు. కెసిఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. అవినీతి, అధికార దాహమే లక్ష్యంగా కెసిఆర్ పాలన కొనసాగిస్తున్నాడని, సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని, అప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఏలాంటి ఆందోళనలు, ధర్నాలకు దిగవద్దని కోరారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటుకు అర్హతలు ఉన్నాయని సూచిస్తుందనే నమ్మకం ఉందన్నారు. టిఆర్ఎస్ పాలనలో దళితులపై దాడులు, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం, అహంకార పూరితంగా వ్యవహరిస్తూ దొరల పాలన కొనసాగించడం సరికాదన్నారు. అంతకముందు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నా జీవితం జిల్లా ప్రజలకే అంకితమని, వారి ఆకాంక్ష నెరవేర్చడానికి ప్రాణాన్ని సైతం లెక్క చేయనని, ప్రభుత్వం మెడలు వంచైనా ప్రభుత్వ వైద్య కళాశాలను సాధిస్తానన్నారు. పొన్నం దీక్షకు జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, టిపిసిసి ఎస్‌సిసెల్ అధ్యక్షుడు ఆరెపెల్లి మోహన్, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యేలు బొమ్మ వెంకన్న, కోడూరి సత్యానారాయణగౌడ్, కాంగ్రెస్ నాయకులు కెకె. మహేందర్‌రెడ్డి, పటోళ్ల కార్తిక్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, బిజెపి నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగోజు రామకృష్ణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, లోక్‌సత్తా అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాస సత్యనారాయణ, రఘునందన్‌రావు, ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, ఆర్టీసి సంఘం నాయకులు, గౌడ సంఘం నాయకులు, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. దీక్షకు హాజరైనవారందరికి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

రోజా నీ క్యారెక్టర్ ఏమిటి ?

టీడీపీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు




విజయవాడ, మేజర్‌న్యూస్:వైసీపీ ఎమ్మెల్యే రోజాపై టీడీపీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జబర్దస్త్ లాంటి కార్యక్రమాలకు జడ్జిగా లంటూ, మహిళలు సిగ్గుపడేలా కామెంట్లు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రోజా, నీ క్యారెక్టర్ ఏంటి నీవా ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించేది అని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని అలా కాకుండా చంద్రబాబుపై, లోకేష్ పై అవాకులు, చెవాకులు పేలుతూ ఉంటే జనాల్లో తిరగలేవు అని హెచ్చరించారు. టీడీపీ మహిళల దెబ్బకు నీకు దిమ్మ తిరిగిపోతుంది అని అన్నారు.


నెల్లూరు చేపల పులుసు ఎంతో ఇష్టం జబర్దస్త్ బృందం

నెల్లూరు,సూర్యప్రతినిధి: ఈటీవీ జబర్ధస్త్‌బృందం నెల్లూరులో సందడి చేశారు. నగరంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బృందం సభ్యులైన హైపర్ ఆది, రైజింగ్ రాజు, గణపతి, దొరబాబు, శాంతి స్వరూప్‌లు నగరంలోని రాయలసీమ హోటల్‌లో భోజనం చేసేందుకు వచ్చారు. అనంతరం హైపర్ ఆది, రైజింగ్ రాజు మాట్లాడుతూ నెల్లూరు చేపల పులుసు ఎంతో బాగుందన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడికి వచ్చినా నెల్లూరు వచ్చే భోజనం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం జబర్దస్త్‌షోకు ఎంతో ప్రజాదరణ ఉందన్నారు.

సర్వరోగాలకు మూలం మలబద్ధకం!

మలబద్ధకం... వైద్య పరిభాషలో కాన్ స్టిపేషన్ గా పేర్కొనే ఈ సమస్య ఎన్నో అనారోగ్యాలకు కారణమవుతుంది. తినే ఆహారం, జీవన విధానం సరిగా లేకపోవడం, కొన్ని రకాల మందులు ఇలా ఎన్నో కారణాలు కాన్ స్టిపేషన్ కు దారితీస్తాయి. దీన్ని అదుపు చేసి నియంత్రణలో పెట్టుకోవడంలో విఫలమైతే జీవితాంతం వేదన తప్పదంటున్నారు వైద్యులు. కాన్ స్టిపేషన్ ఆరోగ్యానికి ప్రమాదకరం. కొలరెక్టల్ (పెద్దపేగు, పురీష నాళం) సమస్యలకు దారి తీస్తుంది. పైల్స్ తో మొదలై కొలరెక్టల్ కేన్సర్ గా మారి ప్రాణాంతకం అవుతుంది. పెద్ద పేగు నిర్ణీత బరువు మేర వ్యర్థ పదార్థాలను మోసే శక్తిని కలిగి ఉంటుంది.





మలబద్ధకం బారిన పడిన వారిలో మల విసర్జన సాఫీగా జరగకపోవడంతో ఎక్కువ మలం పెద్ద పేగులో ఉండిపోతుంది. స్టూల్ సైజు కూడా పెద్దగా ఉండడం వల్ల పెద్ద పేగు సాగుతుంది. దీంతో మలాశయం పొర ఇరిటేట్ అవుతుంది. ఫలితంగా మలవిసర్జన ద్వారానికి ముప్పు ఏర్పడుతుంది. పేగులో ఉండే సహజ బ్యాక్టీరియా చనిపోవడం వల్ల కూడా కాన్ స్టిపేషన్ సమస్య రావచ్చు. నిజానికి ఈ సహజ బ్యాక్టీరియా చాలా కీలక చర్యలకు తన సహకారం అందిస్తుంటుంది. ముఖ్యంగా పెద్దపేగు వావునకు గురికాకుండా కాపాడుతుంటుంది. వ్యాధి నిరోధక వ్యవస్థను అదుపులో ఉంచుతుంది. మలాన్ని తేమతో, మెత్తగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ చర్యలన్నీ మలబద్ధకం కారణంగా నిలిచిపోతాయి. ఫలితంగా అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి.

స్త్రీలలో ఈ సమస్య తీవ్రం..


మలబద్ధకం స్త్రీలలో మూత్రాశయ, జననేంద్రియ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఎందుకంటే పెద్ద పేగు, పునరుత్పాదక అవయవం పక్కపక్కనే ఉంటాయి. మలబద్ధకం వల్ల గర్భాశయంపై ఒత్తిడి పెరిగిపోతుంది. మానసిక చిరాకు, ఒత్తిడికి దారి తీస్తుంది. మలబద్ధకం ఎక్కువకాలం పాటు కొనసాగితే గుండె రక్తనాళములు, ఎండోక్రైన్, రోగ నిరోధక వ్యవస్థలపై ప్రభావం పడుతుంది. అందుకే మలబద్ధకం విషయంలో నిర్లక్ష్యం ఏ మాత్రం పనికిరాదు. ఈ సమస్యను లేకుండా చూసుకోవడం సాధ్యమే. ఇందుకు ఎన్నోరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాల కాన్ స్టిపేషన్ సమస్య జీవన విధానానికి సంబంధించినది. తలనొప్పికి పెయిన్ రిలీవర్ టాబ్లెట్ వేసుకున్నట్లో, కడుపులో మంటకు యాంటాసిడ్ వేసుకున్నట్టు మలబద్ధకం ఓ టాబ్లెట్ తో తగ్గిపోయేది కాదు. ఈ సమస్య నుంచి బయట పడడానికి ఆహార పరంగా, జీవన విధానం పరంగా మార్పులు అవసరం. రోజువారీ బవెల్ మూవ్‌మెంట్‌కు విఘాతం కలిగితే సైకలాజికల్ కాన్‌స్టిపేషన్‌కు దారి తీస్తుంది. పెరిగిపోయిన ఒత్తిడి, దూర ప్రయాణాలు, రాతడ్యూటీలు వంటి పనులతో మలబద్ధకం సమస్యకు దారి తీస్తాయి. అందుకే అసలు ఈ సమస్య వెనుకనున్న కారణాన్ని కనుక్కోవాలి.

గొంతు భాగం నుంచి మలవిసర్జన ద్వారం వరకూ ఒకటే ట్యూబ్ ఉంటుంది. ఇదే జీర్ణకోశము. తీసుకున్న ఆహారం ఈ ట్యూబులోంచి ప్రయాణం సాగిస్తుంది. ఇందులో జీర్ణకోశ రసాలు, బ్యాక్టీరియా ఉంటాయి. నోటి నుంచి ప్రారంభమైన జీర్ణప్రక్రియ జీర్ణ వ్యవస్థలో జీర్ణరసాలు, బ్యాక్టీరియా సాయంతో జీర్ణమై అందులోని శక్తి, పోషకాలను గ్రహించిన తర్వాత వ్యర్థభాగం పెద్ద పేగులోకి చేరుతుంది. దీని తర్వాత పురీష నాళం నుంచి మలవిసర్జన జరుగుతుంది. పేగులో బ్యాక్టీరియా ఎంత మేర ఉంది, ఏ విధమైన బ్యాక్టీరియా ఉందన్న అంశం మలబద్ధకాన్ని నిర్ణయిస్తుంది. ఈ బ్యాక్టీరియా తిన్న ఆహారాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. అలాగే కేలరీల వినియోగం, అలెర్జీ సమస్య పెరగడం, తరగడం, స్థూలకాయం ఇతర అంశాలు బ్యాక్టీరియాపై ఆధారపడి ఉంటాయి. పెద్ద పేగు మెదడు నుంచి వచ్చే ఒత్తిడి చర్యలకు స్పందిస్తుందని, అలాగే పేగు నుంచి వచ్చే సంకేతాలకు మెదడు సైతం స్పందించి బాధతో కూడిన స్పందనలు కలిగిస్తుందని పరిశోధనల్లో తేలింది. అంటే పేగు ఆరోగ్యమే శరీరంలోని ఇతర అవయవాల ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని తెలుస్తోంది.

మలబద్ధకం ఎందుకు వస్తుంది?

హైపో థైరాయిడిజం కూడా మలబద్ధకానికి కారణమవుతుంది. ఒత్తిడి తగ్గేందుకు వాడే యాంటీ డిప్రెసెంట్ మందులు, యాంటాసిడ్స్, బీపీ మందులు, ఐరన్ సప్లిమెంట్లు, ఇబుప్రోఫెన్, యాస్పిరిన్ మందుల వల్ల కూడా మలబద్ధకం సమస్య ఏర్పడవచ్చు. శరీరానికి తగినంత నీరు అందకపోయినా డీహైడ్రేషన్ పరిస్థితి వల్ల మలవిసర్జన సాఫీగా జరగదు. ట్యూమర్లు, ఇన్ ఫ్లమ్మేషన్, ఆనల్ ఫిషర్, పార్కిన్ సన్స్ వ్యాధి, వెన్నుపూసకు గాయాలు, మెదడుకు గాయాలు, స్ట్రోక్, మల్టిపుల్ స్కెలెరోసిస్, హార్మోన్ సమస్యలు, మధుమేహం వంటి సమస్యల్లోనూ ఇది ఎదురుకావచ్చు. గర్భిణుల్లోనూ ఈ సమస్య ఎదురు కావచ్చు. ఎందుకంటే లోపల ఎదుగుతున్న బేబీ బరువు పేగుపై పడడం వల్ల మూమెంట్ తగ్గుతుంది. వృద్ధుల్లో శరీరంలో చురుకుదనం తగ్గడం, జీర్ణక్రియల వేగం మందగించడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. వీటన్నింటి కంటే కూడా ప్రధానంగా మలబద్ధక సమస్య ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. పీచు (ఫైబర్) తక్కువగా ఉండే ఆహార పదార్థాలను తినడం వల్ల సమస్యకు దారితీస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్ ఇటువంటిదే. అమెరికాలో 15 శాతం ప్రజానీకం కాన్ స్టిపేషన్ తో బాధపడుతున్నారు.


శారీరక ఆరోగ్యంతో మలబద్ధకానికి లింకు ఉంది



దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్య ఉంటే మలాశయ కేన్సర్, పెద్ద పేగు కేన్సర్, గ్యాస్ట్రిక్ కేన్సర్ వంటి సమస్యలు ఏమైనా ఉన్నాయేమో చెక్ చేసుకోవాలి. ఫైబర్ సమృద్ధిగా ఉన్న ఆహారం, నీరు తగినంత తీసుకుంటూ శారీరక కదలికలు చురుగ్గా ఉండేవారు మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయరాదు. ఇతత్రతా అనా రోగ్యాలు ఏమైనా ఉన్నా యేమో వైద్యులను సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలి. ముఖ్యంగా ఆడవారిలో ఈ సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయడం ఏ మాత్రం మంచిది కాదు. పెద్ద పేగులో స్టూల్ ఎక్కువ మొత్తంలో ఉండిపోవడం వల్ల వెజైనాలోకి రెక్టల్ జారిపోతుంది. దీంతో మూత్రాశయంలోని మూత్రం అంతా బయటకు వెళ్లదు. ఇలా మిగిలిన మూత్రం వెనుకకు మూత్రపిండాల్లోకి వెళుతుంటుంది. దీనివల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా పెరిగిపోతుంది.

జీవన విధానంలో మార్పులు చేసుకుంటే....

దీర్ఘకాలంగా మలబద్ధకం సమస్యతో బాధపడేవారు తమ జీవన విధానంలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి రావచ్చు. మొట్టమొదటగా తగినంత నీరు తాగడం చాలా అవసరం. స్టూల్ పేగులోంచి సాఫీగా వెళ్లేందుకు తగినంత నీరు అవసరం. అందుకే నీరు తగినంత తాగాలి. విసర్జించే మలం డార్క్ ఎల్లో రంగులో ఉంటే శరీరంలో చాలినంత నీరు లేదని అర్థం చేసుకోవాలి. ఎండుగడ్డి రంగులో (లైట్ ఎల్లో రంగు)లో ఉంటే తగినంత నీరు తాగుతున్నారని అర్థం. ఇక మలం రంగు లేకుండా ఉంటే నీరు మరీ ఎక్కువగా తాగుతున్నారని అర్థం చేసుకోవాలి. తిన్న ఆహారం సరిగా జీర్ణమై,



వ్యర్థాలు సరిగ్గా విసర్జితం కావడానికి పీచు చాలా కీలకం. అందుకే తీసుకునే ఆహారంలో ఇది ఉండేలా చూసుకోవాలి. స్టూల్ లో ఉండే ఫైబర్ తగినంత నీరును గ్రహిస్తుంది. దాంతో అది మెత్తగా ఉండేలా చూస్తుంది. దీని వల్ల డెలివరీ సులభంగా జరిగిపోతుంది. ఒకవేళ పీచు తగినంత ఉన్న ఆహారాన్ని తీసుకుని నీరు తగినంత తీసుకోక పోయినా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. ప్రతీ రోజూ ఆహారంలో 20 నుంచి 30 గ్రాముల ఫైబర్ ఉండాలన్నది వైద్యుల సూచన. 32 నుంచి 35 గ్రాములు తీసుకున్నా మంచిదే. అలాగని మరీ అతిగా కూడా తీసుకోవడం సరైనది కాదు. సహజసిద్ధమైన సిలియం అనే పీచు పదార్థం పేగు ఆరోగ్యానికి ఎంతో అవసరం. రక్తంలో షుగర్ నియంత్రణకు కూడా ఈ సిలియం తోడ్పడుతుంది. హార్ట్ ఎటాక్, స్ట్రోక్, గాల్ స్టోన్స్, కిడ్నీ స్టోన్స్ ముప్పును తగ్గిస్తుంది. బరువు తగ్గడానికి, చర్మం ఆరోగ్యంగా ఉండేందుకు కూడా ఇది సాయం చేస్తుంది. కూరగాయలను తగినంత తీసుకుంటే వీటి ద్వారా పీచు పదార్థం సమృద్ధిగా అందుతుంది. ఒకవేళ ఆహారం ద్వారా నిర్ణీత మొత్తం పీచు ఆ రోజు లభించకుంటే ఆర్గానిక్ రూపంలో హోల్ హస్క్ సిలియంను తీసుకోవచ్చు. రోజువారీ శారీరక వ్యాయాంతో ఈ సమ స్యను నివారించుకోవచ్చు. శారీరక క్రియలు జీర్ణకోశాన్ని ప్రేరేపించ డం వల్ల బవెల్ మూవ్ మెంట్ మెరుగుపడుతుంది. మలం వస్తున్న ప్పుడు దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపుకోవద్దు. వెంటనే డిశ్చార్జ్ చేయ డం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలరని తెలుసుకోవాలి. ముఖ్యంగా జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. ఇంట్లోనే సహజసిద్ధమైన ఆహారం తీసుకోవాలి. అజీర్ణానికి, గ్యాస్ట్రిక్ సమస్యకు అరటిపండు మంచిగా పనిచేస్తుందని చెప్పడం వినే ఉంటారు. కానీ సరిగా పండని దాన్ని తింటే మలబద్ధకం ఏర్పడవచ్చు. అరటిపండులో ఉండే స్టార్చ్ జీర్ణం కావడం నిదానంగా జరుగుతుంది. ఇక సరిగా పండని ఆకుపచ్చని కాయలో స్టార్చ్ అధికంగా ఉండడం వల్ల ఇది మరింత నిదానం అవుతుంది. యాపిల్ ను పొట్టుతో సహా తింటే జీర్ణం కష్టమవుతుంది. ఇది మలవిసర్జనపై ప్రభావం చూపిస్తుంది. అందుకే యాపిల్ ను పొట్టు తీసి తినాలి. అదీ పరిమితంగానే ఒకటి బదులు రెండు మూడు కాయలు తినడం కూడా సమస్యే. యాపిల్ లో పీచు ఎక్కువగా ఉండదు. కేవలం మలం సాఫీగా విసర్జన కావడానికి తోడ్పడుతుంది. ఇదే కాదు, ఏ పండైనా పొట్టు తీసి తినడమే మంచిదని కొందరు నిపుణులు సూచిస్తున్నారు. బొప్పాయి, ఆరెంజ్, స్ట్రాబెర్రీస్, రాస్ బెర్రీస్, అవకాడో, జామ వంటివి మలబద్ధకం సమస్య తగ్గడానికి ఉపకరిస్తాయి.

వైద్య సాయం

చాలా రోజులుగా మలబద్ధకం సమస్య వేధిస్తుంటే వైద్యులను సంప్రదించాలి. ఇతత్రతా ఏదైనా సమస్య నివారణ కోసం మందులు వాడుతున్నట్టయితే వాటి గురించి తెలియజేయాలి. మలబద్ధకం సమస్యకు హైపో థైరాయిడిజం సమస్య కారణం అయి ఉండవచ్చు. ఎందుకంటే పేగులకు తగినంత మూమెంట్ కు ఈ హార్మోన్ తోడ్పతుంది. కొంత మంది మలబద్ధకం సమస్యకు ఫార్మసీ స్టోర్స్ నుంచి లాక్సాటివ్స్ తెచ్చుకుని వాడుతుంటారు. కానీ దినికి బదులు వైద్యుల సూచనతోనే వాటిని వాడాలి. ఎక్కువ మొత్తంలో ఈ లాక్సాటివ్ ను తీసుకుంటే నీరు తగ్గిపోయి ఎలక్ట్రోలైట్స్ కూడా లోపించవచ్చు. ఫలితంగా కిడ్నీ, గుండె వైఫల్యాలు ఎదురవుతాయి. మెగ్నీషియం కూడా మలవిసర్జన సాఫీగా జరిగేందుకు ఉపయోగపడుతుంది. అయితే రోజుకు 310 గ్రాములకు మించి తీసుకోరాదు. దీర్ఘకాల మలబద్ధకం వల్ల రెక్టల్ దెబ్బతినిపోతే సర్జరీ చేయాల్సి వస్తుంది.

ప్రాణాయామంతో ఒత్తిడి దూరం!

ఆధునిక జీవన శైలి కారణంగా తరుచు అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం వల్ల అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు యోగాసనాలను, ప్రాణాయామాన్ని చేయడం వల్ల శారీరంగా, మానసింగా ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెప్తున్నారు.

ప్రాణాయామ విశేషాలు

ప్రాణం + ఆయామం = ప్రాణాయమం. ప్రాణమం టే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, నిశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్ధం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచుకోవచ్చు. నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటిలో ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాట న్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన; ఉదాన, వ్యానమ అనే 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థా నం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పచన క్రియకు సమానం, కంఠ శక్తికి ఉదానం, రక్తపస్రార క్రియకు వ్యానం తోడ్పడుతాయి. శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయటకి వదిలి




ఆపి ఉంచడాన్ని బాహ్య కుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్ర యోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూ ర్యనాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడ మ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ట అను అక్షరం సూ ర్యుడికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగమంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. ప్రాణాయా మ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబం ధించినదే.

ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు

ప్రాణాయామం వల్ల ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది. రక్త శుద్ధి జరిగి అందులోని చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది. గుండెకు సత్తువ లభిస్తుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి. జఠరాగ్ని పెరుగుతుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఆయుష్షు పెరుగుతుంది. తీసుకోవలసిన జాగ్రత్తలు మైదానంలోగాని, తోటలోగాని, తలువులు తెరచిఉన్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదైనా ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి. గాలి విపరీతంగా వీస్తూంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు. మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు. సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు. పొట్ట నిండుగా ఉన్నవుడు ప్రాణాయామం చేయకూడదు. ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేవు విశ్రాంతి తీసుకోవాలి. ప్రాణాయామం వేసినవుడు బట్టలు తక్కువగానూ, వదులుగానూ ధరించాలి. పద్మాసనం, సుఖాసనం, సిద్ధాసనం, వజ్రాసనం ప్రాణాయామానికి అనువైన ఆసనాలు. నేల మీద కూర్చోలేనివారు, కుర్చి మీద నిటారుగా కూర్చొని ప్రాణాయామంచేయవచ్చు.

నడుం, వీవు, వెన్నెముక, మెడలను నిటారుగా ఉంచి ప్రాణాయామం చేయాలి. ప్రాణాయామం చేసేటవుడు ఒకసారి కుడి ముక్కు రంధ్రన్ని, ఒకసారి ఎడమ ముక్కు రంధ్రన్ని మూయవలసి ఉంటుంది. కుడి ముక్కు రంధ్రన్ని కుడిచేతి బొటన వ్రేలితోనూ, ఎడమ ముక్కు రంధ్రన్ని కుడిచేతి ఉంగరం వ్రేలితోనూ మూయాలి. ముక్కు రంధ్రలు సరిగా శుభ్రంగా లేకపోతే ప్రాణాయామం చేసే ముందు జలనేతి, సూత్రనేతి క్రియలు సక్రమంగా చేయాలి. అలాచేస్తే ప్రాణాయామం చేస్తున్నవుడు శ్వాస సరిగ్గా ఆడుతుంది. ప్రాణాయామ క్రియలు చేస్తూ ఉన్నవుడు మనస్సును పూర్తిగా శ్వాస ప్రశ్వాస క్రియలపై కేంద్రీకరిచాలి. వేరే యోచనలకు తావు ఇవ్వకూడదు.



సూర్య
cinema@suryaa.com

సినిమా




బరువు తో పాటు కండలూ పెంచుతున్నాడట ఈ చిన్నోడు

వైవిధ్యమైన సినిమాలతో, పాత్రలతో ఫేమ్ అవుతున్న నిఖిల్ ఇప్పుడు కిరాక్ పార్టీ సినిమా కోసం సన్నద్ధం అవుతున్నాడు. శరన్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్న చిత్రాన్ని ఏకె ఎంటర్‌టెన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో నిఖిల్ విద్యార్థి నాయకుడిగా కనిపించబోతున్నాడు. గెటప్ కూడా కొత్తగా ఉండబోతోందట. ఈ సినిమా కోసం నిఖిల్ కండలు పెంచబోతున్నాడు. అందుకోసం కసరత్తులు కూడా ముమ్మరం చేసేశాడట. కిరాక్ పార్టీ కోసం నిఖిల్ 12 కిలోలు బరువు పెరగాలని లక్ష్యం పెట్టుకొన్నాడట. ఇప్పటికే పది కిలోలు పెరిగాడట. మున్ముందు మరింత బరువు పెరిగి, పాత్రకు తగ్గట్టుగా మారడానికి కృషి చేస్తున్నాడు. ప్రస్తుతం 85 కిలోల బరువున్నా. ఇది సరిపోదు. ఇం కాస్త పెరగాలి.. అంటున్నాడు నిఖిల్. ఫస్ట్ లుక్ వస్తే గానీ... నిఖిల్ ఎంత కష్టపడ్డాడో, ఎందుకోసం కష్టపడ్డాడో అర్థం కాదు.

యద్ధ వీరుడి పాత్రలో సోనూ సూద్

క్రిష్ దర్శకత్వం లో బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ నటిస్తున్న చిత్రం మణికర్ణిక. ఇందులో ఆమె ఝాన్సీ లక్ష్మీబాయ్ పాత్రను పోషిస్తున్నారన్న విషయం విదితమే. చిత్రంలో నటుడు సోనూసూద్ సదాశివ్ అనే యుద్ధవీరుడి పాత్రను పోషిస్తున్నారు. ప్రస్తుతం సోనూ తన పాత్ర కోసం సిద్ధమౌతున్నారట.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజ జీవితంలోని పాత్రను పోషించడం సవాలుతో కూడుకున్నది. చరిత్రలోని ఈ పాత్రను పోషించడానికి కొంత పరిధి ఉంటాయి. క్రిష్‌లాంటి తెలివైన దర్శకుడు, నైపుణ్యంగల సాంకేతిక బృందంతో కలిసి పనిచేస్తున్నప్పుడు తప్పులు జరిగే అవకాశం ఉండదు. చిత్రాన్ని ఉత్తమంగా ప్రేక్షకులకు అందించడానికి కష్టపడుతున్నాం అని తెలిపారు. సోనూ గతంలో జోదా అక్బర్, షాహీద్-ఇ-అజం వంటి చారిత్మాక చిత్రాల్లో నటించారు.





అందాల ఆరబోతలో మాత్రం తగ్గేలా లేదీ భామ

సినిమాల్లో నటించే నటీమణులకు నిజజీవితం లో చెప్పుకోలేని ఎన్నో బాధలుంటాయి అని అందరికీ తెలిసినదే.. కానీ వారు చేస్తున్న వృత్తి కి మాత్రం ఆ బాధల వలన ఏవిధమైన అవాంతరం లేకుండా చూసుకుంటారు. అదే కోవలో ఇప్పుడు అమలా పాల్ కూడా చేరిపోయింది. ఈమె భర్తతో విడిపోవడం, సుచిలీక్స్ వంటి వివాదాలు చుట్టూ ముట్టినా అమలాపాల్ హీరోయిన్ గా తన జోరుని చూపిస్తూనే ఉంది. అమలాపాల్ అందాలకు కుర్రకారులో విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ క్రేజ్ తోనే ఈ భామ హీరోయిన్ గా దూసుకుపోతోంది. అమల ప్రస్తుతం 11 ఏళ్ల కితం వచ్చిన తిరుట్టు పయలే చిత్రం సీక్వెల్ లో నటిస్తోంది. ఈ చిత్రంలో బాబీసింహా హీరోగా నటిస్తున్నాడు. కాగా ఈ చిత్రం లో అమలది అందాల ఆరబోతకు ప్రాధాన్యత ఉన్న పాత్ర అని తెలుస్తోంది. ఈ అమ్మడు కూడా ఓ రేంజ్ లో తన గ్లామర్ తో రెచ్చిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల విడులైన ఫస్ట్ లుక్ లోనే తన నడుము సొగసుని చూపిస్తూ హీట్ పెంచేసింది. ఈ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ లా మారి పోయింది.



నాని లాగా మంచి పేరు తెచ్చుకుంది

తెలుగు సినిమాల్లో తెలుగమ్మాయిలు రాణించడం అరుదు. ఇక్కడ మంచి అవకాశాలు దక్కక చాలామంది తెలుగమ్మాయిలు తమిళ ఇండస్ట్రీకి వెళ్లిపోవడం తెలిసిందే. ఐతే చాన్నాళ్ల తర్వాత ఇప్పుడో తెలుగమ్మాయి మన సినిమాల్లో సత్తా చాటుకుంటోంది. ఆమే.. ఈషా రెబ్బా. అంతకుముందు ఆ తరువాత సినిమాతో కథానాయికగా పరిచయమై.. ఆ తర్వాత జెంటిల్ మన్ సినిమాలో నటించిన ఈషా.. ఈ మధ్య వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. రెండు నెలల కిందట విడుదలైన అమీతుమీ ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టింది. లేటెస్టుగా రిలీజైన దర్శకుడు సినిమాకు టాక్ ఏమంత బాగా లేనప్పటికీ ఈషాకు మాత్రం మంచి పేరే వచ్చింది.

దర్శకుడు నిర్మాత అయిన సుకుమార్ ఈషా మీద ప్రశంసలు కురిపించేశాడు. ఆమె హీరోయిన్లలో నాని లాగా మంచి పేరు తెచ్చుకుందని.. చాలా సహజంగా నటిస్తూ అందరినీ మెప్పిస్తోందని.. అందుకే ఆమెను లేడీ నాని.. లేడీ నేచురల్ స్టార్ అంటున్నారని సుకుమార్ పేర్కొనడం విశేషం. ఈషా పెర్ఫామెన్స్ గురించి తనతో చాలామంది చెప్పారని.. ఆమెకు మంచి ఫ్యూచర్ ఉందని.. ఆమె మున్ముందు మరిన్ని అవకాశాలు అందుకుంటుందని సుకుమార్ అన్నాడు. అలాగే తన అన్న కొడుకు.. దర్శకుడు హీరో అశోక్ మీద కూడా ప్రశంసలు కురిపించాడు సుకుమార్. అతడి గురించి కూడా అందరూ పాజిటివ్ గా మాట్లాడుతున్నారని చెప్పాడు. ఐతే ఈషాపై అందరూ ప్రశంసలు కురిపిస్తున్న మాట వాస్తవమే కాదు.. అశోక్ విషయంలో మాత్రం నెగెటివ్ ఫీడ్ బ్యాకే వినిపిస్తోంది.



సాంగ్స్ రికార్డింగ్ లో లోకరక్షకుడు

చంద్రాస్ ఆర్ట్ మూవీస్ బ్యానర్‌పై చంద్ర పర్వతమ్మ సమర్పణలో చంద్రశేఖర్ చంద్ర నిర్మిస్తున్న 'లోకరక్షకుడు' చిత్రం మార్చి లో లండన్ లో ప్రారంభమైన విషయం తెలిసిందే. బ్రహ్మం సి.హెచ్. ఈ చిత్రానికి దర్శకుడు. పలు భాషల్లోనూ, పలు దేశాల నటీనటులతో తెరకెక్కుతున్న ఈ చిత్ర లోగోని లండన్ పార్లమెంట్‌లో ఎమ్.పి. బాబ్ బ్లాక్‌మెన్ ఆవిష్కరించారు. ప్రస్తుతం ఈ చిత్రం చెన్నై లో సాంగ్స్ రికార్డింగ్ జరుపుకుంటుంది.

ఈ సందర్భంగా నిర్మాత చంద్రశేఖర్ చంద్ర మాట్లాడుతూ ఏసుక్రీస్తు జీవితం, మార్గం, సందేశం పలు వర్గాలలో, ప్రదేశాలలో శాంతి నింపే ఈయన చరిత్రని అత్యద్భుతంగా, క్రొత్త అంశాలతో తెరకెక్కిస్తున్నాము. ఈ చిత్రం లోని పాటలు ప్రస్తుతం చెన్నై దేవా గారి అమ్మ టాకీస్ స్టూడియోలో రికార్డింగ్ జరుపుకుంటున్నాయి. మంచి లిరిక్స్ కుదిరాయి. మ్యూజిక్ డైరెక్టర్ ఎ.కె. రిసాల్ సాయి గారు మంచి ట్యూన్స్ కంపోజ్ చేస్తున్నారు. సింగర్ మధుబాల కృష్ణన్, గీతామాధురి, హేమాంబిక లు హృదయాలను కదిలించే విధంగా ఆలపిస్తున్నారు. అభినవ్ శ్రీనివాస్ రాసిన పాట ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రానికి సంబంధించి 2 షెడ్యూల్స్ పూర్తి అయ్యాయి. 3 వ షెడ్యూల్ ని ఆగష్టు 3 వ వారం నుండి ఫారిన్ ఆర్టిస్ట్ లతో కర్ణాటకలో జరుపనున్నాము అని అన్నారు. 15 దేశాల ఆర్టిస్ట్ లు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎ.కె. రిసాల్ సాయి, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: జి. క్రిష్, రైటర్: డి. కృపాకర్, లిరిక్స్: డి. కృపాకర్, అభినవ్ శ్రీనివాస్, రామ్ పైడిశెట్టి; సమర్పణ: చంద్ర పర్వ

కవర్ పేజ్ గురించి హంగామా

సినిమాలులో నటించే ఆడవాళ్ళు ముఖ్యంగా ఎదురుకునే సమస్య ఏంటిటే వాళ్ళ అందం పై వచ్చే విమర్శలు. మామూలు హీరోయిన్ అయితే పర్వాలేదు కానీ కొంచం స్టార్ హీరోయిన్ అయితే మాత్రం ఆమె పైనే అందరి కళ్ళు పడతాయి. ఏమి చేస్తుంది ఎక్కడకు వెళుతుంది అలా ఉందేంటి ఆమె అది చేస్తున్నది ఇలాంటివాన్ని ఆమె పై దాడి చేస్తాయి. వీటితో పాటు ఇప్పుడు ఇంటర్నెట్ లో సోషల్ మీడియా పెరిగినప్పటి నుండి ఆమె అందాలుతో గలాటా చేస్తూ ఉంటారు కొంతమంది తుంటరోళ్ళు.

దీపికా పదుకొనె ఒక ఫేమస్ మ్యాగజైన్ కోసం ఆ మధ్య ఒక హాట్ ఫోటో షూట్ చేసింది. ఇప్పుడు అదే మ్యాగజైన్ కవర్ పై ఒక ఆఫ్రికన్ అమెరికన్ మగడుతో నూడ్ గా కనిపించే ఫోటో ఒకటి సోషల్ మీడియా లో వైరల్ అయ్యింది. కాకపోతే ఈ ఫోటో చూడగానే తెలిసిపోతుంది ఎవరో మార్ఫింగ్ చేసి ఫోటో ఎడిటింగ్ చేసి పెట్టారని. దీన్ని పట్టుకుని దీపిక తొలి నూడ్ కవర్ అంటూ రచ్చ చేస్తున్నారు. హీరోయిన్ల ముఖాలకు వేరే నూడ్ బాడీ ని జత చేసి ఫోటో ఎడిట్ చేసిన ఫోటోలును ఇది వరకు మనం చాలానే చూశాం. ఇప్పుడు దీపికాకు కూడా అటువంటి





పెళ్లిపై క్లారిటీ

భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన బాహుబలి సిరీస్ చిత్రాలతో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ రేంజి ఎక్కడికో వెళ్లిపోయింది. బాలీవుడ్ అతడికి ఇప్పుడు రెడ్ కార్పెట్ పరిచేస్తోంది. అయితే తనకు ఇంత కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన టాలీవుడ్ను వీడేందుకు అతడు ససేమిరా అంటున్నాడు. మరోవైపు ముదురు బెండకాయ కాకముందే బాహుబలి పెళ్లి జరిగితే బాగుంటుందని కూడా అతడి అభిమానులు కొరుకుంటున్నారు.

బాహుబలి రెండు చిత్రాలతో పాటు అంతకు మరో రెండు చిత్రాల్లో అతడితో కలిసి నటించిన బొద్దుగుమ్మ అనుష్కతో ప్రభాస్ పెళ్లి ఫిక్సయించదని త్వరలోనే వారిద్దరూ ఒక్కటి కానున్నారన్న వార్తలు కూడా మొన్నామధ్య షికారు చేశాయి. అయితే వెనువెంటనే వాటికి తెరపెట్టేందుకు సిద్ధమైన అనుష్క అలాంటి వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పేసింది. అయితే ప్రభాస్ మాత్రం ఇప్పటిదాకా తన పెళ్లిపై గానీ తన పెళ్లిపై అనుష్కతో తన పెళ్లిపై జరుగుతున్న ప్రచారంపై ఇప్పటిదాకా స్పందించిన దాఖలా కనిపించలేదు. అయితే ఎంతో కాలం అతడు ఇలా నోరు కట్టుకుని ఉండలేడు కదా.

అందుకేనేమో ప్రభాస్ తన పెళ్లి గురించి తొలిసారిగా నోరు విప్పాడు. ఒక హీరో... ఒక హీరోయిన్ వరుసగా రెండు మూడు సినిమాలు చేస్తే ఇలాంటి రూమర్లు రావడం సహజమేనని ప్రభాస్ తెలిపాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా హల్ చల్ చేసే ఇలాంటి పుకార్లు మొదట్లో తనకి ఇబ్బంది కలిగించేవనీ ఆ తరువాత వాటిని గురించి పట్టించుకోవడం మానేశానని చెప్పాడు. ఇక తన ఇంట్లో పెళ్లికి సంబంధించిన ముచ్చట్లు జోరందుకున్నాయనీ త్వరలోనే పెళ్లి జరగవచ్చనే వార్తల్లోనూ నిజం లేదని కుండబద్దలు కొట్టేశాడు. ప్రస్తుతం తన దృష్టి 'సాహో' సినిమాపైనే ఉందనీ ఆ సినిమా పూర్తయిన తరువాత పెళ్లి గురించి ఆలోచిస్తానని అతడు చెప్పుకొచ్చాడు.

ఆమె పిల్ల కాదు తల్లి అని
తెలుసుకుని వదిలేసిన కిడ్నాపర్లు

రోమ్ : బ్రిటన్‌లో ఇద్దరు వ్యక్తులు ఓ మోడల్‌ను కిడ్నాప్ చేసి ఇంటర్నెట్ వేదికగా అమ్మేద్దామనుకుని చివర్లో ఫెయిలయ్యారు. తాము కిడ్నాప్ చేసి తీసుకువచ్చింది పిల్ల కాదు, తల్లి అనుకుని ఆమెను విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ ప్రకటనకు సంబంధించి మిలాన్‌లో ఫోటో షూట్‌లో పాల్గొనేందుకు 20 ఏళ్ల మోడల్ ఓ అపార్ట్‌మెంట్‌కు వెళ్లింది. అక్కడ లుకాజ్ హెర్బా, అతని సహాయకుడు ఆమెకు కెటమైన్ అనే మత్తుమందు ఇంజెక్షన్ ఇవ్వడంతో స్పృహ కోల్పోయింది. ఆ తరువాత వారిద్దరూ ఆ మోడల్‌ను వివస్త్రను చేశారు. ముఖాన్ని దిండుతో, నోటిని ప్లాస్టర్‌తో కప్పేశారు. అక్కడి నుంచి ఆమెను మరో ప్రాంతానికి తరలించి బంధించేశారు. ఆమె ఫోటోను ఓ వెబ్‌సైట్‌లో ఉంచి వేలం ప్రకటించారు. ప్రారంభ ధరగా 3,53,000 డాలర్లు ఖరారు చేశారు. మన కరెన్సీలో అయితే రూ. 2.24 కోట్లు. ఆ యువతి పని చేస్తున్న మోడలింగ్ ఏజెన్సీని కూడా సంప్రదించి 3 లక్షల డాలర్లు ఇస్తే ఇంటర్నెట్‌లో వేలం ఆపేస్తామని ఆఫర్ ఇవ్వడం విశేషం. అయితే, అంతలోనే సదరు మోడల్‌కు పెళ్లయిందని, ఆమెకు రెండేళ్ల చిన్నారి కూడా ఉన్నట్టు తెలుసుకున్న హెర్బా ఆమెను విడుదల చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే, చంపేస్తానని బెదరించాడు. అంతే కాదు, 50 వేల డాలర్లను బిట్‌కాయిన్ల రూపంలో నెలాఖరులోగా చెల్లించేందుకు ఒప్పందంపై సంతకం చేయించుకుని మరీ విడిచి పెట్టాడు. ఎందుకంటే, కిడ్నాపర్లు పాటించే నిబంధనల ప్రకారం తల్లులను కిడ్నాప్ చేయకూడదు. ఆ మోడల్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు హెర్బా, అతడి అనుచరుడిని అరెస్ట్ చేశారు.

తనయుడు తప్పు చేస్తే శిక్ష తండ్రికా?

చండీగఢ్ : హర్యానా బీజేపీ చీఫ్ సుభాష్ బరాలాకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఖట్టర్ మద్దతుగా నిలిచారు. ఓ యువతిపై లైంగిక వేధింపుల కేసులో బరాలా కుమారుడు వికాస్ బరాలాను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ప్రతిపక్షాలు సుభాష్ బరాలాను లక్ష్యంగా చేసుకుని విమర్శల దాడికి దిగాయి. దీనిపై ఖట్టర్ స్పందిస్తూ కొడుకు తప్పు చేస్తే తండ్రిని శిక్షించడం సరి కాదని అన్నారు. ఇది బరాలా కుమారుడికి సంబంధించినదని, ఈ విషయంలో పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తాను భావిస్తున్నానని చెప్పారు.

టార్గెట్ ఇండియా!

- చైనా మిలిటరీ ఆపరేషన్
- 'గ్లోబల్ టైమ్స్' పత్రిక హు ఝియాంగ్
- చైనా 15 పేజీల వివరణాత్మక పత్రాల విడుదల

బీజింగ్ : యుద్ధోన్మాద చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' మరోసారి డోక్లామ్ వివాదంపై చెలరేగిపోయింది. డోక్లామ్‌లో మోహరించిన భారతీయ సైన్యాన్ని తరిమికొట్టేందుకు చిన్న స్థాయి మిలిటరీ ఆపరేషన్‌ను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) ఈ వారాంతంలో చేపట్టనున్నదని 'నిపుణుల'ను ఉటంకిస్తూ ఆ పత్రిక చెప్పుకొచ్చింది. 'చైనా భూభాగంలోకి భారత సైనికుల చొరబాటును ఎక్కువ కాలం చైనా సహించలేదనే విషయాన్ని గడచిన 24 గంటల్లో చైనా వైపు నుంచి వెలువడిన వ్యాఖ్యలు భారత్‌కు తెలిపాయి. అయినా, భారత్ వెనుకకు తగ్గడానికి నిరాకరిస్తే రెండు వారాల్లోపు చైనా చిన్న స్థాయి మిలిటరీ ఆపరేషన్‌ను చేపట్టవచ్చు' అని 'గ్లోబల్ టైమ్స్' పత్రిక హు ఝియాంగ్‌ను ఉటంకిస్తూ సూచించింది. దాదాపు రెండు నెలలుగా వివాదాస్పద డోక్లామ్ ప్రాంతంలో భారత్, చైనా సైన్యాల మధ్య ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌ను చొరబాటుదారుగా అభివర్ణిస్తూ చైనా 15 పేజీల వివరణాత్మక పత్రాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. డోక్లామ్ నుంచి భారత సైనికులు స్వచ్ఛందంగా, బేషరతుగా వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేసింది. డోక్లామ్ ప్రతిష్టంభన నెలకొని 50 రోజులైంది. నిజానికి అది భూటాన్ భూభాగం. అక్కడ చైనా రోడ్డు నిర్మించే ప్రయత్నం చేయగా అది తమ ప్రయోజనాలకు భంగకరమని భారత్ అడ్డుపడింది. కానీ చైనా మాత్రం వివాదాన్ని పెద్దది చేయడం ద్వారా తాము అనుకున్నది సాధించింది. అక్కడ ఏదో వివాదాస్పద అంశం ఉందనే అభిప్రాయాన్ని అంతర్జాతీయంగా కలిగించడంలో విజయవంతమైంది. చైనా తమ భూభాగాన్ని విస్తరించే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. తొలుత సైనిక బలంతో ఇతర దేశాల భూభాగాన్ని దురాక్రమణ చేయడం, తరువాత అది తమ అంతర్భాగమని అన్ని అంతర్జాతీయ వేదికలపై నొక్కి చెప్పడం. సాధ్యమైనంత ఎక్కువగా అంతర్జాతీయ వేదికలపై దీని ప్రస్తావన తెస్తుంది. ఫలితంగా సదరు చైనా ఆక్రమిత భూభాగం కాస్తా వివాదాస్పద భూభాగంగా మారిపోతుంది. మరో విధానాన్ని కూడా డ్రాగన్ అనుసరిస్తోంది. చిలక్కొట్టుడుతో ప్రారంభించి మెల్లిగా దురాక్రమణను విస్తరిస్తుంది. దక్షిణ చైనా సముద్రంలో పారాసెల్స్, స్ప్రాట్లీ దీవుల సముదాయాలు పూర్తిగా తమవేనని చెప్పడం, కృత్రిమ దీవులను నిర్మించి ఆర్మీ బేస్ కింద మార్చేందుకు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం... ఇలాంటిదే. డోక్లామ్ కవ్వింపును కూడా చైనా విస్తరణ కాంక్షలో భాగంగానే ప్రపంచ దేశాలు చూడాల్సిన అవసరం ఉంది. 1949లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పటి నుంచీ చైనా దురాక్రమణల ద్వారా తమ భూభాగాన్ని విస్తరిస్తూనే ఉంది.



ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



చెన్నై : చెన్నైలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దగ్ధం చేశారు. గుజరాత్ వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన రాహుల్ గాంధీ కారుపై జరిగిన దాడిని ఖండిస్తూ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చిత్రపటాలను కూడా తగులబెట్టారు. సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లిన పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. ఈ ఘటన కారణంగా అర గంటకు పైగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

నాన్నగారిని ఇంత ఉన్నత స్థానానికి ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది

వెంకయ్య నాయుడు కూతురు దీపా వెంకట్



న్యూఢిల్లీ : ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి ఎం. వెంకయ్య నాయుడు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబం చాలా సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెంకయ్య నాయుడు కూతురు దీపా వెంకట్ మాట్లాడుతూ, 'నాన్న గారిని ఇంత ఉన్నత స్థానానికి ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంత మందిలో ఆయనకు ఈ అవకాశం రావడం అదృష్టం. ఆ అవకాశాన్ని ఆయన్ని సద్వినియోగం చేస్తారనే విశ్వాసం ఉంది. నాన్నగారి నుంచి నేర్చుకున్నది, అబ్బురపడిపోయేది ఏమిటంటే, ఎక్కడా కూడా ఆయన ఆగకపోవడం. ఫుల్ స్టాప్ అనేది లేకుండా కొనసాగారు. గెలిచినా అలానే ఉండేవారు, ఒకవేళ ఓడిపోతున్నామని తెలిసినా కూడా తల్లీ మనం ఓడిపోతున్నాం. ఏమీ ఇబ్బంది లేదు అని చెప్పేవారు. ఆ సిద్ధాంతమే ఆయన్ని ఇంత దూరం తీసుకువచ్చింది. పార్టీ తనకు తల్లి వంటిదని ఎప్పుడూ చెబుతుంటారు. చిన్న తనంలోనే ఆయన తన తల్లిని కోల్పోయారు. డిస్టర్బ్ చైల్డ్‌హుడ్‌లో ఉండీ కూడా ఆయన స్వశక్తితో ఎదిగారు. ఆర్ఎస్ఎస్‌తో విడదీయరాని బంధం ఆయనకు ఏర్పడిపోయింది. ఆర్ఎస్ఎస్ నుంచి బీజేపీలోకి నాన్నగారు రావడం జరిగింది. నాకు, మా అన్నయ్యకు అయితే మా లైఫే బీజేపీ. అప్పుడు పార్టీకి దీపం గుర్తు ఉండేదని నాకు దీప అనే పేరు మా నాన్నగారు పెట్టారు. సో, బీజేపీని, నాన్నగారిని వేర్వేరుగా చూడలేం. ఇప్పుడు, పార్టీలో నాన్నగారు లేరనే బాధ తప్ప వేరేదేమీ లేదు. పార్టీకి రాజీనామా చేసిన తరువాత నాన్నగారు ఎలా ఉండగలరనేది ఆలోచించలేకపోయాం, ఎందుకంటే, దానికి మా వయసు సరిపోదు కాబట్టి. ఎప్పుడూ కూడా ఫలానాది నాకు కావాలని నాన్నగారు ఎప్పు డూ ఆశించలేదు. మేము కూడా ఆయనకు ఏది సంతోషాన్ని కలిగిస్తుందో, అదే చేసేవాళ్లం' అని చెప్పుకొచ్చారు.

బీజేపీ వర్సెస్ సీపీఎం : రంగంలోకి జైట్లీ



తిరువనంతపురం : ఆరెస్సెస్ కార్యకర్త ఇటీవల హత్యకు గురి కావడం కేరళలో రాజకీయ కాక రేపుతోంది. బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలపై కేరళలో దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఏకంగా సీనియర్ మంత్రిని రంగంలోకి దింపడం గమనార్హం. కేరళలో సీపీఎంను రాజకీయంగా ఢీకొట్టాలని భావిస్తున్న బీజేపీ ఆదివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని తిరువనంతపురం పంపింది. రాజధాని తిరువనంతపురంలో ఇటీవల దారుణ హత్యకు గురైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని అరుణ్ జైట్లీ ఆదివారం పరామర్శించారు. ఆరెస్సెస్ కార్యకర్త అయిన 34 ఏళ్ల రాజేశ్‌పై గత శుక్రవారం రాత్రి రోడ్డుపై కొందరు వ్యక్తులు దాడి చేసి కొట్టి చంపారు. సీపీఎం కార్యకర్తలే రాజేశ్‌పై దాడి చేసి చంపారని బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజేశ్ కుటుంబాన్ని పరామర్శించిన జైట్లీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఓ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి ఏకంగా కేంద్ర సీనియర్ మంత్రి జైట్లీ రావడం వెనుక కేరళలో అధికారంలో ఉన్న సీపీఎంను దీటుగా ఎదుర్కోవాలనే బీజేపీ వ్యూహం కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

రాహుల్ కారుపై దాడి ఘటనలో ఓ వ్యక్తి అరెస్ట్

అహ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కారుపై దాడి చేసిన ఘటనలో పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వ్యక్తి జయేష్ దర్జీగా తెలుస్తోంది. ఆయన బీజేపీ యువజన విభాగానికి చెందిన నాయకుడు. దాడి నేపథ్యంలో, కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఆయనను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. గుజరాత్‌లోని వరద బాధిత ప్రాంతాల్లో శనివారం రాహుల్ గాంధీ పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో రాహుల్ కారుపై రాళ్లు రువ్వారు. అయితే, ముందు సీట్లో కూర్చున్న రాహుల్‌కు ఎలాంటి గాయమూ కాలేదు.

మోడల్‌ను కిడ్నాప్ చేసి..

రోమ్ : ఫోటో షూట్ కోసం వచ్చిన బ్రిటీష్ మోడల్‌ను కిడ్నాప్ చేసి ఆన్‌లైన్‌లో వేలానికి పెట్టిన వ్యక్తిని ఇటలీ పోలీసులు అరెస్ట్ చేశారు. వాణిజ్య ప్రకటనలో నటించేందుకు 20 ఏళ్ల మోడల్ మిలాన్ నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. అక్కడి నుంచే ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. లుకాజ్ హెర్బా అనే వ్యక్తి, మరొక వ్యక్తి కలసి ఆమెకు మత్తుమందు ఇచ్చారు. అపస్మారక స్థితిలోకి వెళ్లగానే ఆమెను నగ్నంగా ఫోటోలు తీశారు. తరువాత ఆమె కాళ్లు చేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్ వేసి సూట్‌కేసులో కుక్కేశారు. దీన్ని కారు డిక్కీలో వేసుకుని మిలాన్‌కు 120 కిలో మీటర్ల దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఇంటికి తరలించారు. ఆరు రోజుల పాటు ఆమెను అక్కడ బంధించారు. ఈలోగా బాధితురాలి ఫోటోలను లుకాజ్ సీక్రెట్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసి ఆమెను వేలానికి పెట్టాడు. కనీస ధర 353,000 డాలర్లుగా బిట్‌కాయిన్ రూపంలో నిర్ణయించాడు. మరో వైపు వేలం ఆపాలంటే 3 లక్షల డాలర్లు ఇవ్వాలని బాధితురాలిని పంపించిన మోడలింగ్ ఏజెన్సీని డిమాండ్ చేశాడు. అయితే, బాధితురాలికి రెండేళ్ల బిడ్డ ఉందని తెలుసుకుని కిడ్నాపర్లు ఆమెను విడిచిపెట్టారు. తల్లులను కిడ్నాప్ చేయడం తమ నిబంధనలకు విరుద్ధమని చెప్పి ఆమెను వదిలేశారు. తమ గురించి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదరించి ఆమెను పంపేశారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిలాన్ పోలీసులు లుకాజ్‌ను అరెస్ట్ చేశారు. గతంలో చాలా మందిని అతడు కిడ్నాప్ చేసినట్టు అనుమానిస్తున్నారు. బాలికలను కిడ్నాప్ చేసి ఆన్‌లైన్‌లో విక్రయించే 'బ్లాక్ డెత్ గ్రూప్'లో అతడు సభ్యుడని భావిస్తున్నారు.

మహిళా జర్నలిస్ట్‌పై కేసు

ముంబయి : వివాదాలతో సావాసం చేసే జాతీయ సెన్సార్ బోర్డు చైర్మన్ పహ్లాజ్ నిహ్లాని 23 ఏళ్ల మహిళా టీవీ జర్నలిస్టుపై కేసు పెట్టారు. తనను ఆమె వేధింపులు, భయాందోళనకు గురి చేస్తున్నారని గిర్‌గామ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'కార్యాలయ ప్రాంగణంలో నిరంతరం నా వెంట పడుతూ వేధింపులకు గురి చేస్తున్నారు. అత్యుత్సాహంతో నన్ను నిబ్బంది పెడుతున్నారు. అనవసరంగా ఫోటోలు తీస్తూ, సంబంధం లేని ప్రశ్నలు అడిగి విసిగిస్తున్నారు. ఆమె లోనికి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన మా కార్యాలయ సెక్యూరిటీ, సిబ్బందిపై దూషణలకు పాల్పడ్డారు' అని నిహ్లాని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అసందర్భ ప్రశ్నలు అడుగుతూ ఇబ్బంది పెడుతున్నారని, తన పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని నిహ్లాని ఆరోపించారు. అయితే. ఈ ఆరోపణలను సదరు టీవీ చానల్, రిపోర్టర్ తోసిపుచ్చారు. నిహ్లాని తన పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు.

గోపాలకృష్ణ గాంధీనే గుర్తు పట్టలేకపోయిన హేమమాలిని



న్యూఢిల్లీ : శనివారం జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ లో ఓ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. తన వోటు వేసేందుకు పార్లమెంట్‌కు వెళ్లిన బీజేపీ ఎంపీ, డ్రీమ్‌గర్ల్, నాటి సినీ నటి హేమమాలిని ప్రతిపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీని గుర్తు పట్టలేకపోయారు. వోటు వేసేందుకు హేమమాలిని అక్కడికి చేరుకోగానే మీడియా, ఫోటోగ్రాఫర్లు ఆమెను చుట్టుముట్టేశారు. ఆ తరువాత, కొంచెం సేపటికి, గోపాలకృష్ణ గాంధీ అక్కడికి రావడంతో మీడియా మొత్తం ఆయన వద్దకు చేరింది. దీంతో, ఆయన ఎవరు అని అక్కడి మీడియాను హేమమాలిని ప్రశ్నించింది. దీంతో, బిత్తరపోయిన మీడియా ఆమెకు ఆయనెవరో తెలియజెప్పింది. వెంటనే, గోపాలకృష్ణ గాంధీ వద్దకు వెళ్లిన హేమమాలిని, తనను తాను పరిచయం చేసుకున్నారు. దీనికి ఆయన స్పందిస్తూ, 'మిమ్మల్ని ఎవరు గుర్తు పట్టరు హేమాజీ' అని సరదాగా వ్యాఖ్యానించడం కొసమెరుపు.


మోడీ భద్రతకు ఇజ్రాయెల్ జాగిలాలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ భద్రతలో అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యంత పేరు ఉన్న స్నిఫర్ డాగ్స్‌ను దిగుమతి చేసుకున్నారు. పేలుడు పదార్థాలు, బాంబులను సమర్థంగా కనిపెట్టడంతో పాటు నేరస్థులను పట్టుకోవడంలోనూ స్నిఫ్ అండ్ అటాక్ డాగ్స్ కీలకంగా వ్యవహరిస్తుంటాయి. ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల భద్రతకు ఇప్పుడు వీటిని వినియోగిస్తున్నారు. ఇప్పడు అలాంటి జాగిలాలనే భారత ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి తెప్పించింది. గత ఏడాది 30 అటాక్ డాగ్స్, బాంబు స్నిఫర్ డాగ్స్, చేజర్లను జెరుసలామ్ నుంచి తెప్పించినట్లు సీనియర్ సెక్యూరిటీ అధికారి ఒకరు తెలిపారు. తాజాగా ఇజ్రాయెల్ రక్షణ రంగంలో మేటిగా నిలిచిన కానైన్లు – లాబ్రడార్లు, జర్మన్ షెపర్డ్‌లు, బెల్జియన్ మాలిటియోస్ జాతులను దిగుమతి చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ముప్పు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు భద్రతా అధికారులు తెలిపారు. వీటి ధర మాత్రం అధికారులు గోప్యంగా ఉంచారు. మోడీ గత నెలలో ఇజ్రాయెల్ పర్యటనలో ఆ దేశ ప్రధాని బెంజామిన్ నెతాన్యాహుతో భద్రత, రక్షణ తదితర అంశాల గురించి చర్చించారు. ఈ డాగ్స్‌కు దాదాపు 6 నెలల పాటు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ శిక్షణ కాలంలో కుక్కలకు ప్రత్యేకమైన ఆహారం, నివాస వాతావరణం ఏర్పాటు చేశారు. అంతే కాకుండా వాటికి స్విమ్మింగ్ పూల్ కూడా ఉంటుంది. తరచు వైద్యులు చేత పరీక్షలు కూడా చేయిస్తూ ఉంటారని భద్రతా అధికారి తెలిపారు. మాజీ ప్రధానుల కుటుంబాలకు సైతం ఈ భద్రత వర్తిస్తుంది.

పెళ్లికి అమెరికా అధ్యక్షుడినే ఆహ్వానించింది

టెక్సాస్ : కుమార్తె పెళ్లి ఏర్పాట్లలో ఓ తల్లి బిజీగా ఉంది. వివాహానికి ఎవరెవరిని పిలవాలో ఓ జాబితాను రూపొందిస్తోంది. తల్లి హడావుడిని చూసిన ఆమె కూతురు బంధువులకు, సన్నిహితులకు వివాహ ఆహ్వాన పత్రికలను పంపిస్తోందని అనుకుంది. అయితే, బరాక్ ఒబామా నుంచి ఓ లేఖ వచ్చేంత వరకూ ఆమెకు తెలియలేదు తన తల్లి తన వివాహ ఆహ్వాన పత్రికను అమెరికా అధ్యక్ష దంపతులకు పంపిందని. ఆ లేఖను చూసి కాసేపు ఆ కుటుంబం షాక్‌కు గురైంది కూడా. టెక్సాస్‌లో నివసిస్తున్న బ్రూక్ అలెన్ అనే యువతి వివాహం ఈ ఏడాది మార్చిలో జరిగింది. అయితే, గత ఏడాది డిసెంబర్‌లోనే పెళ్లి పత్రికలను పంచే పనిలో ఆమె తల్లి లిజ్ విట్లో నిమగ్నమైంది. ఆమె ఏకంగా అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, ప్రథమ మహిళ మిషెల్ ఒబామాకు ఆ ఆహ్వాన పత్రికలను పోస్ట్ చేసింది. కూతురికి మాత్రం ఈ విషయం తెలియదు. పెళ్లి అయిన అనంతరం ఒబామా దంపతుల నుంచి వివాహ శుభాకాంక్షలు చెబుతూ వారికి జూలై 27న ఓ లేఖ అందింది. అందులో 'ప్రేమ, ఆనందంతో మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాం. ఏళ్లు గడిచే కొద్దీ మీ వివాహ బంధం మరింత దృఢంగా మారాలని కోరుకుంటున్నాం' అని రాసి ఉంది. చివరగా ఒబామా దంపతుల సంతకాలు అందులో ఉన్నాయి. ఈ లేఖను చూసిన అనంతరం ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తమకు ఏకంగా ఒబామా దంపతులు శుభాకాంక్షలు చెప్పినందుకు ఆ జంట మురిసిపోతోంది. ఆ లేఖకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టగా వైరల్‌గా మారాయి.



ఉత్తర కొరియాపై మరిన్ని ఆంక్షలు

న్యూయార్క్ : అణ్వస్త్ర ప్రయోగాలతో అగ్ర రాజ్యాన్ని కలవరపెడుతున్న ఉత్తర కొరియా దూకుడుకు కళ్లెం వేసే దిశగా అమెరికా కీలక విజయం సాధించింది. ఆ దేశ ఎగుమతులపై ఆంక్షలు విధించాలని అమెరికా ప్రవేశ పెట్టిన ముసాయిదా తీర్మానాన్ని సమర్థిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఎగుమతుల ద్వారా అర్జిస్తున్న ధనంలో రూ. 100 కోట్ల డాలర్ల విదేశీ ద్రవ్యాన్ని ఉత్తర కొరియా నష్టపోవాల్సి వస్తోంది. అమెరికాను నాశనం చేయగల అణు వార్ హెడ్లు తమ వద్ద ఉన్నాయని కొంత కాలంగా అణు ప్రయోగాలు చేస్తూ ఉత్తర కొరియా కవ్వింపుచర్యలకు పాల్పడుతోంది. రష్యా, చైనా ఉత్తర కొరియాకు ప్రధాన ఆర్థిక భాగస్వాములుగా ఉన్నాయని ఆరోపిస్తున్న అమెరికా ఈ దేశాలతో వాణిజ్య సంబంధాలతో అర్జిస్తున్న ధనాన్ని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జంగ్ హూంగ్ అణు ప్రయోగాలపై ఖర్చు చేస్తున్నారని ఆక్షేపిస్తున్నది. ఎగుమతులపై నిషేధం విధించడం ద్వారా అణ్వస్త్ర ప్రయోగాల్లో ఉత్తర కొరియా దూకుడు స్వభావాన్ని నియంత్రించాలని కోరుతూ అమెరికా సమితి భద్రతా మండలిలో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. తీర్మానం ఆమోదం పొందడం వల్ల ఉత్తర కొరియా ప్రధాన ఎగుమతులైన బొగ్గు, ఇనుప ఖనిజం, సముద్ర ఉత్పత్తులు నిలిచిపోనున్నాయి.



సరదాగా చేపలు పట్టిన పుతిన్

మాస్కో : అధికారిక కార్యక్రమాలు, విదేశీ పర్యటనలతో ఎప్పుడూ బిజీగా ఉండే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సరదాగా గడిపారు. మరోసారి సాహస క్రీడలతో ఆకట్టుకున్నారు. అధికారిక కార్యక్రమాలకు కాస్త విరామం ఇచ్చి విహార యాత్రలో చేపలు పట్టారు. ప్రపంచంలోనే లోతైన బైకాల్‌లో స్వయంగా బోటును నడుపుతూ, షికారు చేయడమే కాక ఈత కొట్టారు. సంవత్సరంలో నాలుగైదు నెలలు మంచుతో గడ్డ కట్టి ఉండే బైకాల్ సరస్సు వేసవి కావడంతో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. సైబీరియా ప్రాంత అందాలను ఆస్వాదిస్తూ విహరించిన పుతిన్ కొండ ప్రాంతాల్లో తిరుగుతూ ఉల్లాసంగా గడిపారు. పుతిన్ విహారయాత్ర వీడియోలు రష్యా మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండగా గతంలోనూ ఆయన ఇలాంటి ఎన్నో సాహసాలు చేసిన విషయాలను అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు.



'అదృష్టవంతురాలిని నన్ను రేప్ చేయలేదు'

చండీగఢ్ : హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా కొడుకు వికాస్ చేతిలో వేధింపులు ఎదుర్కొన్న బాధితురాలు తాజాగా తన అభిప్రాయాలను ఫేస్‌బుక్‌లో వెల్లడించారు. తాను సామాన్యుడి బిడ్డను అయితే ఈ కేసును ఇంత సీరియస్‌గా తీసుకొని ఉండేవారు కాదేమోనని ఆమె తెలిపారు. ఐఏఎస్ అధికారి కూతురు అయిన ఆమె గత శుక్రవారం రాత్రి తాను ఎదుర్కొన్న భయానక అనుభవాన్ని వివరించారు. 'ఆ రాత్రి నేను ఎంతో భయపడ్డాను. నా చేతులు వణికాయి. భయంతో వెన్ను జలదరించింది. ఒక వైపు విస్మయం... ఇంకో వైపు కళ్లలో నీళ్లు... నేను ఈ రోజు ఇంటికి వెళతానా? లేదో తెలియని భయం. పోలీసులు ఎప్పుడు వస్తారో ఎవరికి తెలుసు' అంటూ ఆమె వివరించారు. 'శుక్రవారం రాత్రి చండీగఢ్ రోడ్డు మీద దాదాపు కిడ్నాప్ అయ్యేదాన్ని' అంటూ ఆమె శనివారం పెట్టిన పోస్టును ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎంతో మంది ఈ పోస్టును షేర్ చేసుకుంటున్నారు. 'సామ్యానుడి కూతురిని కాకపోవడం నా అదృష్టమేమో? ఎందుకంటే, అలాంటి వీఐపీలను సామాన్యులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందా? నాపై రేప్, హత్య వంటి దుర్మార్గాలు జరగకపోవడం కూడా నా అదృష్టమే అనుకుంటున్నా' అని ఆమె పేర్కొన్నారు. ఎందుకంటే బలమైన రాజకీయ ప్రాబల్యమున్న కుటుంబాలకు చెందిన వ్యక్తులు వెంటాడి వేధించరని ఆమె అన్నారు. ఆమెను నడి రోడ్డుపై వెంటాడి వేధించిన కేసులో బీజేపీ చీఫ్ సుభాష్ బరాలా కొడుకు వికాస్ బరాలాతో పాటు అతని స్నేహితుడ్ని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. చండీగఢ్‌లో శుక్రవారం రాత్రి బాధితురాలు కారులో తన ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న వికాస్, అతని స్నేహితుడు ఆశిష్ తమ ఎస్‌యూవీ వాహనంలో వెంబడించారు.



కారు ఆపాలని యువతిని పదే పదే హెచ్చరించారు. దీంతో ఆమె పోలీస్ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి విషయాన్ని తెలిపింది. పోలీసులు అక్కడికి చేరుకునే లోగా ఆమెను నిలువరించి మరీ ఆ ఇద్దరూ వేధించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలంలోనే వికాస్‌ను, ఆశిష్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసులు ఇద్దరు నిందితుల్ని బెయిల్‌పై విడుదల చేశారు. రాజకీయ ప్రాబల్యమున్న కుటుంబానికి చెందిన నిందితులపై పోలీసులు కిడ్నాప్ అభియోగాలు నమోదు చేయకపోవడంతో హర్యానాలోని బీజేపీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీలంకకు మరో ఎదురుదెబ్బ

కొలంబో : వరుస రెండు భారీ ఓటములతో టెస్టు సిరీస్‌ను భారత్ కు సమర్పించుకున్న శ్రీలంకకు మరో ఎదురుదెబ్బ తగిలింది. తొలి టెస్టులో ఆరు వికెట్లతో చెలరేగిన శ్రీలంక ప్రధాన పేసర్ నువాన్ ప్రదీప్ చివరిదైన మూడో టెస్టుకు దూరమయ్యాడు. దాంతో భారత్ తో జరిగే టెస్టు సిరీస్ నుంచి వైదొలిగినట్లయ్యింది.తొడ కండరాల గాయం కారణంగా భారత్‌తో జరిగే చివరిదైన మూడో టెస్టుకు నువాన్ అందుబాటులో ఉండటం లేదని శ్రీలం క జట్టు మేనేజర్ అశాంక గురుసిన్హా స్పష్టం చేశారు. సుమారు రెండు వారాల పాటు ప్రదీ ప్‌కు విశ్రాంతి అవసరమని, ఆ క్రమంలోనే మూడో టెస్టుకు దూరం అవుతున్న విషయాన్ని పేర్కొన్నారు. మూడు టెస్టుల సిరీస్ లో భాగంగా కొలంబో లో జరిగిన రెండో టెస్టు తొలి రోజే నువాన్ గాయపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్ వేస్తున్న సమయంలో నువాన్ తొడ కండరాల పట్టేశాయి. దాంతో అతను మైదానాన్ని వీడిపోయాడు. తొలి టెస్టులో మొద టి ఇన్నింగ్స్‌లో నువాన్ ప్రదీప్ 6 వికెట్లతో రాణించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత శ్రీలంక లో కీలక బౌలర్‌గా ఉన్న నువాన్ చివరి టెస్టుకు అందుబాటులో ఉండకపోవడం ఆ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ.



బోల్ట్‌కు కాంస్యం

- తుదిపోరులో మూడో స్థానంలో నిలిచిన జమైకా చిరుత
- గాట్లిన్‌కు స్వర్ణం... కోల్‌మన్‌కు రజతం
- ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు



లండన్ : ప్రపంచవ్యాప్తంగా తన పరుగుతో గత కొన్నేళ్లుగా అభిమానులను ఉర్రూతలూగించిన జమైకా బంగారు చిరుత ఉసేన్ బోల్ట్ కెరీర్‌లో అఖరి పరుగును మాత్రం కాంస్యంతో ముగించాడు. లండన్ వేదికగా జరుగుతున్న ఐఏఏఎఫ్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో బోల్ట్ చివరిసారిగా పాల్గొని కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి జరిగిన 100 మీటర్ల రేసులో మాత్రం తన జోరు కొనసాగించలేకపోయాడు. 9.95 సెకన్లలో రేసును పూర్తి చేసి మూడో స్థానానికి పరిమితమయ్యాడు. బోల్ట్ చివరి పరుగును చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయంగా ఎంతో మంది క్రీడాభిమానులను సంపాదించుకున్న బోల్ట్ చివరి పోరులోనూ గెలుపొంది తమను అలరిస్తాడని భావించిన ప్రేక్షకుల ఆశ నెరవేరలేదు.

విజేతకు అభినందనలు తెలిపిన బోల్ట్ దశాబ్దకాలంగా స్ప్రింట్ ఈవెంట్‌ను ఏకఛత్రాధిపత్యం ఏలిన బోల్ట్ తన కెరీర్ 100 మీటర్ల ఫైనల్లో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికా స్టార్ స్ప్రింటర్ జస్టిన్ గాట్లిన్ ఈ సారి బోల్ట్‌ను వెనక్కి నెట్టి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. 8 సార్లు ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన బోల్ట్‌ను 35 ఏళ్ల వయసులో గాట్లిన్ అధిగమించడం విశేషం. గాట్లిన్ 9.92 సెకన్లు, క్రిష్టియన్ కోలెమన్ (అమెరికా) 9.94 సెకన్లు, ఉసేన్ బోల్ట్ (జమైకా) 9.95 సెకన్లలో వంద మీటర్ల పరుగును పూర్తి చేశారు. ఐతే అమెరికాకు చెందిన మరో పరుగుల వీరుడు కోలెమన్ రజతం కైవసం చేసుకున్నాడు. పరుగు పూర్తయిన వెంటనే బోల్ట్ ఏమాత్రం నిరాశ చెందకుండా విజేతగా నిలిచిన గాట్లిన్‌కు అభినందనలు తెలిపి.. అభిమానుల వైపు వెళ్లి వారితో ముచ్చటిస్తూ.. ఫొటోలకు పోజులిస్తూ.. సెల్ఫీలు దిగాడు.

ఇప్పటికీ నేనే గ్రేటెస్ట్



వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో 100 మీటర్ల రేసులో బరిలోకి దిగి కాంస్య పతకంతో సరిపెట్టుకోవడం తన ఆధిపత్యాన్ని ఎంతమాత్రం తగ్గించదని జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ అభిప్రాయపడ్డాడు. ఇప్పటికీ తానే గ్రేటెస్ట్ అనడంలో ఎటువంటి సందేహం లేదన్నాడు'. ప్రపంచ గ్రేటెస్ట్ అథ్లెట్లలో నేను ఒక్కడ్ని అని ఎప్పుడో నిరూపించుకున్నా. లండన్ వ్యక్తిగత పరుగులో కాంస్య పతకంతో సరిపెట్టుకోవడం నా ఆధిపత్యాన్ని ఏమీ తగ్గించదు. నా అత్యుత్తమ పదర్శనిని ఇచ్చా. కాంస్య పతకం నన్ను నిరూత్సాహానికి గురి చేయడం లేదు. కాకపోతే నాపై కాస్త ఒత్తిడి పడింది. సరైన ఆరంభాన్ని ఇవ్వకపోతే వెనుకబడిపోతాను అనే విషయంపై ఒత్తిడికి లోనయ్యా. అదే నన్ను రేస్‌లో వెనుకబడటానికి కారణం కూడా కావొచ్చు. అయితే కొద్ది తేడాలో మాత్రం ప్రథమ స్థానాన్ని కోల్పోయా. ఇక తిరిగి వుంజుకోవడమే నా ముందున్న కర్తవ్యం'అని బోల్ట్ పేర్కొన్నాడు.

టెస్టు సీరీస్ భారత్ వశం

- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకున్న భారత్
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో ఆధిక్యం
- ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో రెండో టెస్టు విజయం
- భారత్ ఖాతాలో వరుసగా 8వ విజయం



కొలంబో : కోహ్లీ సేనకు ఎదురు లేదు. వారి అప్రతిహత జైత్రయాత్రకు తిరుగు లేదు. రికార్డులను చెరిపివేస్తూ సరికొత్త ఘనతలు లిఖిస్తూ టెస్ట్ క్రికెట్‌ను శాసించే దిశగా సాగిపోతోంది టీమిండియా. వరుసగా ఎనిమిదో సిరీస్ కైవసం చేసుకొంది. తొమ్మిది విజయాలతో ఉన్న ఆస్ట్రేలియాకు అడుగు దూరంలో నిలిచింది. శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ కైవసం చేసుకొంది భారత జట్టు. చివరి టెస్టు గెలిచి చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతోంది.

జడేజా మాయాజాలం

శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో టీమిండియా గెలిచింది. ఇన్నింగ్స్ 53 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. ఫాలో ఆన్‌లో 230 పరుగుల లోటుతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఆతిథ్య జట్టును టెస్టుల్లో నంబర్ వన్ బౌలర్ రవీంద్రజడేజా (5/152) కుప్పకూల్చాడు. ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు 92తో బ్యాటింగ్‌కు దిగి పాతుకుపోయిన కరుణరత్నె (141; 307 బంతుల్లో 16 ఫోర్లు)ను పెవిలియన్‌కు పంపించాడు. అప్పడు జట్టు స్కోరు 310. అంతకు ముందే చండిమాల్ (2)ను ఔట్ చేశాడు. మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ వుష్పకుమార (16)ను అశ్విన్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత వికెట్ల పతనం జోరందుకొంది. మాథ్యూస్ (36), దిల్రువన్ పెరీరా (4), ధనంజయ డిసిల్వా (17)ను జడేజా పెవిలియన్ పంపించాడు. డిక్వెలా (31)ను పాండ్యా, ఆఖరి వికెట్ నువాన్ ప్రదీప్ (1)ను అశ్విన్ ఔట్ చేశాడు. రంగనా హెరాత్ (17) నాటౌట్‌గా నిలిచాడు. 386 పరుగుల వద్ద శ్రీలంక పోరాటం ముగిసింది.

కలిసి కట్టుగా

చెతేశ్వర్ వుజారా (133), అజింక్య రహానె (132), రవీంద్ర జడేజా (70 నాటౌట్), సాహా (67), అశ్విన్ (54) అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో 622/9 వద్ద టీమిండియా తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అశ్విన్ (5/69) విజృంభించడంతో శ్రీలంక 183 పరుగులకే కూలి 439 పరుగుల లోటుతో ఫాలో ఆన్ ఆడింది. ఆతిథ్య జట్టులో కరుణరత్నె (141; 307 బంతుల్లో 16 ఫోర్లు), కుశాల్ మెండిస్ (110; 135 బంతుల్లో 17 ఫోర్లు) శతకాలతో అదరగొట్టడంతో భారత విజయం ఆల స్యమైంది. నాలుగో రోజు జడేజా ఐదు వికెట్లతో చెలరేగడంతో టీమిండియా 2-0తో సిరీస్ విజయం సాధించింది. విజయంలో కీలక పాత్ర పోషించిన జడేజా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కి ఎంపికయ్యాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్ : 622. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ : దిముత్ కరుణరత్నే సి రహనే బి అశ్విన్ 25, ఉపుల్ తరంగా సి రాహుల్ బి అశ్విన్ 0, కుసాల్ మెండీస్ సి కోహ్లీ బి ఉమేష్ 24, దినేష్ చండీమల్ సి హార్దిక్ పాండ్యే బి జడేజా 10, ఏంజిలో మ్యాథ్యూస్ సి పుజారా బి అశ్విన్ 26, నిరోషన్ డిక్‌వెల్ శమీ 51, ధనంజయ డీ సిల్వ బి జడేజా 0, దిల్‌రువాన్ పెరెరా బి అశ్విన్ 25, రంగనా హెరాత్ బి శమీ 2, పుష్పకుమార నాటౌట్ 15, ప్రదీప్ బి అశ్విన్ 0. ***అదనం-5. మొత్తం : (49.4 ఓవర్లలో ఆలౌట్) 183. బౌలింగ్ :*** మహ్మద్ శమీ 6-1-13-2, అశ్విన్ 16.4-3-69-5, జడేజా 22-6-84-2, ఉమేష్‌యాదవ్ 5-1-12-1.

శ్రీలంక రెండో ఇన్నింగ్స్ : కరుణరత్నే సి రహనే బి జడేజా 141, ఉపుల్ తరంగా ఉమేష్‌యాదవ్ 2, కుసాల్ మెండీస్ సి సాహా బి హార్దిక్ పాండ్యా 110, మలిందా పుష్పకుమార బి అశ్విన్ 16, దినేష్ ఛండీమల్ సి రహనే బి జడేజా 2, మ్యాథ్యూస్ సాహ బి జడేజా 36, డిక్‌విల్లా సి రహనే బి పాండ్యా 31, పెరెరా స్టంప్స్ బి జడేజా 4, డి సిల్వా సి రహనే బి జడేజా 17, హెరాత్ నాటౌట్ 17, ప్రదీప్ సి ధావన్ బి అశ్విన్ 1. ***అదనం-9. మొత్తం : (116.5 ఓవర్లలో ఆలౌట్) 386. బౌలింగ్ :*** ఉమేష్ 13-2-39-1, అశ్విన్ 37.5-7-132-2, మహ్మద్ శమీ 12-3-27-0, రవీంద్ర జడేజా 39-5-152-5, హార్దిక్ పాండ్యా 15-2-31-2.

అర్జున అవార్డుకు నేను అర్హుణ్ని కానా : బోప్పన్న



న్యూఢిల్లీ : తనను అర్జున అవార్డుకు ఎంపిక చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు భారత స్టార్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న. తన ఆటతో దేశానికి ఎంతో పేరు తెచ్చినా తనను ఇప్పటి దాకా అవార్డుకు పరిగణించకపోవడం అన్యాయమన్నాడు. ఈ విషయంలో అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ)దే బాధ్యత అని బోపన్న అన్నా డు. ఈ ఏడాది అర్జున అవార్డుకు తన పేరును ఏఐటీఏ కావాలనే ఆలస్యంగా సిఫారసు చేసిందని అతను విమర్శించాడు.

జడేజాపై ఒక మ్యాచ్ నిషేధం విధించిన ఐసీసీ


కొలంబో : శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్న తరుణంలో కోహ్లీ సేనకు పెద్ద షాక్ తగిలింది. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఐదుగురు లంకేయులను ఔట్ చేసి మ్యాచ్ గెలిపించిన స్పిన్నర్ రవీంద్ర జడేజాపై ఐసీసీ ఒక మ్యాచ్ నిషేధం విధించింది. ఐసీసీ క్రికెటర్ల నియమావళి ప్రకారం జడేజా 24 నెలల కాలంలో ఆరు డీమెరిట్ పాయింట్లకు చేరుకున్నాడు. రెండో టెస్టులో ఓపెనర్ దిముత్ కరుణరత్నె క్రీజులో ఉన్నప్పుడు జడేజా అనవసరంగా అతడిపైకి బంతి విసిరాడు. ఫీల్డ్ అంపైర్లు ఈ చర్యను ప్రమాదకరమని హెచ్చరించారు. ఇది లెవల్-2 తప్పిదం కావడంతో జడేజా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత కూడా విధించారు. ఆగస్టు 12 నుంచి పల్లెకల్‌లో జరిగే మూడో టెస్టు ఆడకుండా జడేజాపై నిషేధం విధించారు. అతడి స్థానంలో చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌కు జట్టులో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయి.

బుల్స్‌ను చిత్తు చేసిన పైరేట్స్

- 46-32 స్కోరు తేడాతో విజయం
- మరో మ్యాచ్‌లో యూపీ యోధా చిత్తు
- ఇండియన్ ప్రో కబడ్డీ లీగ్



నాగ్‌పూర్ : పట్నా పైరేట్స్ దుమ్ము రేపుతోంది. ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో మరో భారీ విజయం సాధించింది. సారథి పర్దీప్ నర్వాల్ 15 రైడ్ పాయింట్లతో చెలరేగడంతో ఆ జట్టు బెంగళూరు బుల్స్‌ను 46-32 తేడాతో చిత్తు చేసింది. ఆరంభంలో అద్భుతంగా ఆడిన బుల్స్‌ను పట్నా పైరేట్స్ వూహించని దెబ్బకొట్టింది. వరుస రైడ్ పాయింట్లు సాధించి ఆధిక్యం పెంచుకొంది. ఆ జట్టులో మోను గోయత్, వినోద్ కుమార్ తలో 7 పాయింట్లు సాధించారు. బెంగళూరులో అజయ్ కుమార్ ఒక్కడే 6 పాయింట్లు చేశాడు. బుల్స్ 22 రైడ్, 5 ట్యాకిల్, 5 అదనవు పాయింట్లు సాధించగా పట్నా 24 రైడ్, 12 ట్యాకిల్, 8 ఆలౌట్, 2 అదనవు పాయింట్లు సాధించింది.



యూపీ యోధా చిత్తు

ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో భాగంగా యూపీ యోధాతో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ విజయం సాధించింది. వినోద్ కుమార్ 8, జాన్ కున్ లీ 7, మణిందర్ సింగ్ 6 పాయింట్లతో చెలరేగడంతో బెంగాల్ 40-20 తేడాతో యూపీని చిత్తు చేసింది. యూపీ బెంగాల్‌కు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. బెంగాల్ 22 రైడ్, 9 ట్యాకిల్, 6 ఆలౌట్, 3 అదనవు పాయింట్లు చేసింది. యూపీ యోధా 13 రైడ్, 4 ట్యాకిల్, 3 అదనవు పాయింట్లు మాత్రమే సాధించింది.

భారత్‌తో మ్యాచ్‌లే వద్దు : మియాందాద్



కరాచీ : పాకిస్తాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ జావెద్ మియాందాద్ టీమిండియానుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐసీసీ టోర్నీల్లో భారత మ్యాచ్‌లను బహిష్కరించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)ని డిమాండ్ చేశారు. కెరీర్‌లో 124 టెస్టులు ఆడిన మియాందాద్ పాక్ జట్టుకు మూడు సార్లు కోచ్‌గా పనిచేశారు. ద్వైపాక్షిక సిరీస్‌లు వునరుద్ధరించడానికి ఇష్టపడకపోతే భారత్‌తో ఏ వేదికపైనా క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదన్నారు. ఐసీసీ టోర్నీల్లోనూ టీమిండియాతో ఆడొద్దని పీసీబీకి సూచించారు. దాంతో ఐసీసీకి నష్టాలు వస్తేగానీ పాక్‌కు సరైన గౌరవం దక్కదన్నారు. ఐసీసీ భారత్‌ను ఒప్పించకపోతే తాము మాత్రం ఎందుకు వారితో క్రికెట్ ఆడాలని ప్రశ్నించారు. బీసీసీఐ నుంచి పరిహారాన్ని ఆశించి పీసీబీ రూ.100 కోట్లను అనవసరంగా ఖర్చు చేస్తోందన్నారు. ఐసీసీలో బీసీసీఐ ఆధిపత్యం, మాట విలువ తెలిసీ ఎందుకలా చేస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఈ డబ్బును ఉపయోగిస్తే దేశ క్రికెట్ బాగుపడుతుందన్నారు.

రహానె రికార్డు క్యాచ్



భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఫీల్డర్ ఎవ్వరంటే... ఇట్టే గుర్తొచ్చే పేరు ఏక్‌నాథ్ సోల్కర్. బ్యాట్స్‌మన్ బాదిన బంతి గమనాన్ని త్వరగా అంచనా వేసి మెరువు వేగంతో ఒడిసిపట్టడంలో ఆయన సిద్ధహస్తుడు. ఆ సీనియర్ బాటలోనే నడుస్తున్నాడు టీమిండియా వెస్ కెప్టెన్ అజింక్య రహానె. తన చురుకైన ఫీల్డింగ్‌తో టెస్టుల్లో అత్యంత వేగంగా 50 క్యాచ్‌లు పట్టిన భారత రెండో ఫీల్డర్‌గా చరిత్ర సృష్టించాడు. శ్రీలంకపై విజయం సాధించిన రెండో టెస్టులో రహానె ఏకంగా ఐదు క్యాచ్‌లు పట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 25, రెండో ఇన్నింగ్స్‌లో 141 పరుగులు చేసిన దిముత్ కరుణరత్నె ఇచ్చిన క్యాచ్‌లను అతడే పట్టుకున్నాడు. ఇవి ఆట గమనాన్నే మార్చేయడంలో కీలకంగా నిలిచాయి. ఈ ఐదు క్యాచ్‌లతో 39 టెస్టుల్లో 50 క్యాచ్‌లు పూర్తిచేశాడు రహానె. అతని కన్నా ముందు ఏక్‌నాథ్ సోల్కర్ 26 టెస్టుల్లోనే ఈ ఘనత అందుకున్నాడు.

టైటిల్ వద్దు.. గొడవలు వద్దు



ముంబై : నాకు టైటిల్ వద్దు.. సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు వద్దు.. అని బాక్సింగ్ ఛాంపియన్ విజేందర్ సింగ్ అన్నారు. డోక్లామ్ సరిహద్దులో నెలకొన్న ప్రతిష్ఠంభన దృష్ట్యా తన టైటిల్‌ను వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమని విజేందర్ ప్రకటించాడు. శనివారం రాత్రి ముంబైలో జరిగిన బౌట్‌లో చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైటయాలిని ఓడించి ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్‌టైటిల్ గెలిచిన సంగతి తెలిసిందే. డోక్లామ్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ సామరస్యపూర్వక వాతావరణం నెలకొనాలని ఆశిస్తున్నాను. ప్రశాంత వాతావరణం నెలకొనాలని ఈ సందేశం ఇస్తున్నాను. నా టైటిల్‌ను ఇచ్చేందుకు సిద్ధం. ఇది చైనా ప్రజలకు, అక్కడి మీడియాకు చేరుతుందని ఆశిస్తున్నాను. అని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజేందర్ పేర్కొన్నాడు. చైనా, భారత్‌ల మధ్య డొక్లామ్ సరిహద్దు వివాదం గత కొన్ని రోజులుగా నెలకొన్న విషయం తెలిసిందే.

మ్యాచ్ చూస్తుంటే టెసన్ గుర్తొచ్చాడు! : విజేందర్‌పై ప్రశంలు

చైనా బాక్సర్ జుల్ఫికర్‌పై విజయం సాధించి ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను సొంతం చేసుకున్న విజేందర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ప్రొఫెషనల్ కెరీర్‌ను ఆరంభించిన తర్వాత ఓటమన్నదే ఎరుగక వరుస విజయాలతో దూసుకెళ్తున్న అతడికి అటు క్రీడాభిమానులతో పాటు బాలీవుడ్ ప్రముఖుల నుంచీ ప్రశంసలు వెల్లువెత్తాయి. మ్యాచ్‌ను స్వయంగా వీక్షించిన అమితాబ్, అభిషేక్ సహా మిగిలిన ప్రముఖులు సైతం విజేందర్‌కు ట్విటర్ ద్వారా అభినందనలు తెలిపారు. చైనాకు చెందిన ప్రత్యర్థిని ఓడించాడు. హోరాహోరీగా సాగిన పోరులో విజయం సాధించిన విజేందర్‌కు అభినందనలు అంటూ అమితాబ్‌బచ్చన్ కొనియాడారు. మ్యాచ్ చూస్తున్నంతసేపూ మహ్మద్ అలీ వర్సెస్ టైసన్ మధ్య పోరులా ఉంది. చెనా అతిథిని మట్టికరిపించావ్. టైసన్‌లా ఇలాగే కొనసాగాలి అంటూ రణ్‌దీప్ హుడా ట్వీట్ చేశారు. హోరా హోరీగా సాగిన మ్యాచ్‌లో విజయం సాధించినందుకు గర్వంగా ఉందని నేహా దూపియా, అద్నాన్ సమీ, కపిల్ శర్మ, అభిషేక్ బచ్చన్, రితేశ్ దేశ్‌ముఖ్ వంటి బాలీవుడ్ ప్రముఖులు విజేందర్‌ను ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·